తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

సోమవారం 09.06.2025 | సంపుటి : 11 | సంచిక : 321 | పేజీలు : 12 | వెల : రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




ఎట్టకేలకు..



## హైదరాబాద్‌కు ప్రభాకర్‌రావు


**నేడు విచారణకు హాజరుకానున్న ఎస్ఐబీ మాజీ చీఫ్**

**ట్యాపింగ్ కేసులో కీలకపరిణామం**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1గా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు అమెరికా నుంచి ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. సోమవారం సిట్ ఎదుట విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో గత ఏడాది మార్చి 10న ఆయనపై కేసు నమోదైంది. మరుసటి రోజే ప్రభాకర్‌రావు మూడు నెలల కాల పరిమితి

మిగతా 2లో..





## మంత్రివర్గ విస్తరణలో

# ముగ్గురికి ఛాన్స్

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ క్యాబినెట్ విస్తరణ జరిగింది. రాజ్‌భవన్‌లో నూతన మంత్రులుగా జి.వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు పాల్గొన్నారు. మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని నూతన మంత్రులను ఎంపిక చేసింది. దీనిలో భాగంగానే ఎస్సీల నుంచి వివేక్ (మాల), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (మాదిగ), బీసీల నుంచి వి.శ్రీహరి ముదిరాజ్‌కు అవకాశం కల్పించారు. గడ్డం వివేక్ చెన్నూరు నుంచి కాంగ్రెస్ తరపున

మిగతా 2లో..

**నూతన మంత్రులుగా ప్రమాణం చేసిన వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి**

**రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**


## దత్తాత్రేయ అజాత శత్రువు

నా స్కూల్ భాజపాలో, కాలేజీ తెదేపాలో.. ఉద్యోగం రాహుల్ గాంధీ వద్ద..

దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ 'ప్రజలకథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్

వార్త 2లో

# మైనార్టీలకు దక్కని మంత్రి పదవి



**విస్తరణలో మైనార్టీలకు మొండిచేయి**

**నాడు ఎన్టీఆర్,గతంలో కేసీఆర్ ఒకే ఒక్కరితో ప్రమాణం**

- బషీరుద్దీన్ బాబుఖాన్, మహమూద్ అలీకి మొట్టమొదటి ప్రాధాన్యత
- మజ్లిస్ ఒత్తిడి వల్లనే కాంగ్రెస్ కేబినెట్‌లో ముస్లింలకు నో ఛాన్స్ ?
- ప్రాతినిధ్యం లేకపోతే తెలంగాణలో కాంగ్రెస్ భవిష్యత్తు నష్టమని విశ్లేషకుల భావన

**హైదరాబాద్, జూన్ 8 (జనంసాక్షి):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రధాన కారణాల్లో మైనార్టీ ఓటర్లు కాంగ్రెస్ పార్టీ వైపు మర్లడం ఓ ప్రధాన కారణంగా పేర్కొనవచ్చు. 2014 నుంచి 2018 ఎన్నికల వరకు పదేళ్ల పాటు బీఆర్ఎస్‌తో మైనార్టీ ఓటర్ ఉన్నాడు. రాష్ట్రంలో 14శాతం ఉన్న మైనార్టీ ఓటర్లు గంపగుత్తగా 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం ద్వారా ప్రధాన పట్టణాలు, నగరపంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు దోహదపడిందనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఒకసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చరిత్రను సింహావలోకనం చేస్తే 1983-1984లో ఎన్టీఆర్ సీఎంగా ప్రమాణం చేసినప్పుడు తనతో పాటు ఒకే ఒక్క మంత్రితో కలిసి ప్రమాణం చేశారు. ఆయనే బషీరుద్దీన్ బాబుఖాన్..!2018లో రెండవసారి కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఒకే ఒక్క మంత్రి మహమూద్ అలీతో కలిసి ప్రమాణం చేశారు. ఎన్టీఆర్, కేసీఆర్ మైనార్టీల ప్రాధాన్యతను గుర్తించి తనతో పాటు ఇంకో మంత్రిని ప్రమాణ స్వీకార కార్యక్రమంలో భాగస్వామ్యం చేశారు. 2004లో వైఎస్

మిగతా 2లో..



**అవకాశం రాని అసంతృప్తులను**

## బుజ్జగిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణరాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆశించి నిరాశకు లోనైన ఎమ్మెల్యేలను బుజగించే కార్యక్రమాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం చేపట్టింది. మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఇవాళ ముగ్గురికి కేబినెట్‌లో చోటు దక్కింది. రాజ్‌భవన్‌లో ముగ్గురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రివర్గంలో చోటు లభించక నిరాశకు లోనైన సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి,

మిగతా 2లో..

# పోటెత్తిన జనం



- చేప ప్రసాదాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం
- కార్యక్రమంలో చోటుచేసుకున్న అపశృతి
- గుండెపోటుతో ఓ వృద్ధుడు మృతి

**హైదరాబాద్(జనంసాక్షి):** ఏటా మృగశిర కార్తె రోజు ప్రారంభించే చేపప్రసాదం పంపిణీ కార్యక్రమం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బత్తిని కుటుంబం అస్తమా రోగులకు చేప ప్రసాదాన్ని అందించింది. దాదాపు 170 ఏండ్లకు పైబడి నిస్వార్థంగా చేపప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న బత్తిని కుటుంబాన్ని పద్మశ్రీ అవార్డుకు సిఫారసు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చేపప్రసాదాన్ని తీసుకుంటే అస్తమా తగ్గిపోతుందని తరతరాలుగా ప్రజల ప్రగాఢ విశ్వాసం. అందులో భాగంగానే ఏటా మృగశిర కార్తె రోజున హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బత్తిని సోదరులు ఈ చేప ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ హాజరై ప్రారంభించారు. ప్రజల విశ్వాసాన్ని గౌరవిస్తూ ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తెలిపారు. చేప ప్రసాదం కోసం వచ్చిన

మిగతా 2లో..



**జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే**

# మాగంటి గోపీనాథ్ కన్నుమూత

**ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం ఆగిన తుదిశ్వాస**

**భౌతిక కాయానికి నివాళులర్పించిన సీఎం రేవంత్, భారాస అధినేత కేసీఆర్**

**హైదరాబాద్(జనంసాక్షి):** భారాసకు చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (62) కన్నుమూశారు. ఈనెల 5న (గురువారం) ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించారు.అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 5.45 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ మేరకు వైద్యులు వెల్లడించారు.ఈనెల 5న ఇంట్లో ఉండగా ఆయనకు గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు ఏఐజీకి తరలించారు. కార్డియాక్



అరెస్టుకు గురైనట్లు వైద్యులు తెలిపారు. సీపీఆర్ చేయడంతో తిరిగి గుండె కొట్టుకోవడం, నాడి, బీపీ సాధారణ స్థితికి రావడంతో... ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగించారు. కొన్నాళ్లుగా

మిగతా 2లో..

# అమెరికాలో మిన్నంటిన నిరసనలు




**లాస్ ఏంజెలెస్‌లో ఉద్రిక్తతలు తీవ్రరూపం**

- నిరసనకారుకు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు
- ఆందోళనకారులను కట్టడి చేయడంలో కాలిఫోర్నియా, లాస్ ఏంజెలెస్ గవర్నర్లు విఫలమయ్యారని ఆగ్రహం
- పలువురు అక్రమ వలసదారుల అరెస్టు



**వాషింగ్టన్(జనంసాక్షి):** అక్రమ వలసదారుల ఏరివేత నేపథ్యంలో ఫెడరల్ అధికారులు లాస్ ఏంజెలెస్‌లో చేపట్టిన ఆకస్మిక తనిఖీలు తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసిన సంగతి తెలిసిందే. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరసనకారులను తీవ్రంగా హెచ్చరించారు. ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా ఒక పోస్టు పెట్టారు. అందులో 'కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్, లాస్ ఏంజెలెస్ మేయర్ కరెన్ బాస్ తమ బాధ్యతలను నిర్వర్తించలేరు. ఈ విషయం అందరికీ తెలుసు. అప్పుడు ఫెడరల్ ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరిస్తుంది. ఆందోళనకారులు, దోపిడీదారుల సమస్య వలే

మిగతా 2లో..



# 6 వేలు దాటిన కోవిడ్ కేసులు

**దేశంలో 65మంది మృతి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో కొవిడ్ వ్యాప్తి రోజురోజుకీ పెరుగుతోంది. తాజాగా ఈ వైరస్ బారిన పడినవారి సంఖ్య ఆరు వేలు దాటింది. ఇప్పటి వరకు కొవిడ్‌తో దేశవ్యాప్తంగా 65 మంది మరణించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఆ శాఖ తాజా డేటా ప్రకారం.. జూన్ 8న ఉదయం 8 గంటల వరకు దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 6,133లకు చేరింది. గత 24 గంటల్లో 378 కొత్త కేసులు నమోదుకాగా.. ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కేరళలో అత్యధికంగా 1950 యాక్టివ్ కేసులు ఉండగా.. గుజరాత్, పశ్చిమబెంగాల్, దిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ..

మిగతా 9లో..

**ప్రభుత్వ సన్నబియ్యం**

# ఇక బహిరంగ మార్కెట్‌లో..



**తెలంగాణ బ్రాండ్ పేరుతో విక్రయాలు**

**పౌరసరఫరాల సంస్థ సన్నాహాలు • బియ్యం ధరపై అధికారుల కసరత్తు**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ బ్రాండ్ పేరుతో సన్న వడ్లను ప్యాక్ చేయించి ఓపెన్ మార్కెట్‌లో విక్రయించనున్నట్లు పౌరసరఫరాల సంస్థ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర అవసరాలకు మించి సన్న వడ్లు వస్తుండటంతో మిగులు ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి బియ్యాన్ని మిల్లింగ్‌చేయించి బియ్యంగా విక్రయించేందుకు పౌరసరఫరాల సంస్థ సిద్ధం అవుతోంది. ఈ సన్నబియ్యంలో బీపీటీ, ఆర్ఎన్ఆర్, జైశ్రీరాం రకాలకు మంచి డిమాండ్ ఉండగా ఈ మూడు కేటగిరీలను పౌరసరఫరాల సంస్థ ప్రత్యేకంగా నిల్వ చేయించింది.భారీ ఎత్తున వానాకాలం, యాసంగి సీజన్లలో సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. వానాకాలం తో పోలిస్తే యాసంగి పంటలో నూకలు అధికంగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వానాకాలంలో వచ్చిన వడ్లతో బియ్యాన్ని తయారు చేసి తెలంగాణ బ్రాండ్ పేరుతో విక్రయించనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. తెలంగాణ బ్రాండ్ పేరుతో రాష్ట్రంలో సూపర్‌మార్కెట్లు, కిరాణా దుకాణాలతో పాటు రేషన్ షాపుల్లోనూ ఈ బియ్యాన్ని విక్రయించనున్నట్లు తెలుస్తోంది. రేషన్ షాపుల్లో ప్రస్తుతం తెల్లకార్డు ఉన్నవారికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. అలాగే దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నవారికి ఏపీఎల్? కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. తెలంగాణ బ్రాండ్ బియ్యాన్ని ఏపీఎల్ కార్డుదారులు కొనుగోలు చేసేందుకు వీలుగా రేషన్ దుకాణాల్లో

మిగతా 2లో..

# రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు



- తులాలోని అజోట్ కెమికల్ ప్లాంట్‌పై బాంబుల వర్షం.. పలువురికి గాయాలు
- పలు విమానాశ్రయాల మూసివేత

**మాస్కో(జనంసాక్షి):** రష్యా- ఉక్రెయిన్ మధ్య దాడులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా మాస్కోలోని పలు ప్రాంతాలపై కీవ్ డ్రోన్ దాడులకు పాల్పడినట్లు రష్యా అధికారులు పేర్కొన్నారు. తమ బలగాలు తొమ్మిది డ్రోన్లను నేలకూల్చాయన్నారు. తులా ప్రాంతంలోని అజోట్ కెమికల్ ప్లాంట్‌పై డ్రోన్‌లు విరుచుకుపడడం వల్ల మంటలు చెలరేగడంతో పలువురు గాయాలపాలయినట్లు తెలిపారు. ఉక్రెయిన్ దాడులు కొనసాగుతుండడం వల్ల ముందు జాగ్రత్త చర్యగా వ్నుకోవో, డొమోడెడోవో విమానాశ్రయాలను మూసివేసినట్లు అధికారులు తెలిపారు.దీంతో పలు విమానాలు రద్దయ్యాయని, మరికొన్నింటిని ఇతర విమానాశ్రయాలకు మళ్లించామని అన్నా రు.ఈ దాడుల వల్ల ఎంత నష్టం వాటిల్లిందనే విషయాన్ని ధ్రువీకరించలేదు. రష్యా సైతం ఉక్రెయిన్‌పై ప్రతిదాడులకు పాల్పడడంతో పలు ప్రాంతాలల్లో

మిగతా 2లో..

**కొలంబియా అధ్యక్ష అభ్యర్థిపై**

## హత్యాయత్నం

ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా ఆ దేశ సెనేటర్, అధ్యక్ష అభ్యర్థి మిగ్యుల్‌ఉరిబ్‌టర్బేపై గుర్తుతెలియని వ్యక్తి కాల్పులు

2లో



## అన్నిరంగాల్లో మహిళల ముద్ర



అంతర్జాతీయ వేదికలపైనా మన దేశ కీర్తిని పెంచుతున్నారు

వారి అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం ప్రధాని మోదీ

2లో

# మైనార్టీలకు దక్కని మంత్రి పదవి

రాజశేఖర్ హయాంలో షబ్బీర్ అలీ, ఫరీదుద్దీన్‌కు ఇద్దరికీ మంత్రివర్గంలో చోటు కల్పించడం వారి ప్రాధాన్యతను తెలియజేస్తోంది. అయితే, రాష్ట్రంలో ఒకే ఒక్క కులాన్ని లెక్కించినప్పుడు ప్రధాన ఓటరుగా మైనార్టీలు ఉన్నారని చెప్పడం అతిశయోక్తి కాదు. రాష్ట్ర జనాభాలో అంతటి ప్రాధాన్యత గల వర్గాన్ని విస్మరించి ఇప్పటికే దాదాపు రెండేళ్ల పాలన పూర్తికావొస్తున్న నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణలోనైనా మైనార్టీలకు చోటు దక్కుతుందని అందరూ భావించారు. మొదట రాష్ట్రంలో ఒక్క మైనార్టీ అభ్యర్థి గెలిచి అసెంబ్లీకి రాకపోవడం, మండలిలో కూడా కాంగ్రెస్‌లో ప్రాతినిధ్యం లేకపోవడంతో మొదటి మంత్రివర్గ విస్తరణలో మైనార్టీలకు చోటుదక్కలేదు. ఆ తర్వాత సియాసత్ పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఆమెర్ అలీఖాన్‌కు ఎమ్మెల్సీ పదవి దక్కింది. ఆయనకు మంత్రివర్గంలో స్థానం లభించవచ్చని పరిశీలకులు భావించారు. కానీ, మజ్లిస్ పార్టీ ఒత్తిడి వల్ల కాంగ్రెస్ మంత్రివర్గంలో స్థానం లభించలేదని తెలుస్తోంది. ఏదేమైనా మంత్రివర్గంలో మైనార్టీలకు ప్రాతినిధ్యం లేకపోవడం ముున్ముందు తెలంగాణలో కాంగ్రెస్‌కు తీరని నష్టం మిగల్చనుందని పరిశీలకులు భావిస్తున్నారు.

## హైదరాబాద్‌కు ప్రభాకర్‌రావు

వీసాపై అమెరికా వెళ్లి తిరిగి రాలేదు. తాజాగా అమెరికా నుంచి భారత్ వచ్చేందుకు అవసరమైన ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్(ఈసీ-అత్యవసర పత్రం) జారీ అయింది. దీంతో ఆయన హైదరాబాద్‌కు చేరుకున్నారు.



# మంత్రివర్గ విస్తరణలో ముగ్గురికి ఛాన్స్

ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన ప్రముఖ కాంగ్రెస్ నేత జి.వెంకటస్వామి వారసుడి గా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2009 లో కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి ఎంపీగా గెలిచారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 2013లో తెరాస(ప్రస్తుతం భారాస)లో చేరారు. 2014 ఎన్నికల సమయంలో తెరాస నుంచి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. పెద్దపల్లి స్థానంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2016లో మళ్లీ వివేక్ తెరాసలో చేరారు. ఎంపీ టికెట్ దక్కకపోవడంతో 2019లో ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2019 ఎన్నికల తర్వాత భాజ పాలో చేరారు. 2023లో మళ్లీ కాంగ్రెస్‌లో చేరిన వివేక్.. చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచారు. 2024లో కాంగ్రెస్ తరఫున పెద్దపల్లి ఎంపీగా వివేక్ కుమారుడు వంశీ గెలిచారు. అడ్లూరి లక్ష్మణ్‌ను ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే మంత్రి పదవి వరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ధర్మపురి నియోజకవర్గం నుంచి గెలిచారు. భారాస అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై 2,229 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1968లో ఆయన కరీంనగర్ జిల్లాలో జన్మించారు. పెద్దపల్లి కళాశాలలో ఐటీఐ పూర్తి చేశారు. 1986-1994 మధ్య కరీంనగర్ జిల్లా ఎన్‌ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1996-2001 మధ్య ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2006లో ధర్మారం జడ్పీటీసీగా పోటీ చేసి గెలిచారు. 2009లో ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2010-2012 మధ్య కరీంనగర్ జడ్పీ ఛైర్మన్‌గా పనిచేశారు. 2009లో అసెంబ్లీ ఎన్నికలు, 2010 ఉపఎన్నికలో ఓడారు. 2013-14 మధ్య ఏపీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. 2018 నుంచి జగిత్యాల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు.

**వాకిటి శ్రీహరి రాజకీయ నేపథ్యమిది**

ఎమ్మెల్యే అయిన తొలిసారే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కింది. ఆయన 1972లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. భారాస అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై 17,522 ఓట్ల తేడాతో గెలిచారు. 2014-2018 మధ్య మక్తల్ జడ్పీటీసీ, జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2001-2006 మధ్య మక్తల్ సర్పంచిగా ఉన్నారు. నారాయణపేట్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శిగా పని చేశారు.

### అవకాశం రాని అసంతృప్తులను

# బుజ్జగించిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం

కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలను కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం బుజ్జగించాలని నిర్ణయించింది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ నేతల బుజ్జగింపుల దృష్ట్యా మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రెస్‌మీట్ వాయిదా వేసుకున్నారు.మంత్రివర్గ విస్తరణ అంటూ జరిగితే కచ్చితంగా సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి దక్కుతుందని జోరుగా ప్రచారం సాగింది. రాత్రి పొద్దు పోయే వరకు కూడా సుదర్శన్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు నాయకుల పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ, ఆయన పేరు మిస్ అయింది. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన సుదర్శన్‌రెడ్డిని బుజ్జగించేందుకు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి మీనాక్షి నటరాజన్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు వెళ్లారు. ఏ పరిస్థితుల్లో మంత్రి వర్గంలో అవకాశం రాకుండా పోయిందో ఆయనకు మీనాక్షి నటరాజన్ వివరించినట్లు తెలుస్తోంది. కేవలం సామాజిక సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని ఈ ఎంపిక జరిగినట్లు వివరించారని సమాచారం. అనంతరం నేతలు అక్కడినుంచి బేగంపేటలోని ప్రేమ్‌సాగర్ రావు నివాసానికి వెళ్లారు.

# కొలంబియా అధ్యక్ష అభ్యర్థిపై హత్యాయత్నం

**బొగోటా(జనంసాక్షి):**కొలంబియా సెనేటర్, అధ్యక్ష అభ్యర్థి మిగ్యుల్ ఉరిబ్ టర్బే (39)పై హత్యాయత్నం జరిగింది. ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆయనపై కాల్పులు జరిపాడు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం బొగోటా పార్కులో ఓ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మిగ్యుల్ ఆ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తుండగా.. ఓ దుండగుడు ఆయన వెనక నుంచి కాల్పులు జరిపాడు. అధికారులు వెంటనే అప్రమత్తమై మిగ్యుల్‌ను ఆస్పత్రికి తరలించారు. బొగోటా మేయర్ కార్లోస్ గాలన్ ఈ విషయన్ని ధ్రువీకరించారు. కాల్పులు జరిపినట్లు అనుమానిస్తున్న ఓ వ్యక్తిని కూడా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనను మిగ్యుల్ పార్టీ కన్జర్వేటివ్ డెమోక్రటిక్ తీవ్రంగా ఖండించింది. ఇది ఒక రాజకీయ నాయకుడిపై జరిగిన దాడి కాదని, దేశంలోని ప్రజాస్వామ్యం, స్వేచ్ఛపై జరిగిన దాడి అని పేర్కొంది. కాగా.. ఈ ఘటనను కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తీవ్రంగా ఖండించారు. మిగ్యుల్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది కొలంబియాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష కన్జర్వేటివ్ డెమోక్రటిక్ పార్టీ నుంచి మిగ్యుల్ పోటీలో ఉన్నారు.

# 6 వేలు దాటిన కోవిడ్ కేసులు..

అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డేటాబోర్డులో వెల్లడించిన సమాచారం ప్రకారం.. కేరళలో అత్యధికంగా 1950 కేసులు నమోదయ్యాయి. గుజరాత్ 822, పశ్చిమబెంగాల్ 693, ఢిల్లీ 686, మహారాష్ట్ర 595, కర్ణాటక 366, ఉత్తరప్రదేశ్ 219, తమిళనాడు 194, రాజస్థాన్ 132, హరియాణా 102, ఆంధ్రప్రదేశ్ 86, బిహార్ 49, ఛత్తీస్‌గఢ్ 41, మధ్యప్రదేశ్ 39, పంజాబ్ 35, ఒడిశా 33, సిక్కిం 23, పుదుచ్చేరి 15, తెలంగాణ 10, జమ్మూ కశ్మీర్, గోవా, ఉత్తరాఖండ్‌లలో ఒక్కో రాష్ట్రంలో 9 చొప్పున కేసులు, అస్సాం 6, ఝార?ండ్ 4, హిమాచల్ ప్రదేశ్ 3, చండీగఢ్ 2, త్రిపురలో ఒకరు వైరస్ బారినపడినట్లు తెలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్, మిజోరాంలలో ఎటువంటి కేసులు నమోదు కాలేదు.

# ప్రభుత్వ సన్నబియ్యం ఇక బహిరంగ మార్కెట్‌లో

అందుబాటులో ఉంచను న్నట్లు తెలుస్తోంది.తెలంగాణ బ్రాండ్‌తో విక్రయించే బియ్యానికి ధర నిర్ణయించాలని అధికా రులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు ప్రస్తుతం మార్కెట్లో ఉన్న సన్నబియ్యం ధరలను పరిశీలిస్తున్నారు. ధాన్యాన్ని ఎఫ్?సీఐకి ఇస్తే డబ్బులు రావడానికి కనీసం ఆరు నెలలు నుంచి ఏడాది వరకు సమయం పడుతుంది. అదే తెలంగాణ బ్రాండ్?తో బియ్యాన్ని విక్రయిస్తే వెంటనే డబ్బులు వస్తాయని ఉన్నతాధికారి పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ బియ్యాన్ని విక్రయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాల సమాచారం.



# దత్తాత్రేయ అజాత శత్రువు

- నా స్కూల్ భాజపాలో, కాలేజీ తెదేపాలో.. ఉద్యోగం రాహుల్ గాంధీ వద్ద.. :సీఎం రేవంత్
- పదవి ఉన్నా లేకున్నా ఆయనపై ఏమాత్రం గౌరవం తగ్గదు
- ఆయన నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమం తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి
- దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ 'ప్రజలకథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం

**హైదరాబాద్(జనంసాక్షి):** పదవి ఉన్నా లేకున్నా బండారు దత్తాత్రేయపై ఉన్న గౌరవం ఏ మాత్రం తగ్గదని, పార్టీలకు అతీతంగా అందరూ ఆయన్ను గౌరవిస్తారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.శిల్పకళావేదికలో జరిగిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ 'ప్రజలకథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లో ఎన్నో ఒడిదొడుకులు చూసినా దత్తాత్రేయ ఎప్పుడూ వెనకడుగు వేయలేదన్నారు.''గౌలిగూడ గల్లి నుంచి హరియాణా గవర్నర్ వరకు ఎదిగారు. సాధారణ ప్రజలతో ఆయనకు మంచి అనుబంధం ఉంది. పేదలు చేసుకునే చిన్న చిన్న వేడుకల్లో ఆయన భాగం అయ్యేవారు. దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి కుటుంబాలతో నాకు చాలా సన్నిహిత సంబంధాలున్నాయి. నా స్కూల్ చదువు భాజపాలో, కాలేజీ చదువు తెదేపాలో.. ఉద్యోగం రాహుల్ గాంధీ వద్ద చేస్తున్నా అని ఇటీవల ప్రధానికి చెప్పాను. నాకు ఉన్న సన్నిహిత సంబంధాలను ఎప్పుడు దాచుకోను. మంత్రివర్గ విస్తరణ ఉన్నా.. ఆ కార్యక్రమం అవ్వగానే దత్తాత్రేయ కోసం ఇక్కడికి వచ్చాను. ఆయన అజాత శత్రువు'' ''జాతీయ రాజకీయాల్లో వాజ్‌పేయీకి ఉన్న గౌరవం.. రాష్ట్రస్థాయిలో దత్తాత్రేయకు ఉంది. ఆయన నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమం తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి. ఆయన శైలి, విధానాల నుంచి కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారు నేర్చుకోవాలి. జంటనగరాల్లో కష్టం వస్తే ప్రజలకు గుర్తుకు వచ్చే నాయకులు పీజేఆర్, దత్తాత్రేయ. తిరుపతి దర్శనాలు, రైల్వే రిజర్వేషన్ కోసం మాకు సిఫార్సు లేఖలు ఇచ్చేవారు. మా నిర్ణయాల్లో వారి స్ఫూర్తి ఉంటుంది''అని అన్నారు.మంత్రివర్గ సమావేశం ఇక్కడే పెట్టుకోవచ్చుపుస్తకావిష్కరణ కార్యక్రమంలో పలు రాష్ట్రాల గవర్నర్లు, తెలంగాణ మంత్రులు పాల్గొన్నారు. దీంతో కార్యక్రమానికి హాజరైన అతిథులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి ఛలోక్తి విసిరారు. ఈ వేదిక గవర్నర్‌ల పరేడ్‌లా ఉందన్నారు. కాంగ్రెస్‌లో ఉన్న మంత్రివర్గం మొత్తం ఈ వేదికపైనే ఉందని, తాను మంత్రివర్గ సమావేశం ఇక్కడే పెట్టుకోవచ్చని సరదాగా వ్యాఖ్యానించారు.

## రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు

నివాస భవనాలు ధ్వంసమయినట్లు తెలుస్తోంది. శిథిలాల్లో చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. గత మూడేళ్లుగా రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతోంది. దీనికి ముగింపు పలికేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

## అల్లూరి జిల్లాలో విషాదం

**చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారుల మృతి**

**డుంబ్రిగూడ:** చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటన అల్లూరి జిల్లా డుంబ్రిగూడ మండలం గుంటసీమ పంచాయతీ కేంద్రంలో చోటు చేసుకుంది.జంగమయ్య ఆలయానికి ఎదురుగా ఉన్న చెరువులో ఈతకు దిగి వీరు మృతి చెందారు. మృతులను గుంటసీమ పంచాయతీ గంగవలస గ్రామానికి చెందిన కొర్ర సుశాంత్, కోతంగి పంచాయతీ బిల్లాపుట్ గ్రామానికి చెందిన గుంట భానుతేజ, సాయికిరణ్‌గా గుర్తించారు. భానుతేజ, సాయికిరణ్ వారం క్రితమే మేనమామ ఇంటికి వచ్చారు. ఈలోపు స్నేహితుడితో కలిసి సరదాగా చెరువులో ఈతకు దిగి మృతి చెందారు.

# జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూత

ఆయన కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. మూడు నెలల క్రితం కూడా ఏఐజీలో చేరారు. అప్పట్లో డయాలసిస్ చేయించుకున్నట్లు సమాచారం. తాజాగా గుండెపోటు రావడంతో చికిత్స పొందుతూ మృతిచెందారు.తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ స్ఫూర్తితో మాగంటి గోపీనాథ్ 1982లో తెదే పాలో చేరారు. 1985లో హైదరాబాద్ నగర తెలుగు యువత అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఎన్టీఆర్ స్వయంగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. 2014లో తొలిసారి తెదేపా నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2018లో తెరాస (ప్రస్తుతం భారాస)లో చేరారు. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లోనూ విజయం సాధించారు. అనంతరం 2023లో జరిగిన ఎన్నికల్లోనూ గెలిచారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఆయన గెలుపొందారు. 2022లో భారాస హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగానూ మాగంటి గోపీనాథ్ పనిచేశారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి పట్ల భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం భారాసకు తీరని లోటు అని అన్నారు.గోపీనాథ్ ఎంతో కష్టపడి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారని పేర్కొన్నారు. సౌమ్యుడైన ప్రజానేతగా పేరు సంపాదించారన్నారు. మాగంటి కుటుంబం, అభిమానులకు కేసీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాగంటి గోపీనాథ్ మృతి పట్ల భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మాజీ మంత్రి హరీశ్‌రావు సంతాపం తెలిపారు. ఆయన అకాల మరణం తీవ్రంగా కలచివేసిందని కేటీఆర్ అన్నారు. గోపీనాథ్‌ను కోల్పోవడం భారాసకు తీరని లోటు అని పేర్కొన్నారు. 3 సార్లు ఎమ్మెల్యేగా జూబ్లీ హిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారన్నారు. మరోవైపు ఏఐజీ ఆస్పత్రికి కేటీఆర్, హరీశ్‌రావు వెళ్లారు. గోపీనాథ్ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మృతి నేపథ్యంలో నల్గొండ, ఖమ్మం జిల్లాల పర్యటనను కేటీఆర్ రద్దు చేసుకున్నారు. మాగంటి గోపీనాథ్ మృతి పట్ల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన అకాల మరణం బాధాకరమన్నారు. గోపీనాథ్.. జూబ్లీహిల్స్ ప్రజలతలలో నాలుకగా ఉండేవారన్నారు. ఆయన కుటుంబసభ్యులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**భౌతికకాయానికి సీఎం రేవంత్, కేసీఆర్ నివాళులు**

ఆదివారం ఉదయం కన్నుమూసిన భారాస ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భౌతికకాయానికి సీఎం రేవంత్ రెడ్డి,, భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నివాళులర్పించారు. మాదాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని అంజలి ఘటించారు. గోపీనాథ్ పార్థివదేహాన్ని చూసి కేసీఆర్ కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# పాకిస్థాన్‌వి ప్రగల్భాలే..

### దయాది దాడుల్లో భారత్‌కు నష్టమేమీ జరగలేదని ఆధారాలతో సహా నిరూపణ






ఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడితో తీవ్ర ఆవేదనకు గురైన భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. గంటల వ్యవధిలోనే వాటిని నేలమట్టం చేసింది. ప్రతీకారదాడులకు దిగిన పాకిస్థాన్‌ను కూడా చావుదెబ్బ కొట్టింది. అయితే, ఆపరేషన్ సిందూర్ తమపై పెద్దగా ప్రభావం చూపలేదని ప్రపంచ దేశాలను పాకిస్థాన్ నమ్మించే ప్రయత్నం చేసింది. అంతేకాకుండా భారత్‌లోని కీలక సైనికస్థావరాలను ధ్వంసం చేశామని గొప్పలు చెప్పుకుంటోంది. పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో సుఖోయ్ -30ఎంకేఐ యుద్ధవిమానాన్ని ధ్వంసం చేశామని, గుజరాత్‌లోని భుజ్ ఎయిర్‌ఫీల్డ్‌లో ఉన్న ఎస్-400 యూనిట్‌ను కూల్చివేశామని చెబుతోంది. అయితే, ఇవన్నీ బడాయి మాటలేనని ఇప్పటికే భారత్ చెప్పింది. తాజాగా, ప్రముఖ ఇమేజరీ అనలిస్ట్ డమియెన్ సైమన్ 'ఎక్స్'లో పోస్టు చేసిన శాటిలైట్ చిత్రాలు.. పాకిస్థాన్‌వి ఉత్తర ప్రగల్భాలేనని మరోసారి నిరూపించాయి.ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో సుఖోయ్ విమానాన్ని ధ్వంసం చేశామంటూ ఇటీవల పాకిస్థాన్ ఓ చిత్రాన్ని విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే, అది ఆపరేషన్ సిందూర్ కంటే ముందే తీసిన చిత్రమని రివ్యూలో తేలింది. అసలు అది సుఖోయ్ యుద్ధవిమానమే కాదు. రోజువారీ మెయింటెనెన్స్‌లో భాగంగా ఎంఐజీ-29 ఇంజిన్‌ను శుభ్రం చేస్తున్నప్పటి చిత్రమది. దానిని తనకు అనుకూలంగా మలచుకునేందుకు పాక్ శాయశక్తులా ప్రయత్నించి విఫలమైంది.మరోవైపు.. భుజ్ ఎయిర్‌బేస్‌లోని ఎస్-400 రేడార్ సిస్టమ్‌ను కుప్పకూల్చినట్లు పాకిస్థాన్ విపరీతమైన ప్రచారం చేసింది. తమ వాదనలకు బలం చేకూరుస్తూ ఓ ఫొటోను కూడా విడుదల చేసింది. ఎయిర్‌బేస్‌లో అక్కడక్కడా నల్లటి మచ్చలు చూపిస్తూ.. అందర్నీ నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే, అవి ఇంధనపు మరకలని రివ్యూలో తేలింది. ఎస్-400 అనేది సంచార క్షిపణి వ్యవస్థ. ఒక చోట నుంచి మరో చోటకి తరలించవచ్చు. అలా క్షిపణి వాహనాన్ని తరలిస్తున్నప్పుడు.. దాని నుంచి ఇంధనం లీకై అలా మచ్చలు ఏర్పడినట్లు తేలింది. అంతేకాకుండా భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చెలరేగడానికి ముందే ఆ చిత్రం తీసినట్లు స్పష్టమైంది.ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్‌లోని ఆదంపూర్ ఎయిర్ బేస్‌పై దాడి చేసి ఎస్-400పై దాడి చేశామంటూ తప్పుడు ప్రచారం చేసింది. అక్కడి ఫొటోను పూర్తిగా మార్ఫింగ్ చేసి.. భారత్ కీలక స్థావరాన్ని ధ్వంసం చేశామని గొప్పలు చెప్పుకొంది. దీనిని తిప్పికొట్టేలా అక్కడికి రోజుల వ్యధిలోనే ప్రధాని మోదీ నేరుగా ఆదంపూర్ ఎయిర్ బేస్‌కు వెళ్లి.. సైనికులతో భేటీ అయ్యారు. ఎస్-400 ఎదుట సగర్వంగా నిలబడి ఫొటో దిగారు. ఎస్-400, మిగ్-29లు సురక్షితమే అని ప్రపంచానికి చూపారు. దీంతో పాక్ చేసిన ఆ ప్రయత్నం కూడా ఇస్లామాబాద్ పరువును వీధిలో పడేసింది.

# అమెరికాలో మిన్నంటిన నిరసనలు



పరిష్కరిస్తాం' అని అధ్యక్షుడు రాసుకొచ్చారు. లాస్ ఏంజెలెస్ ఘటనను వైట్‌హౌస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ స్టీఫెన్ మిల్లర్ తీవ్రంగా ఖండించారు. ఇవి యూఎస్ చట్టాలకు, సార్వభౌమాధికారానికి వ్యతిరేకంగా జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం పెద్ద సంఖ్యలో అక్రమ వలసదారులను బహిష్కరిస్తుందని ఉద్ఘాటిం చారు. కాగా.. రెండోరోజు కూడా ఆందోళనలు కొనసాగాయి.

**అక్రమ వలసదారుల అరెస్టు**

లాస్ ఏంజెలెస్‌లో మొత్తం 44 మంది అక్రమ వలసదారులతో సహా తమను అడ్డుకోవడానికి ప్రయత్నించిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఫెడరల్ అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే అక్కడ నిరసనలు చెలరేగాయి. వందలమంది ఆందోళనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్లపైకి రావడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. దీంతో పోలీసులు రంగంలోకి దిగి లాఠీఛార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించి వారిని చెదరగొట్టారు. సర్వీస్ ఎంప్లాయిస్ ఇంటర్నేషనల్ యూనియన్ కాలిఫోర్నియా అధ్యక్షుడు డేవిడ్ హుయెర్టాను కూడా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆందోళనకారులు ఫెడరల్ భవనం వెలుపలకు చేరుకొని ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారిని అడ్డుకునేందుకు ఫెడరల్ అధికారులు పెప్పర్ స్ప్రేను ప్రయోగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అక్రమ వలసదారులను దేశం నుంచి పంపడానికి అమెరికా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే వారిని అరెస్ట్ చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

# అన్నిరంగాల్లో మహిళల ముద్ర

### వారి అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం : ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మహిళల అభివృద్ధి కోసం ఎన్డీఏ సర్కార్ చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి గుర్తు చేశారు. మహిళల నేతృత్వంలో సాధించిన విజయాలను ప్రస్తావించారు.కేంద్రంలో వరుసగా మూడోసారి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటై రేపటికి ఏడాది పూర్తి కావొస్తోంది. ఈ నేపథ్యంలోనే 11 ఏళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. ''విద్య, క్రీడలు, స్టార్టప్, సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా మన దేశ కీర్తిని పెంచుతున్నారు. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీఏ సర్కార్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. స్వచ్ఛ భారత్ ద్వారా వారి గౌరవాన్ని కాపాడడం నుంచి జన్‌ధన్ ఖాతాలతో వారిని ఆర్థికంగా బలోపేతం చేసేంత వరకు ఎన్నో పథకాలు అమలు చేశామన్నారు

## పోటెత్తిన జనం

వారికోసం 42 క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. 13 కౌంటర్ల ద్వారా 2 రోజుల పాటు బత్తిని కుటుంబం చేపమందు పంపిణీ చేయనుంది. దేశ నలుమూలల నుంచి ప్రజలు వస్తారన్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు కల్పించారు. 70 సీసీ కెమెరాలతో నిరంతర నిఘాను అధికారులు ఏర్పాటు చేశారు. చేపప్రసాదం పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం లక్ష చేపపిల్లలను సిద్ధం చేసింది. ప్రజల రావడానికి అనుకూలంగా రవాణా సౌకర్యాలను కల్పించింది.

**చేప ప్రసాద పంపిణీలో అపశృతి :** గతంలో తనకు అస్తమా ఉండేదని చేపప్రసాదాన్ని తీసుకోవడం వల్ల ఆ సమస్యకు స్వస్తి పలికానని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బత్తిని కుటుంబం చేపప్రసాదాన్ని అందించింది. నిస్వార్థంగా బత్తిని కుటుంబం చేస్తున్న సేవకు పద్మశ్రీ గుర్తింపునకు సైతం రాష్ట్ర ప్రభుత్వం తరఫున సిఫారసు చేస్తామని మంత్రి పొన్నం అన్నారు. చేప ప్రసాదం పంపిణీలో అపశ్రుతి చోటు చేసుకుంది. ప్రసాదం తీసుకునేందుకు క్యూలైన్‌లో నిలబడిన మెదక్ జిల్లాకు చెందిన ఓ వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందాడు.

# గోపీనాథ్ హఠాన్మరణానికి సంతాపం



- దక్షిణాఫ్రికా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ అధ్యక్షులు నాగరాజు గుర్రాల

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా ప్రజాసేవలో ముందుండిన మాగంటి గోపీనాథ్ హఠాన్మరణ వార్త తెలియడంతో తీవ్ర మనోవేదనకు లోనయ్యానని దక్షిణాఫ్రికా బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ అధ్యక్షులు నాగరాజు గుర్రాల తెలిపారు. ఆయన మరణం పార్టీకి, రాష్ట్ర ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. గోపీనాథ్ ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధితో, వినయంగా, మానవీయతతో స్పందించేవారని, జూబ్లీహిల్స్ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు మరువలేనివి. ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం, అందరి మధ్య ఆయన సంపాదించిన గౌరవం చిరస్మరణీయమైనవని తెలిపారు. బీఆర్ఎస్ దక్షిణాఫ్రికా ఎన్.ఆర్.ఐ శాఖ తరపున, తన వ్యక్తిగతంగా మాగంటి కుటుంబానికి, బంధువులకు, అభిమానులకు సంతాపాన్ని తెలిపారు.

# అవయవ దానం చేస్తే 18 మంది ప్రాణాలు నిలబెట్టొచ్చు

- తెలంగాణ శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురు ప్రకాష్

**హత్నూర, జూన్ 08 (జనంసాక్షి) :** అవయవదానంతో ప్రాణదాతలు కావాలని తెలంగాణ శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురు ప్రకాష్ కోరారు. ఆదివారం హత్నూర మండలం నస్తీపూర్‌లో శరీర అవయవదానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నిదానాల్లోకెల్లా అవయవదానం గొప్పదన్నారు. ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోయేముందు అవయవదానం చేస్తే 18 మంది ప్రాణాలు నిలబెట్టొచ్చని సూచించారు. యువత సంవత్సరానికి నాలుగు సార్లు రక్తదానం చేయొచ్చని.. రక్తదానంతో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు కొన్నిరోజులపాటు జీవితాన్ని ఇచ్చినవారు అవుతారన్నారు. ప్రతి ఒక్కరూ అవయవదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

# వివేక్‌ను వరించిన మంత్రి పదవి

- చెన్నూరు నియోజకవర్గానికి ముచ్చటగా మూడోసారి మంత్రి పదవి
- హర్షం వ్యక్తం చేస్తున్న వివేక్ అభిమానులు, కార్యకర్తలు





**మంచిర్యాల ప్రతినిధి జూన్ 8 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి మంత్రివర్గ విస్తరణ జరుగుతోందని అనుకున్నప్పుడల్లా మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతూ మంత్రి పదవి కోసం పోటీపడుతున్న ఎమ్మెల్యేలకు నిరాశే మిగిలింది. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాకు మంత్రివర్గ విస్తరణలో చోటు లభిస్తుందని అనుకున్నట్లుగానే 15 నెలల కాలం తర్వాత మంత్రివర్గ విస్తరణలో చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వివేక్ కు మంత్రి పదవి లభించడంతో ఆయన అభిమానులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గానికి ముచ్చటగా మూడోసారి అమాత్య పదవి లభించింది. చెన్నూరు నియోజకర్గం నుండి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం వివేక్ ఈ మంత్రివర్గ విస్తరణలో చోటు లభించడంతో నియోజకవర్గంలోని వివేక్ అభిమానుల ఆనందానికి అవధులు లేవు. ఇదే చెన్నూరు నియోజకవర్గం నుండి మొదటిసారిగా టిడిపి హయాంలో బోడ జనార్ధన్ కు మంత్రి పదవి వరించింది. అప్పుడు ఆయన కార్మిక శాఖ మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే వైయస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో ప్రస్తుత మంత్రివర్యులు వివేక్ అన్న గారైన వినోద్ ఇదే చెన్నూరు నియోజవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి తర్వాత మంత్రివర్గంలో చోటు లభించింది. వినోద్ కు కార్మికశాఖ మంత్రిగానే మంత్రి పదవి లభించింది. ముచ్చటగా మూడోసారి చెన్నూర్ నియోజకవర్గానికి మరోసారి మంత్రి పదవి దక్కడం. చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మొదటిసారి గెలిచిన గడ్డం వివేక్ కు మంత్రి పదవి వరించింది. ఈ నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు,జిల్లాలోని ఆయన అభిమానులు బాణాసంచా కాల్చుతూ మిఠాయిలు పంచుకున్నారు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నుండి గెలిచిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ముగ్గురు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంత్రి పదవి కోసం పోటా పోటీగా ప్రయత్నాలు కొనసాగించారు. అధిష్టానానికి టచ్ లో ఉంటూ తమదైన రీతిలో ముగ్గురు ఎవరికి వారే ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఒకరిపై ఒకరు విమర్శలు కూడా చేసుకున్నారు కొత్తగా వచ్చిన వారికి, పార్టీలు మారేవారికి మంత్రి పదవి అవసరమా అంటూ ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకోవడం కూడా జరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ లోని మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసిన వివేక్ వెంకటస్వామిని భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించారు. అప్పటి వరకు అక్కడ టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పై వివేక్ విజయం సాధించారు . బిజెపిలో ఉన్న వివేక్ వెంకటస్వామిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా పిలిపించి చెన్నూరు నుండి పోటీ చేయలని, గెలిచిన తర్వాత మంత్రి పదవి కూడా ఇస్తామని హామీ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది.

ఇచ్చిన హామీ మేరకు నేడు ఆ హామీని అమలు చేస్తూ ఎమ్మెల్యే వివేక్ కు మంత్రి పదవి కట్టబెట్టారు. మంత్రి పదవి కోసం ఆశించి నిరాశ గురైన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు ఇంటికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, రాష్ట్ర ఇంచార్జ్ నటరాజన్ మీనాక్షి వెళ్ళినట్లు సమాచారం . కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మంత్రి పదవి కోసం ఆశించి నిరాశకు గురైన ఎమ్మెల్యేలను అధిష్టానం బుజ్జగిస్తున్నట్లు సమాచారం. ఇదే పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎంపీగా గెలిచిన అనుభవం ఉన్నప్పటికీ ఉన్నప్పటికీ ఎమ్మెల్యేగా గెలవడం మాత్రం మొదటిసారి ఎమ్మెల్యేగా గెలవడంతోనే మంత్రి పదవి వరించడం తో ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు . ఏది ఏమైనా అప్పటికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంత్రి పదవి కోసం 15 నెలల నుండి ముమ్మర ప్రయత్నాలకు ఫుల్ స్టాప్ పడ్డట్టు అయింది. ఇప్పటివరకు చెన్నూరు నియోజకవర్గంలో మంత్రివర్గంలో చోటు లభించిన వారు కార్మిక శాఖ మంత్రులుగానే కొనసాగారు. ఇప్పుడు అదే చెన్నూరు నియోజకవర్గం నుండి మంత్రి పదవి దక్కిన వివేక్ కు ఎలాంటి పోర్ట్ పోలియో ఇస్తారో వేచి చూడాల్సిందే ?

# ఎట్టకేలకు వాకిటికి మంత్రి పదవి

- పేట జిల్లా నుంచి మూడో మంత్రి శ్రీహరి
- సర్పంచ్ నుంచి మంత్రి వరకు
- మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి





**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):** మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఎప్పుడు మంత్రి అవుతారోనాని ఎదురు చూసిన నారాయణపేట జిల్లా ప్రజల ఆశలు ఆదివారం నెరవేరాయి.అప్పుడా ఇప్పుడా అంటూ ఊరించిన మంత్రి పదవి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నీ ఎట్టకేలకు వరించింది.బిసి కోటలో ముఖ్యంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన శ్రీహరిని తన మంత్రి వర్గంలో మంత్రిని చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా ముది రాజులకు బిసి సామాజిక వర్గానికి ఇచ్చిన హామీని నిలబెట్టు కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.అయితే వాకిటి శ్రీహరి నారాయణపేట జిల్లా నుంచి మూడో మంత్రి గా పదవి చేపట్టినట్లు అయింది.ఇదివరకు నారాయణపేట కు చెందిన రాంచందర్ రావు కల్యాణీ మొట్టమొదటి మంత్రి అయ్యారు. ఆతర్వాత ఎల్కో టి ఎల్లారెడ్డి రెండో మంత్రిగా పనిచేశారు.ప్రస్తుతం వాకిటి శ్రీహరి మూడో మంత్రి గా ప్రమాణ స్వీకారం చేశారు. అంతే కాకుండా ఈ ముగ్గురు మంత్రులు కూడా బిసి సామాజిక వర్గానికి చెందిన వారే కావడం విశేషం. అలాగే రాంచందర్ రావు కల్యాణీ,వై.ఎల్లారెడ్డి ఇద్దరు కూడా బిసి సంక్షేమ శాఖ మంత్రులుగా పని చేశారు.

**సర్పంచ్ నుంచి మంత్రి వరకు వాకిటి ప్రస్థానం**

చిన్ననాటి నుంచి నమ్మిన సిద్ధాంతం కోసం నిక్కచ్చిగా పని చేయడంతోనే వాకిటి శ్రీహరి మంత్రి కావడానికి కారణం అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.2001లో మక్తల్ మేజర్ పంచాయితీ సర్పంచ్.గాఎన్నికై 5 ఏళ్లపాటు పంచాయి తీ అభివృద్ధిలో తన ముద్ర వేసుకుని 2006 వరకు సర్పంచ్ గా కొనసాగారు.అప్పుడే తన రాజకీయ పునాదులు బలంగా వేడుకున్నారు.2014లో మక్తల్ జడ్పీటిసి గా ఎన్నికై ఉమ్మడి జిల్లా జిల్లాపరిషత్ ఫ్లోర్ లీడర్ గా పనిచేశారు.2023 నుంచి తాను ఎమ్మెల్యేగా గెలిచే వరకు డిసిసి అధ్యక్షుడు గా కొనసాగారు. సాధారణ ఎన్నికల్లో ఊహించని విధంగా వాకిటి శ్రీహరి 17వేల పై చిలుకు ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్యేగా తొలిసారి గెలువగానే మంత్రి కావడం విశేషం.

**కుటుంబ సభ్యుల సంబరాలు**

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే నారాయణపేట జిల్లా కేంద్రంలో మంత్రి కుటుంబ సభ్యులు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు జరిపి బాణాసంచా కాల్చారు.అలాగే సత్యనారాయణ స్వామి చౌరస్తాలో సంబరాలు జరిపి టపాసులు కాల్చి మిఠాయిలు తినిపించారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమరాల్లో మంత్రిచిన్నమ్మలు, అక్కాచెల్లెళ్ళు, అన్నతమ్ములు,బావ బామమర్దులు, కోడళ్ళు అల్లుళ్ళు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను అడ్డుకున్న గిరిజనులు

- ప్రారంభించకుండానే వెనుదిరిగిన ఎమ్మెల్యే మురళి నాయక్



**మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 8 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజనుల భూములను కబ్జా చేసి అక్రమంగా నిర్మించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవానికి వచ్చిన స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ ను లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భూ బాధితులతో కలిసి ఆందోళన చేపట్టి ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ అక్రమ గిరిజన లంబాడిల భూములను గుంజుకొని నిర్మించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ను వెంటనే రద్దు చేయాలంటూ గిరిజన లంబాడిలకు న్యాయం చేయాలంటూ భారీ ఎత్తున ధర్నా నిర్వహించి ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకోవడంతో గిరిజనులను నచ్చజెప్పే ప్రయత్నం చేసిన పలించక ఎమ్మెల్యే మురళి నాయక్ వెనుతిరిగారు. ఈ సందర్భంగా లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ మండలం శనిగపురం రెవెన్యూ వీరారం తండా కు చెందిన భూక్య శ్రీను మాజీ వార్డ్ కౌన్సిలర్ కుటుంబానికి చెందిన సుమారు 30 ఎకరాల భూమి సర్వే నెంబర్ 275, 278, 279లలో గల భూమిని అగ్రవర్ణానికి చెందిన డాక్టర్ జన్నపురెడ్డి ప్రమోద్ రెడ్డి వారి అనుచరులతో కలిసి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి రెవిన్యూ మున్సిపాలిటీ అధికారులను తప్పుదోవ పట్టించి లక్షల రూపాయల అక్రమ మార్గంలో ఎటువంటి గృహ నిర్మాణ అనుమతులు లేకుండా ప్రమోద్ హోమ్స్ పేరుతో అక్రమ గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. కబ్జా చేసిన గిరిజన భూమిలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్మాణం చేపట్టడం అన్యాయమని డాక్టర్ జే. ప్రమోద్ రెడ్డి గిరిజన భూములను కబ్జా చేసి స్కూల్ నిర్మాణ అనుమతులు లేకుండా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేరుతో బూటకపు నిర్మాణాన్ని ఆపాలని మహబూబాబాద్ లో డిపిఎస్ఇ పేరుతో లోగోను ఏర్పాటు చేసుకొని గిరిజన జిల్లాలో ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ ప్రజలను మోసం చేస్తూ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పేరుతో లక్షల రూపాయలలో ఫీజులు వసూలు చేస్తూ ఆదివారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ను ప్రారంభిస్తున్నారని వారు ఆరోపించారు. గిరిజనుల భూముల కబ్జాకు పాల్పడిన డాక్టర్ జన్నపురెడ్డి ప్రమోద్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి గిరిజనుల భూములను వారికి ఇవ్వాలనిడిమాండ్ చేశారు, భూ బాధితులు జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ను ఆశ్రయించగా జిల్లా పోలీస్ యంత్రాంగానికి పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆదేశాలు జారీ చేశారు జిల్లా పోలీసు యంత్రాంగం సమగ్ర విచారణ జరపడంతో డాక్టర్ జన్నపురెడ్డి ప్రమోద్ రెడ్డి వారి అనుచరులు గిరిజన భూములను కబ్జాకు పాల్పడ్డారనినకలి (ఫోర్జరీ) డాక్యుమెంట్లతో భూములను కొనుగోలు చేసి అక్రమంగా ప్లాట్లుచేసి గృహ నిర్మాణ అనుమతులు పొంది అక్రమ నిర్మాణాలు నిర్మిస్తున్నారని రుజువు కావడంతో జన్నపురెడ్డి ప్రమోద్ రెడ్డితో పాటు వారి అనుచరులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు క్రిమినల్ కేసు నమోదు కావడం జరిగిందన్నారు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు ఎఫ్ఐఆర్ నెంబర్ 68/2025, క్రిమినల్ కేసు ఎఫ్ఐఆర్ నెంబర్ 113/2025. భూ కబ్జాలకు పాల్పడ్డ ప్రమోద్ రెడ్డి వారి అనుచరులను వెంటనే రిమాండ్ కు తరలించాలని వారు డిమాండ్ చేశారు.



# కర్నూలు జిల్లాలో రైతుకు దొరికిన వజ్రం!

**కర్నూలు (జనంసాక్షి) :** కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలో తొలకరి జల్లులు కురవడంతో ఓ రైతుకు అనూహ్యంగా అదృష్టం వరించింది. తన పొలంలో ఓ విలువైన వజ్రం దొరకడంతో, ఆ వార్త దావానలంలా వ్యాపించింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, కుటుంబాలతో సహా పిల్లలను వెంటబెట్టుకుని పొలాల్లో వజ్రాల కోసం వెతుకులాట ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే, సాధారణంగా తొలకరి వర్షాలు రైతులకు కాస్త ఉపశమనాన్ని ఇస్తాయి. కానీ ఈ ఏడాది, ఆ వాన చినుకులు ఊహించని సంపదను కూడా మోసుకొచ్చాయి. తుగ్గలి మండల కేంద్రం సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఓ రైతు పొలం పనులు చేసుకుంటుండగా ఈ వజ్రం బయటపడింది. తేలికపాటి వర్షం తర్వాత పొలాన్ని చదును చేస్తుండగా ఇది దొరికినట్లు సమాచారం. ఈ అదృష్టవంతుడైన రైతు ఆ వజ్రాన్ని వెంటనే స్థానిక వ్యాపారికి రూ.1.5 లక్షలకు విక్రయించాడు. ఓ స్థానికుడు తెలిపిన వివరాల ప్రకారం, అనేక మంది గ్రామస్థులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి పొలాల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. మట్టిని జాగ్రత్తగా తవ్వుతూ ఏదైనా రాయి దొరుకుతుందేమోనని ఆశగా వెతుకుతున్నారు.

# శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్‌లో దొంగలు పడ్డారు!

- పేరును సార్ధకం చేసుకుంటూ అర్జీదారులను నిలువ దోపిడి చేస్తున్న ఏసిపి!?
- అదిరేదిలేదు... బెదిరేది లేదు... అడిగే నాథుడే లేని వ్యవహార శైలి...
- చైన్ మెన్ తో చక్రం తిప్పుతూ కోట్లు కొల్లగొడుతున్న వైనం!




**శేరిలింగంపల్లి, జూన్ 08 (జనంసాక్షి) :** బిప్రభుత్వ ఉద్యోగి... ఓవైపు ప్రభుత్వానికి, మరోవైపు ప్రజలకు వారధిగా నిలుస్తూ పరిపాలనను సమన్వయం చేసే అత్యంత కీలకమైన వ్యక్తి! విధి నిర్వహణలో స్థానిక ప్రజలతో మమేకమై వారి అవసరాలలో పాలుపంచుకుంటూ వారి సంక్షేమంలో ఓ భాగస్వామి. అందుకే ప్రభుత్వ ఉద్యోగి అంటే ఆయన కొలువుదీరిన ప్రాంతంలో ఓ ప్రత్యేక గౌరవం, గుర్తింపు లభిస్తుంది. విలువలతో పని చేస్తూ విద్యుక్త ధర్మాన్ని నిజాయితీగా నిర్వర్తించడం వల్ల సదరు ప్రభుత్వ ఉద్యోగికి ఓ ప్రత్యేకమైన ఆదరణ లభిస్తుందంటే అతిశయోక్తి కాదు! ఇది నాణానికి ఒకవైపు... ప్రస్తుతం సమాజంలో చోటు చేసుకుంటున్న అనేక మార్పులు... డబ్బు మీద మనిషి పెంచుకున్న వ్యామోహం... వ్యక్తిగత స్వార్థం పెరిగిపోయి విధి నిర్వహణలో నిబంధనలకు నీళ్లు వదులుతూ అందిన కాడికి దండుకొని కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్న వైనం మరోవైపు!! అందరూ ఉద్యోగులు అలాకాకున్నా... ప్రజా సంబంధ వ్యవహారాలలో క్రియాశీల పాత్రను పోషిస్తున్న రెవెన్యూ, జిహెచ్ఎంసి తదితర రంగాలలో అవినీతి పెద్ద ఎత్తున రాజ్యమేలుతుందనేది కాదనలేని సత్యం.

**శేరిలింగంపల్లి టౌన్ ప్లానింగ్ లో దొంగలు పడ్డారు**

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఆయా ప్రాంతాలలో భవన నిర్మాణాల కోసం అనుమతి కోరుతూ శేరిలింగంపల్లి సర్కిల్ టౌన్ ప్లానింగ్ విభాగానికి అర్జీ పెట్టుకుంటే వెంటనే క్రింది స్థాయి సిబ్బంది సీన్లోకి వచ్చేసి ప్లాట్ ఎక్కడుంది...? ఏ సైజులో ఉంది...? ఎన్ని అంతస్తులు...? అంటూ పలు ప్రశ్నలు సంధించి దాని ద్వారా అధికారులకు భవన నిర్మాణదారుడు లేదా ఇంటి యజమాని ఏ మేరకు ఉపయోగపడతాడో, ఎంతమేర చెల్లించుకోగలుగుతాడో అంచనా వేసుకున్న తర్వాతే మిగతా తతంగాన్ని సిబ్బంది ముందుకు నడిపిస్తారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో గమనించవచ్చు. భవన నిర్మాణదారుడు, ఇంటి యజమాని శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళికావిభాగం అధికారులను కలవడమే పాపం అన్నట్టు వారు కుదిర్చిన సంధికి ఒప్పుకుంటేనే సదరు భవనానికి లేదా ఇంటికి మోక్షం లభించి అనుమతి పత్రాలు చేతికి అందుతాయని... లేనిపక్షంలో 'ఇక్కడి సూర్యుడు అక్కడ మొలిచినా...' అర్జీదారుని విషయంలో అడుగు ముందుకు పడదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులంటే ప్రజలకు జవాబుదారీగా ఉంటూ బాధ్యతతో పనిచేయాలని దోపిడి దొంగలను తలపిస్తూ టౌన్ ప్లానింగ్ కార్యాలయం మెట్లు ఎక్కడమే పాపం అన్నట్టుగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నిస్తున్నారు...!

**పేరును సార్ధకం చేసుకుంటూ అర్జీదారులను నిలువు దోపిడి చేస్తున్న ఏసిపి!?**

శేరిలింగంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసిపి) వ్యవహార శైలి ఈమధ్యకాలంలో తీవ్ర వివాదాస్పదమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రతిరోజు ఆయన మీడియాలో నానుతున్నాడంటే వ్యవహార శైలి ఏ స్థాయిలో విమర్శలకు భూతమిస్తుందో గమనించవచ్చు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్ల పరిధిలో ఎవరైనా భవన నిర్మాణదారుడు లేదా స్థల యజమాని ఇంటి నిర్మాణం కోసం సదరు అధికారిని సంప్రదిస్తే ఆయన క్షేత్రస్థాయి పరిశీలన పేరుతో వెంటనే తన వందిమాగదులైన చైన్ మెన్, ఇతర సిబ్బందిని ఘటనాస్థలికి పంపించి ఆయనకు అనుకూలంగా ఉండే విధంగా అర్జీదారులకు సలహాలను ఇప్పిస్తూ... తామేదో మేలు చేస్తున్నట్లు వ్యవహరిస్తూ బలవంతంగా ఉచ్చులోకి దింపి నెత్తికి శఠగోపం పెడుతూ నిలువు దోపిడీకి పాల్పడుతున్నారని పలువురు భవన నిర్మాణ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు కావలసిన పద్ధతిలో అనుమతులను కోరితే... అధికారుల జేబులు నింపే విధానంలో శేరిలింగంపల్లి సర్కిల్ ఏసిపి, ఆయన సిబ్బంది ఉచిత సలహాలు ఇస్తున్నారని అర్జీదారులు వాపోతున్నారు. అవసరం నిమిత్తం 'చుట్టమై వెళ్తే దయమై పట్టిన చందంగా...' శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం కీలక అధికారి అనుసరిస్తున్న విధానం ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదని, అర్జీదారుడు కి ఏం కావాలో ఆయన పరిస్థితిలను బట్టి నిర్ణయించుకుంటారని, కానీ... శేరిలింగంపల్లి సర్కిల్ ఏసిపి, స్థానిక చైన్ మెన్ చెప్పిన పద్ధతికి తాము తలొగ్గాలని, లేని పక్షంలో ఓవైపు ఏ మాత్రం సహకరించకపోగా... మరోవైపు చీత్కారాలు ఎదురవుతుంటాయని భవన నిర్మాణదారులు, ఇళ్ల స్థల యజమానులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒక్కసారి స్థలం విషయంలో శేరిలింగంపల్లి ఏసిపి ని కలిస్తే చాలు పూర్తిగా నిలువుదోపిడేనని పలువురు బాధితులు భయాందోళనను వ్యక్తం చేస్తున్నారు.

**అదిరేదిలేదు... బెదిరేది లేదు... అడిగే నాథుడు అంతకన్నా లేడు!!**

శేరిలింగంపల్లి పట్టణ ప్రణాళిక విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారి ప్రతి ఒక్కరి నుండి అందిన కాడికి దోచుకోవడం, దోచిందంతా దాచుకోవడం రివాజుగా మార్చుకున్నాడని స్థానికులు దుజాబడుతున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో గత సంవత్సర కాలంలో సుమారు 400కు పైగా అక్రమ కట్టడాలు రూపుదిద్దుకున్నాయి అంటే అవినీతి ఏ స్థాయిలో రాజ్యమేలుతుందో ఇట్టే గమనించవచ్చు. శేరిలింగంపల్లి ఏసిపి అవినీతిని ఎండగడుతూ ఎన్ని నిరసనలు, ఎన్ని ధర్నాలు జరిగినా... ప్రతినిత్యం మాధ్యమాలలో ఎన్ని వార్తా కథనాలు ప్రచురితమైనా... అదిరేది లేదు... బెదిరేది లేదు... ఉన్నతాధికారుల గట్టి మద్దతు ఉందో ఏమో... అడిగే నాథుడే లేడు... అన్న చందంగా తయారయ్యింది. పూర్తి ఆధారాలతో మీడియాలో వార్త కథనాలు కుప్పలు తిప్పలుగా ప్రచురితమవుతున్న ఐ డోంట్ కేర్ అన్నట్టుగా ఎలాంటి బెరుకు లేకుండా ఇష్టానుసారంగా అక్రమాలను పెంచి పోషిస్తున్న శేరిలింగంపల్లి ఏసిపి వ్యవహారం స్థానికంగా సంచలనాలను రేపుతుందనడంలో కించిత్తు అనుమానం లేదు.

**చైన్ మెన్ తో చక్రం తిప్పుతూ కోట్లు కొల్లగొడుతున్న వైనం...!**

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో తిష్ట వేసిన ఓ చైన్ మెన్ ఏసిపి వ్యవహారాలన్నీ చక్కబెడుతుంటాడని, చేతికి మట్టి అంటకుండా... 'కాగల కార్యం గందరువులే నెరవేర్చినట్టు' అన్నీ తానై పట్టణ ప్రణాళిక విభాగాన్ని నిర్విఘ్నంగా ముందుకు తీసుకెళుతున్నాడని పలువురు అర్జీదారులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ఏదైనా స్థలం విషయంలో అవసర నిమిత్తం పట్టణ ప్రణాళిక విభాగం మెట్లు ఎక్కిన వెంటనే సమాచారం అందుకునే సదరు చైన్ మెన్ అర్జీదారుడు వద్ద నుండి కొన్ని వివరాలను సేకరించి వాటిని తమకు అనుకూలంగా ఉండేలా సలహాలిస్తూ భారీ మొత్తంలో రేటును ఫిక్స్ చేసి ఆ బరువుతో వచ్చి కలవాల్సి ఉంటుందని, లేనిపక్షంలో దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరింపులకు పాల్పడుతుండడం తమను తీవ్రంగా కలిసి వేస్తుందని శేరిలింగంపల్లి డివిజన్ ప్రాంతానికి చెందిన పలువురు స్థల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఆర్థిక స్థితిగతులను చూసి సహృదయంతో సహకరించాల్సిన శేర్లింగంపల్లి ఏసిపి అన్నింటికీ చైన్ మెన్ ను ముందు పెడుతూ వారికి కావలసిన సొమ్మును రాబట్టుకోవడానికి ప్రాధాన్యతనిస్తారని, అది లక్షలైనా, వాణిజ్య భవనం అయితే కోట్లయినా అడిగినంతా సమర్పించుకోవాల్సిందేనని, లేనిపక్షంలో భవనం విషయంలో లేదా స్థలం విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడదని, ఏళ్లు గడుస్తున్నా... ఎలాంటి పురోగతి కనిపించదని బాధితులు స్పష్టం చేస్తున్నారు. శేరిలింగంపల్లి ఏసిపి ఇక్కడి నుండి బదిలీ అయ్యేంతవరకు పరిస్థితులలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రతి ఒక్కరూ భారీ మొత్తంలో ఆయన హుండీలో కానుకలను సమర్పించుకోవాల్సిందేనని కొందరు భవన నిర్మాణదారులు ఎద్దేవా చేస్తున్నారు. ఓ ప్రభుత్వ ఉద్యోగిగా, ప్రజా సంబంధాల విభాగం అధికారిగా ప్రజలకు సహకారం, చేయూతనందించాల్సిన శేరిలింగంపల్లి ఏసిపి కొత్త విధానంలో అవినీతికి తెరలేపి కోట్ల రూపాయలు వెనుకేసుకోవడం ఎంతవరకు సమంజసం అని, తక్షణమే అతనిపై ఉన్నత స్థాయి అధికారులు విచారణను నిర్వహించి దోచుకున్న సొమ్ము అంతా కక్కించడంతోపాటు శ్రీకృష్ణ జన్మస్థానానికి తరలించాల్సిన ఆవశ్యకత ఉందని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజికవేత్తలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# "స్నేహాన్ని.. అహం" జయించింది



స్నేహం జీవితంలో శాశ్వత బంధంగా పరిగణించబడుతుంది. స్నేహితుల మధ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ, విందు, వినోదాలాలో,అభిరుచులలో భిన్న అభిప్రాయాలు ఉండవచ్చు.మన తల్లితండ్రుల వద్ద, అన్నదమ్ములతో, కుటుంబ సభ్యులతో పంచుకోలేని తన మనోభావాలు, వ్యక్తిగత సమస్యలు, బలహీనతలు, రహస్యాలు, ఆర్థిక, వ్యాపార లావాదేవీలు, ఉద్యోగ,వ్యాపార రహస్యాలు, గుట్టుమట్లు...ఇలా అనేక విషయాలు మనసు విప్పి మన స్నేతులతో పంచుకుంటాము. మన స్నేహుతులతో ఆత్మీయ బంధం ఉంటుంది.వారిపట్ల అపారమైన నమ్మకం ఉంటుంది.అలాంటి నమ్మకాన్ని, ప్రేమను, విశ్వాసాన్ని జీవిత కాలం కాపాడుకోవాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆసున్నిత భావాలను, రహస్యాలను ఇరువురూ ప్రాణాలకు మించి కాపాడుకోవాలి.అదే నిజమైన స్నేహం అంటే.

కేవలం ఏదో విషయంలో అభిప్రాయం బేధాలు వచ్చినంత మాత్రాన మిత్ర ధర్మం మరచి మిత్రుని గుట్టును రట్టు చేసుకోవడం, బ్లాక్ మేయిలింగ్ చేసుకోవడం ఆత్మ ద్రోహం, మిత్ర ద్రోహం కూడా ఇలాంటి పరిస్థితులు వచ్చినప్పుడు నీతిగా, నిజాయితీగా, ఓపిగ్గా ఉంగాలి. లేక పోతే వారు స్నేహితులు కారు. శత్రువులకన్నా అన్యాయం. కానీ ఇప్పుడు ఎలాన్ మస్క్ – డోనాల్డ్ ట్రంప్‌ల స్నేహం ఆర్థిక, రాజకీయ కారణాల వల్ల విచ్ఛిన్నకరమైన ... బాధాకరమైన ఉదాహరణగా నిలిచింది. ఒకప్పుడు ప్రాణ స్నేహితులుగా కనిపించిన ఈ ఇద్దరు ప్రముఖులు ఇప్పుడు బహిరంగంగా విమర్శలు, ప్రతి విమర్శలు, వివాదాస్పద వ్యాఖ్యలతో ఒకరినొకరు పరువు తీసుకోవడంమే లక్ష్యంగా రచ్చకెక్కారు. అమెరికాలోనూ ఇతర పత్రికలకు (మీడియా) ఎక్కి ఒకరి వ్యక్తిగత బలహీనతలను, రహస్యాలను ప్రపంచానికి తెలుపుకుంటున్నారు. స్నేహితుల మధ్య పగ, ప్రతీకారం తీర్చుకోవాలనే ధోరణి అసహ్యకరంగా ఉంది. ఈ విషయం శత్రువులకు ఆనందంగా, వినోదంగా అనిపించ వచ్చు. మిత్రుల మధ్య ఉండవలసింది ప్రేమ, నమ్మకం, కృతజ్ఞత జీవితకాలం తప్పక ఉండాలి.కష్ట సమయంలో పరస్పరం తమ శక్తి మేరకు ఆదుకోవాలి. కానీ వీరు తమ స్నేహ ధర్మాన్ని పువ్వులాగా, తీవ్ర చర్చనీయాంశంగా మార్చారు.

ప్రస్తుతం ఈ స్నేహ విచ్ఛిన్నం వెనుక ఉన్న కారణాలను, వివాదాలను తెలుసుకుందాం. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు మస్క్ గణనీయమైన మద్దతు ఇచ్చారు. దాదాపు $300 మిలియన్ల ఆర్థిక సహాయంతో రిపబ్లికన్ పార్టీకి అతిపెద్ద దాతగా నిలిచాడు. ట్రంప్ విజయం తర్వాత, మస్క్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ డోజ్ (డీఓజీఈ) నాయకుడిగా ట్రంప్ నియమించారు, ఫెడరల్ ఖర్చులను $2 ట్రిలియన్లు తగ్గించాలనే లక్ష్యంతో. వారి సన్నిహిత సంబంధం వైట్‌హౌస్‌లో మస్క్ యొక్క గణనీయ ప్రభావంగా వ్యక్తమైంది, సంప్రదాయానికి భిన్నంగా మస్క్ క్యాబినెట్ సమావేశాలు, విదేశీ నాయకులతో సమావేశాల్లో పాల్గొన్నారు. ఫిబ్రవరి 2025లో, మస్క్ ట్రంప్‌ను "స్ట్రెయిట్ మ్యాన్"గా ప్రేమిస్తానని Xలో పోస్ట్ చేశాడు, వారి బంధం బలంగా ఉందని సూచించాడు.

అయితే, 2025 ఏప్రిల్ నాటికి, ట్రంప్ యొక్క ఆర్థిక విధానాలు, ముఖ్యంగా అధిక సుంకాలు, మస్క్ యొక్క టెస్లా వ్యాపారాన్ని ఘోరంగా దెబ్బతీశాయి. టెస్లా షేర్లు 13 శాతం పడిపోయాయి. ఐరోపాలో 40 శాతం అమ్మకాలు తగ్గాయి. దీనికి ఒకరకంగా మస్క్ యొక్క వివాదాస్పద రాజకీయ జోక్యం కూడా కారణమైంది. మస్క్ ట్రంప్ యొక్క "బిగ్, బ్యూటిఫుల్ బిల్"ను "అసహ్యకరమైనది"గా విమర్శించాడు, ఇది (డోజ్) యొక్క $175 బిలియన్ పొదుపును రద్దు చేస్తుందని పేర్కొన్నాడు.దీనితో ట్రంప్, మస్క్ యొక్క విమర్శలకు స్పందిస్తూ, అతని కంపెనీలకు బిలియన్ల డాలర్ల ఫెడరల్ సబ్సిడీలను రద్దు చేస్తానని బెదిరించాడు. మస్క్, జవాబుగా, ట్రంప్ జెఫ్రీ ఎప్‌స్టీన్ డాక్యుమెంట్స్‌లో ఉన్నాడని ఆధారాలు లేకుండా ఆరోపించాడు. వారి వివాదాన్ని వ్యక్తిగత స్థాయికి తీసుకెళ్లాడు.

మీడియా నివేదికలు ఈ స్నేహ విచ్ఛిన్నాన్ని విస్తృతంగా కవర్ చేశాయి. (ఎన్.పి.ఆర్.) ఈ వివాదాన్ని "బహిరంగ బ్రేకప్"గా అభివర్ణించాయి. ట్రంప్ యొక్క సుంకాలు... మస్క్ యొక్క వ్యాపార ఆసక్తులను దెబ్బతీశాయని, ఐరోపాలో అతని రాజకీయ జోక్యం టెస్లా అమ్మకాలను ప్రభావితం చేసిందని పేర్కొన్నాయి. వానిటీ ఫెయిర్ ఈ విభేదాలను ఆర్థిక విధానాలపై భిన్నాభిప్రాయాలకు, ముఖ్యంగా ట్రంప్ యొక్క సుంకాలు... మస్క్ యొక్క లిబర్టేరియన్ విధానాలకు ఆపాదించింది. "ది ఇండిపెండెంట్ " మీడియా... మస్క్ యొక్క X పోస్ట్‌ను హైలైట్ చేసింది. "ఇందులో మస్క్ లేకుంటే ...ట్రంప్ ఎన్నికలు గెలిచేవాడు కాదని" పేర్కొన్నాడు. మస్క్ "X" మీడియాలో జారీచేసిన ఈ ప్రకటన వారి స్నేహ సంబంధాన్ని మరింత తీవ్రంగా దెబ్బతీసింది. "ది టైమ్స్ ఆఫ్ ఇండియా" మస్క్ యొక్క రాజీనామాను ట్రంప్ యొక్క బడ్జెట్ బిల్‌పై నిరాశకు ఆపాదించింది, ఇది ఆర్థిక లోటును పెంచుతుందని మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు.) ఐరోపాలో, మస్క్ యొక్క రాజకీయ జోక్యం, ముఖ్యంగా జర్మనీలో ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఏ.ఎఫ్.డీ.)కు మద్దతు, విమర్శలను రేకెత్తించింది. జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ మస్క్ యొక్క జోక్యాన్ని "విదేశీ జోక్యం"గా పేర్కొన్నాడు, ఇది ఐరోపా రాజకీయాల్లో అతని ప్రభావాన్ని విస్తరించే ప్రయత్నాన్ని సూచిస్తుంది. బ్రిటన్‌లో, మస్క్ యొక్క బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్‌పై విమర్శలు మరియు రిఫార్మ్ యూకే నాయకుడు నైజెల్ ఫరాజ్‌కు మద్దతు వివాదాస్పదంగా మారాయి, అతని రాజకీయ జోక్యం అంతర్జాతీయ ఆందోళనలను పెంచాయి.

మస్క్ యొక్క (డీ.ఓ.జీ.ఈ.) (DOGE) నుండి రాజీనామా, మే 2025లో, వారి సంబంధం ముగిసినట్లు సూచించింది." రాయిటర్స్" నివేదిక ప్రకారం, మస్క్ తన వ్యాపార సామ్రాజ్యంపై దృష్టి పెట్టడానికి రాజకీయ ఖర్చులను తగ్గించాలని నిర్ణయించుకున్నాడు, టెస్లా యొక్క ఆర్థిక సమస్యలు మరియు ఐరోపాలో అతని రాజకీయ జోక్యం వల్ల ఆర్థిక నష్టాలు కారణంగా. ఈ విచ్ఛిన్నం ఇద్దరు శక్తివంతమైన వ్యక్తుల మధ్య ఆదర్శాలు, వ్యాపార ఆసక్తులు మరియు వ్యక్తిగత అహంకారాల సంఘర్షణను పెంచేసింది. "X" లోని పోస్ట్‌లు ఈ విషయంపై విభిన్న స్పందనలను చూపాయి, కొందరు మస్క్ యొక్క నిష్క్రమణను వ్యాపార దృష్టిగా భావిస్తే, మరికొందరు ట్రంప్ యొక్క విధానాలపై అతని నిరాశ కు గుర్తుగా ఆపాదించారు.

ఈ సంఘటన స్నేహం యొక్క సంక్లిష్టతను, శక్తివంతమైన వ్యక్తుల మధ్య ఆర్థిక, రాజకీయ ఒత్తిళ్లు ఎలా బంధాలను విచ్ఛిన్నం చేయగలవో చూపిస్తుంది. ట్రంప్ అలాగే మస్క్ పరస్పరం విడిపోవడం వారి వ్యక్తిగత లక్ష్యాలు... అలాగే ఆదర్శాలలోని పెద్ద విభేదాలను ..."ఇగో" "అహం" (ఇగోస్టిక్ దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది అమెరికా అలాగే అంతర్జాతీయ మీడియాలో విస్తృత చర్చలకు దారితీసింది.




**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

## లే

కాలి బూడిద
విద్యార్థుల ప్రాణాలు
జండా ఎగిరింది
పోరు తెచ్చింది
బంగారు తెలంగాణ
మిఠాయి పొట్లం
అంతా ఉచితం
తలలపై అప్పులు
గొప్పల దిబ్బ
నేతపాలన
అంతటా అవినీతి
జండా మారింది
మారని దారి
పాలన చెత్తమూసి
జనం గగ్గోలు
మారిన తల్లి
పెరిగిన లంచాలు
జనం బేజారు
మళ్ళి పోరాటం
ప్రజా తెలంగాణ
కొత్త కోణాలు
కాంతి స్ఫోటనం
జనుల అసహనం
మరో ఉదయం
జనం కామన
రత్నాల తెలంగాణ
అది ఎక్కడ
లే బసవన్న
మట్టి మనసు విప్పు
లే రా రమ్మను
ప్రజా పాలన
అందరి అభిమతం
ఆశల రాజ్యం

**రేడియమ్**
**9291527757**



## నేను అడవిని మాట్లాడుతున్న

నేను అడవిని మాట్లాడుతున్న
నూతన అభివృద్ధి పేరుతో
నా దేహంపై యుద్ధం సాగుతున్నది.
నెత్తుటి ధారలతో
రక్తసిక్తం అవుతున్న
పాలకులు నూతన ఆర్థిక విధానం
పేర నాకడుపును చీల్చేందుకు
కుట్రలు చేస్తున్నరు.

పెసా చట్టాన్ని పాతర పెట్టి
ఖనిజ సంపద తరలించేందుకు
దారులు వేస్తున్నరు.

స్వాతంత్ర్య వచ్చి 77ఏండ్లు గడిచిన
పిడికెడు మెతుకులకు నోచుకోని
మూల వాసులు ఆదివాసులు.

అల్లూరి, బిర్సముండా
గుండాదర్,కొమరం భీమ్,
చారుబాబు దాదాల.
నక్సల్బరీ రాకతో పచ్చని పంటలలో
చిరునవ్వులతో కవాతైసాగుతూ

పండు వెన్నెల్లో
రేల పాటలతో చిగురించిన
నాపై సర్కారోడి కన్ను పడి

ఖనిజ సంపద కోసం సల్వ జుడుం,
గ్రీన్ హంట్ ,సమాధాన్,
ప్రహార్, అక్రమచట్టాలతో
నాపై దాడికి దిగిండు.
ఇప్పుడు కగార్ ఆపరేషన్
నీతిలేని యుద్ధంతో ఖనిజాన్ని
తరలించేందుకు
నాపై నెత్తురు పారుతున్నది

నక్సల్బరీని ముద్దాడిన బిడ్డలు
ఎదురు దాడి చేసి తరిమిండ్రు..

జనతన సర్కార్ల ఏర్పాట్ల తో
జేజేలతో లాంగ్ మార్చ లతో
కవాతై సాగారు.
యుద్ధంనీతి లేనోడు
కార్పొరేట్ కాషాయ ఎత్తులు
కగార్ ఆపరేషన్ పేర
నిఘానీడ రాకెట్,లాంచర్లతో,డ్రోన్ల,
మత్తు మందు ఎగజల్లి
తూటాల వర్షంతో
డిలర్జి ద్రోహుల,విషప్రయోగాలతో
కాల్చి చంపు తున్నప్పుడు .

నెత్తుటి ధారలతో ఈనేలపై రాలిన
మళ్ళీ మళ్ళీ చిగురిస్తూనే వుంట
రేపటి నక్సల్బరీ వసంతం కోసం..

**- బాలసాని రాజయ్య**

## వర్షమా నీకు వందనము

తీవ్రమమైన ఎండలో
ఉపాశమనం ఇచ్చావు
మళ్ళీ దోబూచులాడుతున్నావు
రైతుజ
నీవైపు చూస్తున్నాడు
నిజమైన నేస్తం నీవే
ప్రకోపం వద్దు
ప్రేమ చూపు
ఎండిన గొంతులో
చుక్క నీరు
లేక వీలవీలా డుతున్న
మూగజీవులను
కరుణించు
నీవు ఎక్కువైతే
అతివృష్టి
తక్కువైతే అనావృష్టి
ప్రార్థిస్తున్నాం
ఓ వాన దేవుడా
సమతౌల్యముగా
వర్షించు

**ఉమాశేషారావు వైద్య**
లెక్చరర్, 9440408080

## కల్తీ బతుకులు

కల్తీ కల్తీ కల్తీ కల్తీ
కల్తీ లేని చోటెక్కడ?

అవినీతి అవినీతి
అవినీతి లేనిచోటెక్కడ?

'ఆ మందు' 'ఈ మందు' కాదు
అన్ని మందులు కల్తీ!

ఫర్టిలైజర్,మెడికల్,ఆల్కహాల్
ఈ మూడూ మందులే!

కల్తీలు అమ్మి కోట్లు కోట్లు!
కల్తీబుద్ధులు! శాల్తీలుగల్లంతు!

కంపెనీలు వ్యాపారులు
అవినీతి నీతుల కల్తీ!

నాయకులు ఉద్యోగులు
నీతిఅవినీతుల కల్తీ!

దేశాలన్నీ మార్కెట్లే
రాజకీయ వ్యాపార కల్తీ!

సోదర సోదరీ ప్రజలారా!
వీళ్ళు రక్షకులా? భక్షకులా?

యుద్ధాలు సరిహద్దుల్లో
అవన్నీ రాజకీయ కల్తీ!

దేశభక్తుల్ని చంపే 'కగార్'
దేశద్రోహులకల్తీ 'సిందూర్'

దేశంలో దోచుకోవాలి!
జనాన్ని దారి మళ్ళించాలి!

'దైవభక్తి' పాత దారి!
అప్రతిహతంగా నడుస్తోంది!

ఇప్పుడు 'యుద్ధం' మరోదారి!
దేశద్రోహుల రాజకీయకల్తీ!

దేవుళ్ళు యుద్ధాలు.. రెండూ
దోపిడీదారుల శంఖ్ చక్రాలు!

భక్షక కార్పొరేట్లు
రక్షకులులేని కల్తీదేశాలు!

నిరంతరం వ్యారం
ట్రంప్ మస్క్ కల్తీ!

రాజకీయవ్యాపర కల్తీ
మార్కెట్ వ్యాపార లాభాలు!

ప్రజలకు దిక్కెవ్వరు?
మనవి కల్తీబతుకులేనా?

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

# బీఆర్ఎస్ కోరికలకు భిన్నంగా బైపోల్స్



*తానొకటి తలిస్తే విధి మరొకటి తలపెట్టినట్టు, బీఆర్ఎస్ గట్టిగా కోరుకున్న ఉప ఎన్నికలు ఒక రకం, కాలమహిమ అనివార్యంగా తెచ్చిన ఉప ఎన్నికలు మరొక రకం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లలో కేవలం 39 సీట్లతో పరిమితమైన బీఆర్ఎస్, ఊహించని రెండు ఉప ఎన్నికలతో మరింత ఒత్తిడిని ఎదుర్కొంటోంది. కంటో న్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత 2024 ఫిబ్రవరి 23న ఆకస్మిక మరణం తో ఆ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. మే 2024లో ప్రారంభమై, జూన్ 4న తేలిన ఫలితంలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ విజయం సాధించారు. దీంతో బీఆర్ఎస్ శాసనసభ సంఖ్యాబలం 39 నుంచి 38కి తగ్గగా, అధికార కాంగ్రెస్ సీట్ల సంఖ్య 64 నుంచి 65కి పెరిగింది. ఈ ఓటమి బీఆర్ఎస్‌కు ఊహించని దెబ్బగా నిలిచింది, ఎందుకంటే రాజధాని పరిధిలోని ఈ స్థానం పార్టీకి ప్రతిష్ఠాత్మకం.*

ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు ఏ పార్టీ వైపు మొగ్గుతారన్నది ఇప్పటికీ అస్పష్టంగా ఉంది. ఈ స్థానాలకు ఉప ఎన్నికల కోసం బీఆర్ఎస్ అసెంబ్లీ కార్యాలయం, సుప్రీంకోర్టు, ప్రజాక్షేత్రయమూడు రంగాల్లోనూ శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ హఠాత్తుగా మరణించడం పార్టీకి మరో ఆఘాతంగా మారింది. 2014, 2018, 2023 ఎన్నికల్లో వరుసగా మూడు సార్లు జూబ్లీహిల్స్‌లో విజయం సాధించిన గోపీనాథ్ మరణంతో, ఆ స్థానంలో ఆరు నెలల్లో ఉప ఎన్నిక తప్పనిసరి. ఈ ఘటనతో బీఆర్ఎస్ శాసనసభ బలం 37కి తగ్గింది, ఇది పార్టీని ఆత్మపరిశీలనలోకి నెట్టింది.

వ్యక్తిగతంగా, ఒక వ్యక్తి మరణం శ్మశాన వైరాగ్యాన్ని తెస్తుంది. కానీ రాజకీయాల స్వభావం భిన్నం. ఇక్కడ భావోద్వేగాల కంటే వ్యూహాలు, పావులు వేగంగా కదులుతాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీఆర్ఎస్‌కు మాత్రమే కాదు, అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీలకూ కీలక పరీక్ష. బీఆర్ఎస్ కోరుకున్న 10 స్థానాలకు ఉప ఎన్నికలు ఎప్పుడు, ఎలా జరుగుతాయన్నది అనిశ్చితంగా ఉన్నప్పటికీ, కంటోన్మెంట్ తరహాలో ఊహించని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పార్టీని ఒక్కసారిగా సవాళ్ల ముందు నిలిపింది.

**మూడు పార్టీలకూ అనుకోని పరీక్ష**

ఉప ఎన్నికలు ఏ పార్టీకైనా, ముఖ్యంగా అధికార పార్టీకి, ప్రజల మనోభావాలను అంచనా వేసే సూచికలా పనిచేస్తాయి. రాజధాని హైదరాబాద్‌తో సహా శివారు నియోజకవర్గాల్లో కేవలం రెండు సీట్లు (సికిందరాబాద్, కంటోన్మెంట్) మాత్రమే గెలిచిన కాంగ్రెస్‌కు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఒక అవకాశం. ఈ స్థానంలో విజయం సాధిస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా దక్షత, నాయకత్వ దృఢత్వం హైదరాబాద్ ప్రజలకు చిహ్నంగా నిలుస్తుంది. రాజధాని ప్రాంతంలో కాంగ్రెస్ బలహీనత గత ఎన్నికల్లో స్పష్టమైంది. కంటోన్మెంట్ విజయం కొంత ఊరటనిచ్చినప్పటికీ, జూబ్లీహిల్స్‌లో గెలిస్తే పార్టీ ఊపిరి పీల్చుకుంటుంది. రేవంత్ రెడ్డి నాయకత్వంపై ఉన్న విమర్శలు, అంతర్గత సవాళ్లను ఈ ఫలితం ప్రభావితం చేయొచ్చు.

బీఆర్ఎస్‌కు ఈ ఉప ఎన్నిక జీవన్మరణ సమస్య. కంటోన్మెంట్‌లో ఓడిపోయి, అంతర్గత కలహాలు, బయటి సవాళ్లతో సతమతమవుతున్న బీఆర్ఎస్‌కు జూబ్లీహిల్స్‌ను నిలబెట్టుకోవడం అత్యవసరం. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు జంట నగరాల్లో గణనీయమైన వ్యక్తిగత ఆదరణ ఉన్నప్పటికీ, 2023 సాధారణ ఎన్నికల్లో ఆ ఆదరణ ఫలితాలుగా మారలేదు. ఎంఐఎం ఎమ్మెల్యేలు మినహా, జూబ్లీహిల్స్ చుట్టూ ఉన్న నియోజకవర్గాల్లో (సెరిలింగంపల్లి, రాజేంద్రనగర్ వంటివి) బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండటం పార్టీకి అనుకూలం. సరైన వ్యూహం, సమన్వయంతో పోతే, సానుభూతి ఓట్లతో సహా విజయం సాధించే అవకాశం ఉంది. అభ్యర్థి ఎంపిక కీలకంకంటోన్మెంట్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే కుటుంబీకులను బరిలో దించినట్టు, గోపీనాథ్ కుమారుడిని ఎంచుకుంటారా లేక రావుల శ్రీధర్ రెడ్డి వంటి సీనియర్ నాయకుల వైపు మొగ్గుతారా అనేది ఉత్కంఠగా ఉంది. గోపీనాథ్ కుటుంబం, కేటీఆర్ కుటుంబంతో సన్నిహిత సంబంధం కలిగి ఉండటం, బీఆర్ఎస్ అధిష్ఠానంతో వారి అనుబంధం ఈ నిర్ణయంలో ప్రభావం చూపొచ్చు.

బీజేపీకి కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఒక ముఖ్యమైన పరీక్ష. తదుపరి సాధారణ ఎన్నికల్లో కేంద్రంలో తామే అధికారంలోకి వస్తామని బీరాలు పలుకుతున్న బీజేపీకి, ఈ ఫలితం పార్టీ పనితనం, ప్రజాదరణకు కొలమానం. సికిందరాబాద్ నుంచి కేంద్ర మంత్రి ఉండటం బీజేపీకి అనుకూల అంశం. హైదరాబాద్‌లో బీజేపీ గత ఎన్నికల్లో గణనీయమైన ఓటు షేర్ సాధించినప్పటికీ, అసెంబ్లీ స్థానాలు గెలవలేకపోయింది. జూబ్లీహిల్స్‌లో గట్టి పోటీ ఇస్తే, రాజధాని ప్రాంతంలో తమ బలాన్ని చాటుకునే అవకాశం ఉంది.

ఒక ఆసక్తికర అంశం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పాత్ర. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆమె బీఆర్ఎస్ తరపున పనిచేస్తారా లేక ఎన్నిక నోటిఫికేషన్ ముందు కొత్త పార్టీ స్థాపించి అభ్యర్థిని బరిలో దించుతారా అనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం. బీఆర్ఎస్ గట్టిగా కోరుకుంటున్న 10 స్థానాలకు ఉప ఎన్నికలు జూబ్లీహిల్స్‌తో పాటు జరుగుతాయా లేక వాటికి అవసరం రాదా అనేది రానున్న రోజుల్లో స్పష్టమవుతుంది.

**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు
హైదరాబాద్
9440850384

# "విద్యా సామాజిక, తత్త్వ శాస్త్రానికి - పాల్ గుడ్‌మన్"సేవలు

పాల్ గుడ్‌మన్ (1911–1972) అమెరికా రచయిత, సామాజిక విమర్శకుడు, తత్త్వవేత్త మరియు అరాచకవాది, 1960లలో తన సామాజిక విమర్శల ద్వారా ప్రసిద్ధి చెందారు. న్యూయార్క్ నగరంలో జన్మించిన గుడ్‌మన్, యూదు కుటుంబంలో పెరిగారు. తండ్రి వ్యాపార వైఫల్యం కారణంగా కుటుంబాన్ని విడిచిపెట్టడంతో, తల్లి, అత్తలు, సోదరి ఆయనను పెంచారు. న్యూయార్క్‌లోని సిటీ కాలేజ్ ఆఫ్ న్యూయార్క్ నుండి 1931లో ఫిలాసఫీలో డిగ్రీ పొందారు. యూనివర్సిటీ ఆఫ్ చికాగోలో సాహిత్యం, ఫిలాసఫీలో డాక్టరేట్ చేశారు. లైంగిక ధోరణి కారణంగా అనేక ఉద్యోగాలు కోల్పోయారు. పాల్ గుడ్‌మన్ 1911 సెప్టెంబర్ 9న న్యూయార్క్‌లో జన్మించారు. తండ్రి కుటుంబాన్ని విడిచిపెట్టడంతో, ఆర్థిక ఇబ్బందుల మధ్య పెరిగారు. టౌన్‌సెండ్ హారిస్ హైస్కూల్‌లో అత్యుత్తమ విద్యార్థిగా గుర్తింపు పొందారు. సిటీ కాలేజ్‌లో చదువుతూ, రష్యన్ అరాచకవాది పీటర్ క్రోపాట్కిన్ రచనల ప్రభావానికి లోనయ్యారు. 1938లో వర్జీనియా మిల్లర్‌తో సామాన్య చట్ట వివాహం చేసుకున్నారు, వీరికి ఒక కుమార్తె జన్మించింది. 1945లో సాలీ డచ్‌స్టైన్‌తో మరో సామాన్య చట్ట వివాహం చేసుకున్నారు, వీరికి ఇద్దరు సంతానం. గుడ్‌మన్ బహిరంగ ద్విలైంగికత, రెండవ ప్రపంచ యుద్ధంలో డ్రాఫ్ట్‌కు వ్యతిరేకత కారణంగా ఉద్యోగాలు కోల్పోయారు. ఆయన జీవితం సామాజిక నీతులకు వ్యతిరేకంగా స్వేచ్ఛాయుత జీవనాన్ని సూచిస్తుంది.

**పాల్ గుడ్ మన్ రచనలు :**

గుడ్‌మన్ కవిత్వం, నవలలు, వ్యాసాలు, నాటకాలు, సామాజిక విమర్శలలో రచనలు చేశారు. ప్రధాన రచనలు "గ్రోయింగ్ అప్ అబ్సర్డ్" (1960), "కమ్యూనిటాస్" (1947), "గెస్టాల్ట్ థెరపీ" (1951), "ది ఎంపైర్ సిటీ" (1959), "కంపల్సరీ మిస్–ఎడ్యుకేషన్" (1962), "కమ్యూనిటీ ఆఫ్ స్కాలర్స్" (1962)."గ్రోయింగ్ అప్ అబ్సర్డ్" అమెరికన్ యువత అసంతృప్తి, ఆధునిక సమాజ ఒడిదుడుకులను విమర్శించింది, న్యూ లెఫ్ట్ ఉద్యమానికి పునాది వేసింది. "కమ్యూనిటాస్", సోదరుడు పెర్సివల్‌తో కలిసి రచించినది, నగర ప్రణాళిక, వికేంద్రీకరణను సమర్థించింది. "గెస్టాల్ట్ థెరపీ" సైకోథెరపీలో కొత్త దృక్పథం అందించింది.





**విద్యా రంగంలో సహకారం:**

గుడ్‌మన్ విద్యా రంగంలో విమర్శలు, సంస్కరణ ప్రతిపాదనల ద్వారా ప్రభావం చూపారు."గ్రోయింగ్ అప్ అబ్సర్డ్" లో అమెరికన్ విద్యా వ్యవస్థలో ఒత్తిడి, అసంతృప్తిని విమర్శించారు, యువతను సామాజిక కార్యకలాపాలలో భాగం చేయాలని సూచించారు. "కంపల్సరీ మిస్–ఎడ్యుకేషన్" లో సాంప్రదాయ విద్యా వ్యవస్థను "స్కూల్ మాంక్స్"గా విమర్శించి, అప్రెంటిస్‌షిప్‌లు, అకాడమీలు, థెరప్యూటిక్ ఫ్రీ స్కూళ్లతో భర్తీ చేయాలని ప్రతిపాదించారు. విద్య స్వచ్ఛందంగా, విద్యార్థుల సృజనాత్మకత, ఊహాశక్తిని పెంపొందించాలని వాదించారు. ఆయన సిద్ధాంతాలు డీ–స్కూలింగ్, ఆల్టర్నేటివ్ స్కూల్ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చాయి. విద్యార్థుల స్వయం నిర్ణయాధికారాన్ని, సమాజంతో సంబంధాన్ని పెంచే విద్యను ఆయన సమర్థించారు.

**ఇతర రంగాలలో సహకారం :**

గుడ్‌మన్ అరాచకవాదం, లైంగిక స్వేచ్ఛ, వియత్నాం యుద్ధ వ్యతిరేక ఉద్యమాలలో కీలక పాత్ర పోషించారు. లైంగిక స్వాతంత్ర్యంపై బహిరంగ చర్చలు గే లిబరేషన్ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చాయి."గెస్టాల్ట్ థెరపీ"ద్వారా సైకోథెరపీలో కొత్త ఒరవడిని సృష్టించారు. ఆయన రచనలు న్యూ లెఫ్ట్, 1960ల కౌంటర్‌కల్చర్ ఉద్యమాలకు దిశానిర్దేశం చేశాయి. సమాజంలో వికేంద్రీకరణ, సముదాయ జీవనం, వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని ప్రోత్సహించారు.

**"గుడ్ మన్ ప్రభావం - వారసత్వం :**

గుడ్‌మన్ ఆలోచనలు సమకాలీన విద్యా సంస్కరణలకు, సామాజిక ఉద్యమాలకు బలమైన పునాది వేశాయి. ఆయన విద్యా విధానాలు, యువత సామాజిక బాధ్యతలను పెంపొందించే దిశగా ఆలోచనాత్మక చర్చలకు దారితీశాయి. ఆయన రచనలు విద్యార్థుల స్వాతంత్ర్యం, సమాజంలో వారి పాత్రను బలోపేతం చేసే విధంగా రూపొందాయి. అరాచకవాద ఆలోచనలు, సామాజిక న్యాయం కోసం ఆయన పోరాటం ఆధునిక సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచాయి. చివరిగా...పాల్ గుడ్‌మన్ బహుముఖ వ్యక్తిగా, విద్య, సామాజిక విమర్శ, అరాచకవాదం, సైకోథెరపీ రంగాలలో గణనీయ సహకారం అందించారు. ఆయన రచనలు, ఆలోచనలు ఆధునిక సమాజంలో వ్యక్తిగత స్వేచ్ఛ, సముదాయ జీవనం, సృజనాత్మక విద్యా విధానాలను ప్రోత్సహించాయి. ఆయన మరణం తర్వాత కూడా, ఆలోచనలు విద్యా సంస్కరణలు, సామాజిక ఉద్యమాలలో ప్రేరణనిస్తున్నాయి.



**దండెబోయిన అశోక్ యాదవ్,**
గెజిటెడ్ హెడ్మాస్టర్, పెద్దమదూర్,
జనగాం. 9440521990.

## కాంగ్రెస్ ప్రభుత్వం దళిత రైతులను ఆదుకోవాలి



**బోడుప్పల్, జూన్ 8 (జనంసాక్షి) :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 329వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వాలు దళితుల ప్రయోజనాలను తుంగలో తొక్కయని,ఏండ్ల తరబడి వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న దళిత రైతులకు అసైన్డ్ భూముల పట్టాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని నత్తి మైసయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భూమిలేని దళిత రైతులకు ప్రభుత్వం 3 ఎకరాలు చొప్పున అందించి దళితులను ఆదుకోవాలని, నత్తి మైసయ్య కోరారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, గరుగుల యాకయ్య, చిల్ల అంజయ్య, రామకృష్ణ,మాలాద్రి వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ఆహార కల్తీ నియంత్రణకు పటిష్ఠమైన చర్యలు

**హైదరాబాద్ సిటీ, జూన్ 8 (జనంసాక్షి) :** ఆహార పదార్థాలు కల్తీ నియంత్రణకు జిహెచ్ఎంసి పరిధిలో పటిష్టమైన చర్యలు తీసుకొనుటకు ప్రాధాన్యత నివ్వడం జరిగింది. హైదరాబాద్ నుండి వివిధ ప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులకు కల్తీ లేని పౌష్టికాహారం అందించాలనే లక్ష్యం తో ఆహార భద్రత విభాగం ద్వారా ఆహార వినియోగం సురక్షితంగా ఉండేలా కృషి చేస్తున్నది. ఆహార కల్తీని నియంత్రించడానికి జిహెచ్ఎంసి ఆహార భద్రత విభాగం ద్వారా 2024 సంవత్సరంలో 1887శాంపిల్ లను సేకరించిన వాటిలో 95 నమూనాలను ఆహార భద్రత,ప్రమాణాల చట్టం 2006 ప్రకారం ఉల్లంఘినట్లు తేలింది.

### జరిమానాలు, కేసులు

ఆహార ఉత్పత్తుల కల్తీకి పాల్పడిన ఆహార వ్యాపారుల పై రూ. 30.60 లక్షల జరిమాన విధించబడినది. అంతేకాకుండా 12 కేసులు కల్తీ ఉత్పత్తులు మానవ వినియోగానికి సురక్షితం కాదని నివేదించబడింది. దానికి తోడు ఆహార వ్యాపారులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోనున్నది.



### ముడి పదార్థాల నాణ్యత గుర్తించి అవగాహన

2024బి25 ఆర్థిక సంవత్సరంలో నగరంలో 210 శిక్షణ అవగాహన శిబిరాలు నిర్వహించి ఇందులో ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ వాహనం ఉపయోగించి 4006 స్పాట్ పరీక్షలు నిర్వహించారు. తద్వారా వీధి ఆహార విక్రేతలకు ప్రాథమిక పరిశుభ్రత అవసరాలతో పాటుగా ఆహారాన్ని తయారుకు వారు ఉపయోగించే ముడి పదార్థాల నాణ్యత గుర్తించి అవగాహన కల్పించనైనది.

### హాస్టల్స్ తనిఖీకి ప్రత్యేక డ్రైవ్

వీధి,వ్యాపార విక్రేతలు హాకర్ల కు 1500 రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఇవే కాకుండా హాస్టల్స్ తనిఖీ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 117 వసతి గృహాలను ఎల్ బి నగర్, కూకట్ పల్లి శేరిలింగం పల్లి జోన్లతో పాటుగా అశోక్ నగర్ ,దిల్సుక్నగర్, అమీర్ పేట్ ప్రాంతాల్లో తనిఖీ చేసి 74 వసతి గృహాల యాజమాన్యాలకు నోటీస్ లు జారీ చేయడమైనది. 12 హాస్టల్స్ కిచెన్ లు మూసి వేయబడ్డాయి. 70 హాస్టల్స్ జిహెచ్ఎంసి చట్టం1955 ప్రకారం బృందాలు రూ. 5.09 లక్షలు జరిమాన విధించారు. జిహెచ్ఎంసి ఫుడ్ సేఫ్టీ విభాగం వీధి ఆహార విక్రతలు నుండి పెద్దఎత్తున హొటళ్లు రెస్టారెంట్ తయారీ యూనిట్లు నుండి రిటైలర్ వరకు ఆహార వ్యాపారాల కార్యక్రమాలన్నింటిని పర్యవేక్షిస్తూ ప్రజలు తినే ఆహారం సురక్షితంగా పరిశుభ్రమైన పద్ధతిలో నిర్ధారించడానికి విశేష కృషి చేస్తున్నది.

## అవినీతి లేని పాలన ప్రధాని మోడీకే సాధ్యం

- ప్రజల సంక్షేమం, దేశ రక్షణ కోసం ప్రధాని కృషి
- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేష్ కుమార్

**తాండూరు, జూన్ 8 (జనంసాక్షి) :** అవినీతి లేని పాలన ప్రధాని మోడీకే సాధ్యమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. రమేష్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణం బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. రమేష్ కుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలనలో ఎక్కడ కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు తమవంతు శాయశక్తుల కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలు ఆర్టికల్ 370 రామ మందిర్ ,సిఎఎ త్రిబుల్ తలా వర్ఫ్బోర్డ్ చట్టం, గరీబ్ కళ్యాణ్ యోజన ఆయుష్మాన్ భారత్ పథకాలు ఆదర్శం అన్నారు. ఎక్కడ అవినీతి లేని పాలన దేశం ఆర్థిక రంగంలో ప్రపంచంలో నాలుగో స్థానానికి ఎగబాకింది. అభివృద్ధి, క్రీడారంగం, వ్యవసాయం, దేశ రక్షణ రంగంలో అత్యధిక నిధులు కేటాయిస్తూ దేశం వెలుపల దేశంలోపల మావోయిస్టులను మట్టు పెడుతూ అటు ఉగ్రవాదులు ఇటు మావోయిస్టులు లేని దేశంగా ఇటు దేశీయ సంస్థలు అన్నీ కూడా



లాభాలలో ముందడుగు వేస్తూ దేశం యొక్క ప్రగతికి దేశమే ఫస్ట్ అనే నినాదంతో మేకిన్ ఇండియా మేడ్ ఇన్ ఇండియా దేశం పురోగతి సాధిస్తున్న సందర్భంలో కార్యశాల కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్ , బిజెపి పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. ధార్మిక సెల్ జిల్లా నాయకుడు మోహన్ రెడ్డి , పట్టణ ఉపాధ్యక్షులు దోమ కృష్ణ, మంతటి రాజు, శృతి, పట్టణ ప్రధాన కార్యదర్శి మిట్టి శ్రీనివాస్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షాబుద్దీన్ ,పట్టణ కమిటీ సభ్యులు తాంద్ర నరేష్, చందు, సతీష్, బసవరాజ్, బూత్ అధ్యక్షులు సాయిలు, నందు, రాజు, శ్రీనివాస్, రాము ,బిచ్చప్ప, ప్రభాకర్ గౌడ్, సంగమేశ్వర్, శ్రీకాంత్ అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

**జడ్చర్ల, జూన్ 8 (జనం సాక్షి) :** మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డు పరిధిలో ఉన్న శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో శ్రీరాముని, పరమ శివుని ఆలయాలు నిర్మించేందుకు ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. మూడవ వార్డు రాజీవ్ నగర్, మధురానగర్, సాయి నగర్ కాలనీల మధ్య ఉన్న శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయం ఆవరణలో శ్రీరాముని, పరమశివుని దేవాలయాలను నిర్మించి, దేవతమూర్తులను ప్రతిష్టించేందుకు వెంకయ్యపల్లి నరసింహా రెడ్డి, బాల్ రెడ్డి దంపతులు భూమి పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్ సతీష్, కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## జోరందుకున్న చేపల విక్రయాలు



**శివ్వంపేట, జూన్ 8 (జనంసాక్షి) :** మృగశిర పండుగను పురస్కరించుకొని ఆదివారం మండల వ్యాప్తంగా ప్రధాన కూడాళ్ళు, గ్రామ చౌరస్తాల వద్ద చేపల విక్రయాలు జోరందుకున్నాయి. చేపల విక్రయాల వద్ద బంగారు తీగ, బొచ్చ, కొరమీను లు కొనుగోలుదారులకు అందుబాటులో ఉండగా, గత సంవత్సరముతో పోలిస్తే, ఈ సంవత్సరం చాపలను తక్కువ ధరలకు అమ్మకాలు జరిపారని, గత సంవత్సరం కుర్రమీను కిలో వెయ్యి రూపాయలకు విక్రయించగా, ఈ ఏడాది కిలో కొరమీను 600 రూపాయలు, బొచ్చ 200 రూపాయలు, బంగారు తీగ 200లకు విక్రయించారని వినియోగదారులు తెలిపారు. అయితే మృగశిర పండుగ రోజు వర్షాకాల ప్రారంభ రోజుకు చిహ్నంగా తెలంగాణ వ్యాప్తంగా ఈ చేపల పండుగ జరుపుకోవడం ప్రత్యేకమైనది. మృగశిర కార్తె రోజున చేపలు తినడం తెలంగాణ యొక్క సంప్రదాయమని ప్రజలు అంటున్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- శ్రీ భవాని మాత ఆశీస్సులతో సర్వం సుభిక్షంగా ఉండాలి
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్



**తాండూరు, జూన్ 8 (జనంసాక్షి) :** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 5వ వార్డులో కొలువుదీరిన శ్రీ భవాని మాత ఆలయంలో రాజ్ పూత్ర సమాజం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మ వారి నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ శ్రీ భవాని మాత ఆశీస్సులతో పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ సంపత్ కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, రాజ్ పుత్ సమాజం అద్యక్ష కార్యదర్శులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన

- ప్రభుత్వ పాఠశాలలో చేరండి నాణ్యమైన విద్యను పొందండి
- మండల విద్యాధికారి హరిలాల్

**బొంరాస్‌పేట, జూన్ 8 (జనం సాక్షి) :** ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన నిర్వహిస్తున్నామని ప్రభుత్వ పాఠశాలలో చేరి నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను పొందాలని మండల విద్యాధికారి హరిలాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు నూతన పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బొంరాస్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు గుంజ వెంకటయ్య,శివరాజ్,స్పందన ఏర్పుమల్ల, మేడిచెట్టుతాండలో ఇంటింటికి వెళ్లి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం వల్ల కలిగే ప్రయోజనాలు తల్లిదండ్రులకు వివరించారు.



## బడిబాటకు దూరంగా ఇరుకుంట తండా డీఎన్‌టి స్కూల్



**శంకర్‌పల్లి, జూన్ 8 (జనం సాక్షి) :** శంకర్‌పల్లి మండలం ఇరుకుంటా గిరిజన తండాలో ఉపాధ్యాయుడు లేక మొదటి రోజే బడిబాట నిర్వహించలేదు. గత విద్యా సంవత్సరంలో డీఎస్సీలో ఎంపిక చేయబడిన ఒక ఉపాధ్యాయుడు విధుల్లో చేరి లీవ్ పై వెళ్ళాడని ఆయనకు మరో ఉద్యోగం రావడంతో ఇక్కడకు రావడం లేదు. గత సంవత్సర కాలం మొత్తం పాఠశాల కొనసాగలేదు. ఉపాధ్యాయులు లేని పాఠశాలకు డిప్యూటేషన్ పై ఉపాధ్యాయులను పంపించాల్సిన విద్యాశాఖ గిరిజన తండా పాఠశాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం కూడా శుక్రవారం కొనసాగలేదు. పాఠశాలలో తెరిచే వారం రోజుల ముందు నుంచి ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారంగా బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించింది. మొదటిరోజు గ్రామసభ, రెండవ రోజు ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరడం తదితర కార్యక్రమాలతో విద్యాశాఖ పెద్ద ఎత్తున ప్రచారం గావించిన విషయం తెలిసిందే. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్న విధంగా శంకర్‌పల్లి మండలంలో ఓ గిరిజన తండా ప్రాథమిక పాఠశాలలో బడిబాట ప్రారంభించకపోవడం పట్ల విద్యావేత్తలు విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎలా చేరుతారని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై క్లస్టర్ రిసోర్స్ పర్సన్ దస్తప్పను వివరణ కోరగా ఇరుకుంట తండా డిఎన్టీ (డినోటి ఫైడ్ స్కూల్) పాఠశాలలో ఉపాధ్యాయుడు లేకపోవడంతో బడిబాట నిర్వహించలేదు.

## ఆస్తి సంబంధిత సేవలు ఇక సులభతరం

- ప్రజలకు తమ ఇళ్ల నుండే జిహెచ్ఎంసి సేవల వినియోగం

**హైదరాబాద్ సిటీ, జూన్ 8 (జనంసాక్షి) :** నగరవాసుల ఇబ్బందులు మరియు సమస్యలను తొలగించడానికి, నివాసితులు భౌతిక సేవలతో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా వారి ఇళ్ల నుండే తమ సమస్యలను నివేదించడానికి ఇప్పటికే ఉన్న యాప్‌ను ఉపయోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. ప్రజావాణిలో వారి ఆస్తి సంబంధిత సమస్యలకు సంబంధించి నగర ప్రజల నుండి ఫిర్యాదుల సంఖ్య పెరుగుతున్నందున వారి ఇళ్ల నుండే వారి సమస్యలను పరిష్కరించడానికి ఆన్‌లైన్ సేవలను అందించడానికి చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా, ఆస్తి పన్ను స్వీయ అంచనా, ఆస్తి పన్ను సవరణ, మొబైల్ నంబర్ మార్పులు, డోర్ నంబర్ సవరణ, యజమాని పేరు సవరణ మొదలైన సేవలు, గతంలో వాటి కోసం దరఖాస్తు చేసుకున్న వారు మీ సేవకు వెళ్లాల్సి వచ్చింది. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి ఇప్పుడు అలాంటి సమస్యలు లేకుండా వారి ఇళ్ల నుండే అవసరమైన సేవలను పొందే సౌకర్యం కల్పించబడింది.

### పౌరులకు డిజిటల్ సేవల ద్వారా సేవలు

దీనివల్ల పౌర సేవలను వేగంగా అందించడానికి వీలు కలుగుతుంది. అదనంగా, డిజిటల్ సేవల ద్వారా సేవలను అందించడానికి వీలుగా ఈ చొరవను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిహెచ్ఎంసి కోరుతోంది. దరఖాస్తుదారుడు తన ఇంటి టిన్, సేల్ డీడ్ అతను పొందాలనుకుంటున్న సేవలకు సంబంధించిన ఇతర అవసరమైన సహాయక పత్రాల ద్వారా https://www.ghmc.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో సేవలను పొందవచ్చని కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు.

### ఆస్తి పన్ను, మ్యుటేషన్ సేవల పురోగతి

దరఖాస్తుదారుడు సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో నేరుగా రెవెన్యూ శాఖకు వెళ్లవచ్చు మరియు వాటి పరిశీలన తర్వాత ఆమోదం ఇవ్వబడుతుంది. ఆస్తి పన్ను మ్యుటేషన్ సేవలు కూడా పురోగతి దశలో ఉన్నాయి. ఈ సేవలను త్వరలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు.

## మారెళ్ళ మోహన్ రావుకు విశిష్ట సంఘ సేవ అవార్డు ప్రదానం

**శివ్వంపేట, జూన్ 8 (జనంసాక్షి) :** మండల పరిధిలోని గూడూరు గ్రామ శివారులో శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ దత్తాత్రేయ మహాస్వామి, శ్రీ శషిరిడి సాయిబాబా దేవాలయాల దివ్యమూర్తుల ప్రాణప్రతిష్ట విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా సీనియర్ ట్రస్ట్ మెంబర్ సాయి దర్బార్ చైర్మన్, సాయి పదరేణు శ్రీ మారెళ్ళ మోహన్ రావు కు ఆదివారం శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ తరఫున శ్రీగురు పీఠం విశిష్ట సంఘ సేవ అవార్డును ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ శివకుమార్ గౌడ్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ మోహన్ రావు ఆధ్యాత్మిక రంగంలో అత్యున్నతమైన స్థాయికి ఎదిగిన వారని, ప్రతిక్షణం సాయి స్మరణ లోనే ఉంటారన్నారు. వారికి ప్రముఖ పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ మహారాజు సాయి పదరేణు అనే బిరుదును ఇచ్చారని గుర్తు చేశారు. మోహన్ రావు మా సాయి దర్బార్ దేవాలయానికి మేనేజింగ్ ట్రస్టీ, గత 25 సంవత్సరాల నుండి ప్రతినెల మూడవ ఆదివారం 300 మంది పేదలు నివసిస్తున్న కాలనీలోకి వెళ్లి నిరంతరంగా క్రమం తప్పకుండా అన్నదానం చేయడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా సాయిదర్భారు కు వచ్చిన 200 మంది భక్తులకు అన్నదానం చేస్తారని చెప్పారు.



గత 25 సంవత్సరాల నుండి సాయి దర్బారులో ఎన్నో గ్రంధాల ఆవిష్కరణ చేశామని, నిరంతర భజనలు, సంకీర్తనలు ఆలపించడం, హోమాలు నిర్వహిస్తున్నామన్నారు. మోహన్ రావు బిక్షచేసి వచ్చిన డబ్బులతో భారతదేశంలో గల దత్తాత్రేయ మందిరాల అన్నిటిని 60 నుండి 70 మంది భక్తులతో కలిసి సందర్శించి, ప్రతిచోట అభిషేక, అర్చనలు పల్లకి సేవలు నిత్య అన్నదానము, పేదలకు బ్లాంకెట్లు, బట్టల పంపిణీ, ఇలా ప్రతి దేవాలయంలో మూడు రోజులపాటు సేవా కార్యక్రమాలు చేశారు. దత్త క్షేత్రాన్ని శ్రీ విశ్వ యోగి విశ్వంజి మహారాజ్ బృందం, సాయి దర్బార్ భృందముతో కలిసి దర్శించుకుని పూజలు చేశామన్నారు. శ్రీ గురు పీఠం స్థాపనలో శ్రీ మోహన్ రావు ప్రధాన పాత్ర పోషించారు. ఎనలేని సహాయ సహకారాలు అందించారు. ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో నాగారం నుండి సుమారు 30 మంది భక్తులు బస్సులో వచ్చి ఇక్కడ శ్రీ గురు పీఠంలో సేవలందించారని చెప్పారు. సాయి భక్తులను ఆహ్వానించడంలో ప్రముఖ పాత్ర వహించారు, ఆగమ శాస్త్ర పండితులు పుల్లేటికుర్తి గణపతి శర్మ బృందాన్ని వారే ఏర్పాటు చేశారు. శ్రీ గురు పీఠం లోకి కావాల్సిన సాహిత్యాలు అన్నిటిని క్రమ పద్ధతి ప్రకారం ప్రింట్ చేయించారు. మోహన్ రావు ఎనలేని సేవలందించరని గుర్తు చేస్తూ, ఆయన కృషిని, ట్రస్ట్ సభ్యులందరూ ప్రశంసించారు. భక్తుల నుండి విరాళాలు, భిక్ష సేకరించి నిస్వార్థంగా చేస్తున్న సంఘ సేవ కార్యక్రమాలను గుర్తించి, శ్రీ గురుపిఠం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విశిష్ట సంఘ సేవ అవార్డును ప్రధాన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ సభ్యులు జీ పీ రమాదేవి, సూర్య కుమార్ గౌడ్, జీన్నారం శ్రీనివాస్ గౌడ్, రాజా రమణ గౌడ్, మహేష్ గుప్తా, నోముల హనుమంత్, రాజ్యం బిక్షపతి, మారెళ్ళ మోహన్ రావు, శాస్తుల వామన్ శర్మ లతోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు సేవలందించడమే ఫౌండేషన్ లక్ష్యం

- వ్యవస్థాపక అధ్యక్షులు జింకల వెంకటేష్ ముదిరాజ్




**కుత్బుల్లాపూర్, జూన్ 8 (జనం సాక్షి) :** పేద ప్రజలకు సేవలం దించడమే రవితేజ ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జింకల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి పంచశీల కాలనీలోని రవితేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రివైవ్ హాస్పిటల్ (ఐడిపిఎల్) నేతృత్వంలో ఫౌండేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రముఖ సాధారణ వైద్యనిపుణులు డాక్టర్ టి. రవికుమార్,డాక్టర్ టి. సాయిబాబా లు సుమారు 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులతో కలిసి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ పేద విద్యార్థులతో పాటు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేశామన్నారు. భవిష్యత్తులో సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మోత రాజేశ్వర్, సూర్యనారాయణ,కే. రమణారెడ్డి,టి. రమేష్,పి. ప్రభాకర్,వైద్య సిబ్బంది,స్థానికులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం 09 జూన్ 2025

# లిక్కర్ మాయాజాలం..!

- ఎమ్మార్పీ ధరలకు తూట్లు
- క్వార్టర్ బాటిల్‌పై రూ.10 నుంచి రూ.20 అదనం
- మందుబాబులపై సంగారెడ్డి ప్రకృతి వైన్స్ వర్కర్ల దబాయింపు
- నెలనెలా వైన్స్ షాపుల నుంచి ఎక్సైజ్ శాఖ అక్రమ వసూళ్లు

**మద్యం వ్యాపారులు ఎక్సైజ్ విధానంలో ఉన్న లొసుగులను ఆసరాగా తీసుకొని మద్యం విక్రయాలను యథేచ్ఛగా కొనసాగిస్తూ అక్రమార్జనే ధ్యేయంగా మద్యం షాపులు కొనసాగుతున్నాయి. అక్రమ మద్యాన్ని అరికట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు కాసులకు కక్కుర్తిపడి వసూళ్ల దందాకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎమ్మార్పీ రేట్లకు మద్యాన్ని విక్రయించాల్సి ఉండగా, ఎక్సైజ్ శాఖ సహకారంతో నిర్వాహకులు అక్రమ వ్యాపారాన్ని మూడు గ్లాసులు, ఆరు సీసా లతో దందా సాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు.**

**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 8 (జనం సాక్షి)**






జిల్లా వ్యాప్తంగా ఒక్కో మద్యం దుకాణం నుంచి నెలకు రూ.15 వేల నుంచి 25వేల వరకు ఎక్సైజ్ శాఖ అధికారులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో మద్యం దుకాణాల వ్యాపారులు క్వార్టర్పై రూ.10 నుంచి రూ.20 దాకా అదనంగా వసూలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. కింది స్థాయి ఎక్సైజ్ అధికారులు కూడా ఎప్పుడు పడితే అప్పుడు వైన్స్ దుకాణాలకు వచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారని మద్యం దుకాణాల నిర్వాహకులు చెప్తున్నారు.
నిబంధనలు ఉల్లంఘిస్తే వైన్స్ షాపులు సీజ్ చేస్తామని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తున్నా సంగారెడ్డి జిల్లాలో మాత్రం కనిపించడం లేదు.

### సిండి కేట్లు..

మద్యం వ్యాపారుల దోపిడీ మళ్ళీ మొదలైంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యం విక్రయాలు సాగించాలన్న నిబంధనకు సిండికేట్లు మంగళం పాడారు. సంగారెడ్డిలో ప్రాంతాలవారీగా మద్యం దుకాణాలు సిండికేట్ అయ్యాయి. ఎక్సైజ్ అధికారులకు సిండికేట్లకు మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, దీంతో మాక్సిమమ్ రిటైల్ ప్రైస్ (ఎమ్మార్పీ)కి తిలోదకాలు పలికారని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులకు భారీ నజరానాలు ముట్టజెప్పినట్లు విశ్వసనియ సమాచారం.

### మామూళ్ళ మత్తులో అధికారగణం..

అధికారులు మామూళ్ళ మత్తులో జోగుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జనాభా విస్తీర్ణాన్ని బట్టి మద్యం షాపుల్లో రోజుకు రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. ఒక్కొక్క షాపులో రోజుకు రూ.10 వేల వరకు మందుబాబుల నుంచి దోపిడీ జరుగుతుంది. ఉదాహరణకు రోజుకు 700 క్వార్టర్ బాటిల్స్ అమ్మే షాపు నుంచి క్వార్టర్ కు రూ.10 చొప్పున అదనంగా వసూలు చేస్తే రూ.7 వేలు, నెలకు రూ. 2 లక్షలు, ఏడాదికి రూ.24 లక్షల వరకు అదనపు ఆదాయం లభిస్తుంది. అయితే క్వార్టర్ కు రూ.15 వసూలు చేస్తే మరింత అదనపు ఆదాయం చేకూరుతుంది. వాటర్ ప్యాకెట్లు అమ్మకాల్లో కూడా రెట్టింపు మొత్తాలు దుకాణదారుడికి అందుతున్నాయి. హెరీల్సేల్లో వాటర్ ప్యాకెట్ రూ.50 పైసలకు వస్తుండగా, దాన్ని రూ.2 లకు అమ్ముతున్నారు. ఇలా వెయ్యి వాటర్ ప్యాకెట్లు అమ్మితే రూ.1,500లు రోజుకు మిగులుతుంది. బఠాని, ఉడికించిన శనిగలు, పెసర్లు, బైల్ పల్లి, పేపర్లు వంటివి రూ. 10 ఇస్తే 10 ఇత్తులు కూడా రావడంలేదని మందుబాబులు చెప్తున్నారు. మద్యం దుకాణాల ముందు అమ్ముతున్న అన్నిటిని కూడా రెట్టింపు ధరలకు అమ్ముతున్నారు.
షాపు అద్దెలు, సిబ్బంది జీతభత్యాలు, ఎక్సైజ్ శాఖ అధికారుల మామూళ్లు ఇలా చూసుకుంటే తాము నష్టపోతున్నామని, అందుకే అధిక ధరకు మద్యాన్ని విక్రయించాల్సి వస్తుందని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మార్పీ ధర కంటే అధిక మొత్తాన్ని మద్యం దుకాణదారులు మందుబాబుల నుంచి దోపిడీ చేస్తున్నారు.

### కస్టమర్లతో దురుసుగా ప్రవర్తిస్తున్న ప్రకృతి వైన్స్ సిబ్బంది..

సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో గల ప్రకృతి వైన్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు చెబుతున్నారు. మద్యం కొనుగోలుకు వెళ్లిన మందుబాబుల వద్ద డబ్బులు తీసుకొని మద్యం ఇచ్చినప్పటికీ డబ్బులు ఇవ్వలేదంటూ గొడవ పెట్టుకుంటున్నట్లు చెబుతున్నారు. మద్యం ఎమ్మార్పీ పై అధికంగా ఎందుకు తీసుకుంటున్నారని అడిగిన మందుబాబులకు అలాగే తీసుకుంటామని నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కస్టమర్లతో దురుసుగా ప్రవర్తిస్తున్న వైన్స్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మందుబాబులు కోరుతున్నారు.

## పేదోడి సొంతింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 8 (జనం సాక్షి) :** మాయమాటలు చెప్పకుండా పేదోడి సొంతింటి కల ను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తున్నాదని ఏ ఎం సి మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్ అన్నారు.ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నీ 12 వ వార్డులో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ నెల 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన సామాన్య మానవుని సొంతింటి కల నెరవేర్చేందుకు నడుం బిగించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిందని అన్నారు. మంజూరు పత్రాలు అందుకున్న అందుకున్న ఇంటి లబ్ధిదారులను అవగాహనతో చైతన్య పరుస్తూ నారాయణపేట పట్టణంలోని బహార్ పేట్ లబ్ధిదారు కూనే అంబదాస్ ఇంటి భూమి పూజ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శివన్న సైన్యం సభ్యులు కుర్వ మనోజ్, మసి పవన్, గడ్డం వినోద్, దొడ్డి కార్తీక్, జరంగ్రాము, అంజి, బహార్ పేట్ యువకమండలి మండలి పెద్దలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులపై నమ్మకం కలిగిద్దాం



**కృష్ణ, జూన్ 8 (జనం సాక్షి) :** ఉపాధ్యాయులంతా జవాబుదారీగా పనిచేసి ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించాలని ముడుమాల్ గ్రామం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్ అన్నారు.ఆదివారంబడిబాట షెడ్యూల్ లో భాగంగా ముడుమాల యందు ఇంటింటి ప్రచారం చేస్తూ కరపత్రాల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులతో ముచ్చటించి ప్రభుత్వ బడిలో తమ పిల్లల అడ్మిషన్లు చేయాలని కోరారు. ఉపాధ్యాయులంతా జవాబుదారీ తనంతో పని చేసి ప్రభుత్వ బడులపై సమాజంలో నమ్మకం పెంచుకోవడానికి కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భారతి, రవి కుమార్, అమ్మ ఆదర్శ పాఠ శాల కమిటీ చైర్మన్ జయమ్మ, సర్వీస్ పర్సన్స్ సోఫీ, గ్రామ మాజీ ప్రజా ప్రతినిధులు, పెద్దలు, యువకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



**వనపర్తి బ్యూరో, జూన్ 8 (జనంసాక్షి) :** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, వనపర్తి బిజెపి జిల్లా అధ్యక్షులు డి. నారాయణ అన్నారు. ఆదివారం భారతీయ జనతా పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణ ఇన్చార్జి బి.శ్రీశైలం జిల్లా అధ్యక్షులు డి.నారాయణ సమక్షంలో కమిటీ ని ప్రకటించారు. బీజేపీ పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు ఉందేకోటి అంజి, జి.ఉపేందర్ యాదవ్, కాటమోని రాణి గౌడ్,అశ్విని గోవింద్, పట్టణ ప్రధాన కార్యదర్శులుగా దంతోజు నవీన్ చారి, నల్లవోతుల అరవింద్,కార్యదర్శులుగా కడమంచి శివ, అశ్విని పవన్, మందడి మనిషా, కే.రేణుక, పట్టణ కోశాధికారిగా కూన శ్రీకాంత్, సోషల్ మీడియా కన్వీనర్ గా వంశీ యాదవ్, పట్టణ కార్యవర్గ సభ్యులుగా వసంత్ కుమార్ రెడ్డి, కిషోర్ కుమార్, ఉందే కోటి వెంకటేష్ ,శ్రీకాంత్ లతో కలిపి 46 మందితో వనపర్తి పట్టణ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ నూతనంగా నియామకమైన వనపర్తి పట్టణ కమిటీ పదాధికారులు మరియు కార్యవర్గం మున్సిపాలిటీలో పార్టీ విస్తరణకు అహర్నిశలు కృషి చేసి, రాబోయే మున్సిపల్ ఎన్నికలలో మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగరవేసే విధంగా కార్యాచరణ రూపొందించుకొని స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి చదువు రాజేందర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు డి నారాయణ, ఓబిసి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వనపర్తి పట్టణ ఇన్చార్జి బి శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి ,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్ లోకనాథ్ రెడ్డి, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర సహకోశాధికారి జ్యోతి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు కుమారస్వామి, వెంకటేశ్వర్ రెడ్డి, సీతారాములు ,మాజీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్ ,తదితరులు పాల్గొన్నారు.


## ప్రజా పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు

**రేవల్లి, జూన్ 08 (జనంసాక్షి) :** ప్రజా పోరాటాలతోనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని అందుకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు పిలుపునిచ్చారు. ఆదివారం గోపాలపేట మండలం పోలికేపాడులో సీపీఐ గ్రామ సభ్యుల సమావేశం చంద్రయ్య అధ్యక్షతన జరిగింది. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ పోరాటం లేకుండా పేదల కష్టాలు తీరవన్నారు. భారతదేశ స్వాతంత్రం కోసం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కమ్యూనిస్టులు పోరాడారన్నారు. కేవలం సీపీఐ కి మాత్రమే దేశంలో వందేళ్ల పోరాట చరిత్ర ఉందన్నారు. పేదలకు బంజరు భూముల పంపిణీ, ఇండ్ల స్థలాలు, ఇండ్లు, రైతు రుణమాఫీ, ఉచిత కరెంటు, రైతులకు గిట్టుబాటు ధర, కూలి పెంపు, ఆసరా పింఛన్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై ప్రజలను సమీకరించి కమ్యూనిస్టులు పోరాడితేనే పాలక ప్రభుత్వాలు అమలు చేశాయన్నారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలను స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలను అడిగే స్థాయి నుంచి పోటీ చేసి ఎన్నికల్లో గెలవడం ద్వారా ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. త్వరలో రానున్న సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్లుగా, వార్డు సభ్యులుగా పోటీ చేయాలని, అందుకు సిద్ధం కావాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదంలో మరణిస్తే 6 లక్షలు, సాధారణ మరణానికి మూడు లక్షలు ప్రభుత్వం ఇస్తోందని దాని వెనుక సీపీఐ పోరాటం ఉందన్నారు. సీపీఐ లో చేరి పార్టీని బలోపేతం చేసుకోవాలన్నారు.సీపీఐ వనపర్తి పట్టణ కార్యదర్శి రమేష్, గోపాలపేట మండల మాజీ కార్యదర్శి శాంతన్న, గ్రామ కార్యదర్శి బుచ్చన్న, మోహన్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ శాఖ కార్యదర్శిగా బుచ్చన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



## భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



**సంగారెడ్డి, జూన్ 8 (జనం సాక్షి) :** జహీరాబాద్ పట్టణంలోని నారాయణ్నగర్ కాలనిలో గల రామలింగేశ్వరా ఆలయం విగ్రహ ప్రాణ ప్రతిష్ట మహోత్సవం భక్తిశ్రద్ధలతో ప్రతిష్టించారు. ఆదివారం పండితుల మంత్రోచ్ఛారణతో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలు ప్రతిష్టించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో వీరశైవ లింగాయత్ సమాజ్ జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సిములు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా మహిళా గౌరవ అధ్యక్షురాలు అరుణ కౌలాస్ దంపతులు, వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా యువజన సంయుక్త కార్యదర్శి పోలీస్ ప్రవీణ్ పాటిల్, రాష్ట్రీయ బసవదళ్ జహీరాబాద్ శాఖ అధ్యక్షులు శరణప్ప పాటిల్, మేదపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్, లింగాయత్ సమాజ్ కోశాధికారి రాజకుమార్, భక్తులు పాల్గొన్నారు.

## నూతన భాష్యం స్కూల్ ప్రారంభం



**మహమ్మదాబాద్, జూన్ 8 (జనంసాక్షి) :** మండల పరిధిలో వెంకట్ రెడ్డిపల్లి గేట్ సమీపంలో ఆదివారం భాష్యం విద్యాకేతన్ నూతన స్కూల్ ను మాజీ వైస్ ఎంపీపీ రాజారెడ్డి ప్రారంభించారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపల్ జిల్లా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు స్కూల్ టీచర్ చేతిలో ఉందని విద్యార్థులను ఉన్నతస్థాయికి తీర్చిదిద్దాలి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, మాజీ జెడ్పీటిసి శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, మాజీ ఎంపీపీ శాంతిభాయి మాజీ వైస్ ఎంపీపీ రాజారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాఘవేందర్ రెడ్డి, టీపిసిసి ఆర్గనైజర్ సెక్రటరీ ఇ. రాములు, స్కూల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మండల నాయకులు ఉపాధ్యాయులు పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

## నిరంతర శిక్షణతో క్రికెట్‌లో రాణించాలి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 8 (జనం సాక్షి) :** నిరంతర శిక్షణతో విద్యార్థులు క్రికెట్ రంగంలో రాణించాలని నారాయణపేట డి ఎం ఎచ్ ఓ జయ చంద్రమోహన్ అన్నారు.ఆదివారం నారాయణపేట మినీ స్టేడియంలో నెల రోజుల పాటు నిర్వహించిన ఉచిత క్రికెట్ శిక్షణ శిభిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్,పాలమూరు అసోసియేషన్ మారుమూల ప్రాంతాల క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు శిక్షణ ఇవ్వడం అభినందనీయం అన్నారు.విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు అంతే ముఖ్యంఅని రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. క్రీడాకారులు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వి నియోగం చేసుకొని రాష్ట్ర జాతీయ స్థాయిలో మన నారాయణ పేట జిల్లాకు మంచి పేరు తీసుకురావా లనిఅన్నారు. క్రీడలు ఆడడం వల్ల చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉంటారని ప్రతిని త్యం విద్యార్థులు పిల్లలకు వేసవి శిక్షణ శిబిరానికి పంపిస్తే వాళ్లు క్రీడల్లో మంచి ప్రతిభను కనబరుస్తారని అన్నారు.నిజమైన ఆరోగ్య వంతులు క్రీడాకారులు లేని క్రీడా స్పూర్తి ని చాటి నారా యణపేట జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో శిభిరం ఇంఛార్జి రమణ, కోచ్‌లు వినోద్ నాగేష్, చిన్నారెడ్డి, అజయ్, జనార్ధన్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# చేప ప్రసాదానికి అనూహ్య స్పందన..!

- చేప ప్రసాదం కోసం బారులు తీరిన ప్రజలు
- సుమారు పదివేల మంది హాజరైనట్లు సమాచారం
- గోవా నుంచి వచ్చి చేప ప్రసాదం స్వీకరించిన రోగి
- మరోసారి ప్రశాంతంగా పంపిణీ చేసిన ఆడెం బ్రదర్స్





సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 8 (జనం సాక్షి) : మృగశిర కార్తేను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఆస్తమా ఉన్న వారికి ఉచితంగా చేపమందు ఆడెం కుటుంబీకులు పంపిణీ చేస్తున్నారు. ఈ సంవత్సరం కూడా ఆడెం కుటుంబీకులు పంపిణీ చేసిన చేపమందుకు అనూహ్య స్పంధన లభించింది. సుమారు పదివేలమంది చేప ప్రసాదం స్వీకరించినట్లు తెలుస్తోంది ఆదివారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని నిజాంపూర్ గ్రామంలో లోపలి హనుమాన్ మందిరం వద్ద ఏర్పాటు చేసిన శిభిరంలో ఆడెం సోదరులు చేపమందు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 1:50 గంటలకు మృగశిర కార్తె ప్రారంభం కాగానే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చేప ప్రసాదం పంపిణీని ప్రారంభించారు. చేప ప్రసాదం కోసం తెలంగాణ, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చిన రోగులు చేప మందు స్వీకరించారు. మహారాష్ట్రలోని గోవా నుంచి వచ్చిన ఆస్తమా రోగి చేప ప్రసాదం స్వీకరించి సంతృప్తి వ్యక్తం చేశారు.

### ఉదయం నుంచి చేప ప్రసాదం కోసం బారులు..

ఆడెం కుటుంబీకులు గత 125 సంవత్సరాలుగా చేప మందు పంపిణీ చేస్తుండడంతో చాలా మంది వ్యాధిగ్రస్తులు ఉబ్బాసం, దగ్గు, ఆస్తమా, ఎలర్జీ లాంటి రోగాలు పూర్తిగా తగ్గిపోయాయని దూర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాదిగ్రస్తులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. గత సంవత్సరం సుమారు 5000 మందికి చేప ప్రసాదం పంపిణీ చేయగా ఈ సంవత్సరం సుమారు పదివేల మంది హాజరైనట్లు నిర్వాహకులు డాక్టర్ ఆడం మనోహర్ తెలిపారు. చేప ప్రసాదానికి హాజరైన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు ఏర్పాటు చేసినట్లు మనోహర్ తెలిపారు.

### చేప ప్రసాదం వేసుకున్న వారు పాటించవలసిన నిబంధనలు..

ఆస్తమా, ఉబ్బాసం, దగ్గు, ఎలర్జీ తదితర వ్యాధుల నివారణ కోసం చేప మందు వేసుకున్న వారు తప్పకుండా ఈ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని నిర్వాహకులు ఆడెం మనోహర్ తెలిపారు.

# గోదావరిలో గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

- శోకసముద్రంలో రెండు గ్రామాలు
- మంత్రి ఆదేశాలతో దగ్గరుండి పోస్ట్ మార్టం కార్యక్రమాలు నిర్వహించిన సబ్ కలెక్టర్
- మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పుట్ట పరామర్శ








**మహదేవపూర్, జూన్ 8 (జనంసాక్షి) :** శనివారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబటిపల్లి మేడిగడ్డ బ్యారేజ్ మూడవ నెంబర్లో యువకుల గల్లంతు అయిన విషయం తెలిసిందే. ఎన్డిఆర్ఎఫ్ బృందాల సహాయంతో ఆరుగురు యువకుల మృతదేహాలు ఆదివారం ఉదయం9 గంటలకు లభ్యం కావడం జరిగింది. మూడు రోజుల క్రితం పెళ్లి సందడితో కలకలలాడిన కుటుంబం ఐరెన్లు ఎత్తిన కార్యక్రమం అనంతరం శోకసముద్రంలో మునిగింది. తండ్రితో కలిసి ఇద్దరు కుమారులు నలుగురు బంధువులు గోదావరి స్నానానికి వెళ్లి స్నానం పూర్తి అయిన తర్వాత తిరిగి సెల్ఫీలు తీసుకోవడం జరుగుతున్న క్రమంలో గోదావరిలో పెద్ద గోతు వద్దకు వెళ్లడంతో ఆరుగురు యువకులు గల్లంతయి మృత్యువాత పడ్డారు. శనివారం సాయంత్రం నుండి ఎన్డీఆర్ఎఫ్ సహాయంతో స్థానిక పోలీసులు రెవెన్యూ సంయుక్తంగా గోదావరిలో సహాయక చర్యలు చేపట్టి. చివరికి ఆరుగురు యువకుల మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టానికి మహదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలతో సబ్ కలెక్టర్ దగ్గరుండి పోస్ట్‌మార్టం కార్యక్రమాలు నిర్వహించారు. అంబటిపల్లి గ్రామం యువకులు గల్లంతయిన విషయం మంత్రి దృష్టికి వెళ్లడంతో జిల్లా కలెక్టర్ తో పాటు పోలీస్ శాఖకు తక్షణ సహాయ చర్యల కొరకు ఆదేశించారు. మంత్రి శ్రీధర్ బాబు సహాయంతో రంగంలోకి దిగిన యంత్రాంగం రాత్రి పగలు సహాయక చర్యలు చేపట్టి ఆరుగురు యువకుల మృతదేహాలను వెలికి తీశారు. ఆదివారం రోజు పోస్టుమార్టం కొరకు తరలించిన మృతదేహాలను మంత్రి ఆదేశాలతో మృతుల కుటుంబాలకు సబ్ కలెక్టర్ రెవెన్యూ సిబ్బంది దగ్గరుండి కుటుంబాలకు ఇబ్బందులు కలగకుండా పోస్ట్ మార్టానికి సంబంధించిన సామాగ్రిని అందించారు. స్థానిక అంబులెన్స్‌ల సహాయంతో అంబటిపల్లి గ్రామానికి చెందిన మృతదేహాలను అలాగే కొర్లకుంట గ్రామానికి చెందిన మృతదేహాలను అంబులెన్స్లో తరలించారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మేడిగడ్డ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి ప్రకటిస్తూ కుటుంబాలకు ఆదుకుంటామని తెలిపారు.

**బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శ**

మేడిగడ్డలో యువకుల గల్లంతై మృత్యువాత పడిన కుటుంబాలను మహదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషి అందించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని పుట్ట మధు డిమాండ్ చేశారు.

## గోపీనాథ్ మరణం బాధాకరం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి, జూన్ 08 (జనంసాక్షి) : హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున తుది శ్వాస విడవడం బాధాకరమని, కలిచి వేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. వాషింగ్టన్ నుంచి దయాకర్రావు జనం సాక్షితో ఫోన్లో మాట్లాడుతూ గోపీనాథ్ తనతో ఉన్న అనుబందం ఎవరు పూడ్చలేనిదని అన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి ఇప్పటి బీఆర్ఎస్ వరకు తనతో కలిసి పని చేశాడని గుర్తు చేశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశారని అన్నారు. గోపీనాథ్ మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటన్నారు. గోపీనాద్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

## కేబినెట్‌లో ముస్లిం మైనార్టీలేరీ?

- కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్

**కరీంనగర్ (జనంసాక్షి) :** క్యాబినెట్లో ముగ్గురు మంత్రులను అవకాశం కల్పించిన రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు కానీ ముస్లిం మైనారిటీలకు క్యాబినెట్ల అవకాశం ఎందుకు కల్పిస్తలేరని కరీంనగర్ జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని ప్రజలు ఓటు వేసి ప్రభుత్వ ఏర్పాటు కావడానికి మైనార్టీల పాత్ర ఉంది మైనార్టీలు ఎంత కృషి చేశారో కానీ ముస్లిం మైనార్టీలను కాంగ్రెస్ పార్టీల చిన్నచూపు చూస్తున్నారని అబ్దుల్ రెహమాన్ చెప్పారని, ఎమ్మెల్సీ పదవి ఇచ్చి సియాసత్ పేపర్ చీఫ్ ఆమీర్ అలీ ఖాన్‌కు మంత్రి పదవి ఇస్తే చాలా బాగుంటుందని చెప్పారని, కనీసం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇద్దర మైనార్టీలను క్యాబినెట్ల అవకాశం కల్పించాలని ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేని ప్రియతమ నాయకురాలు సోనియా గాంధీని యువ నాయకులు అందరి ఆశాజ్యోతి కాబోయే ప్రధానమంత్రి రాహుల్ గాంధీని అలాగే పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ఒక ఇద్దరు మైనారిటీలను క్యాబినెట్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## గోపినాథ్ మృతి బాధాకరం

- దాస్యం వినయ్ భాస్కర్

**హనుమకొండ, జూన్ 08(జనంసాక్షి) :** బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణం ఎంతో బాధాకరమని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా పక్షాన ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. గోపీనాథ్ మరణం పార్టీకి తీరని నష్టమని అన్నారు. కేసీఆర్ ఒక సైనికున్ని కోల్పోయారని ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, సీనియర్ నాయకులు జానకి రాములు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు తెలిపారు.

## అర్హులందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు

- దామరంచపల్లి, విజ్జయ్యపల్లి, రాజక్కపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్
- దామరంచపల్లిలో నూతన జీపీ బిల్డింగ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**రేగొండ(గోరి కొత్తపల్లి),జూన్ 08( జనం సాక్షి):** అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం ఉదయం కొత్తపల్లిగోరి మండలంలోని దామరంచపల్లి, విజ్జయ్యపల్లి, రాజక్కపల్లి గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరీ పత్రాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై పత్రాలను అందజేశారు. అనంతరం దామరంచపల్లి గ్రామంలో నరేగా నిధులు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు ఉపయోగపడే పని చేస్తే వారి నుంచి వచ్చే స్పందన బాగుంటుందన్నారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా ఇండ్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాజకీయపార్టీలకు అతీతంగా పేద, నిరుపేదలకు మొదటి విడతలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## బోర్డులకే పరిమితమా!

- నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న క్రీడాకారులు




**ఖానాపూర్ రూరల్ 8 జూన్ (జనం సాక్షి):** గ్రామీణ ప్రాంతాల్లోని యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. 2021లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలకు ఏర్పాటు శ్రీకారం చుట్టింది. శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసానికి, క్రీడా నైపుణ్యానికి వెలికి తీసేందుకు దోహదపడేలా క్రీడా ప్రాంగణాలను నిర్మించారు .అయితే క్రీడా ప్రాంగణాలకు స్థలం ఎంపిక సమస్యగా మారింది .ఒక ఎకరం కూడా లేక అనువైన ప్రభుత్వ స్థలాలు దొరకకపోవడంతో ఎక్కడపడితే అక్కడ ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో గ్రామపంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్కు అన్ని పథకాలు ప్రారంభం జరిగినట్లు చూపించాల్సి ఉండడంతో హడావుడి గా అణువు కానీ చోట స్థలాల ఎంపిక చేసి బోర్డులను పాతించి దులుపుకున్నారు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఆయా క్రీడ ప్రాంగణాలలో వ్యాయమము చేసే పరికరాలు కూడా కనిపించడం లేదు, పిచ్చి మొక్కలు చెట్లతో నిండి ఉండడం వల్ల క్రీడాకారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## కంకరతో వెళుతున్న టిప్పర్ ఢీకొని బాలిక దుర్మరణం

**పెద్దవంగర, జూన్ 8 (జనంసాక్షి) :** కంకర వెళ్తున్న టిప్పర్ ఢీకొని ఓ బాలిక మృతి చెందిన సంఘటన పెద్దవంగర మండలంలోని కిష్టు తండా వద్ద ఆదివారం ఉదయం జరిగింది. ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం కిష్టు తండాకు చెందిన జాటత్ సోమన్న అనిత దంపతులకు ఒక కూతురు ఇందుమతి , ఒక కుమారుడు ఉన్నారు. తండాలో తనకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయం పనులు, డోజర్ డ్రైవర్ గా పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పొద్దంతా కష్టం చేసి వచ్చి సాయంత్రం ఇంటికి రాగానే తమ పిల్లల్ని చూడడంతో చేసిన కష్టాన్ని మర్చిపోయావారు ఆ దంపతులు. తొర్రూరు నుంచి హైదరాబాద్ కు వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం కిష్టు తండా వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జాటోత్ ఇందుమతి (12) ఆదివారం ఉదయం తన సైకిల్ మీద సర్వీస్ రోడ్డుపై వెళుతూ స్థానిక దుర్గామాత ఆలయానికి వెళుతున్న క్రమంలో వెనకనుంచి కంకర లోడుతో వస్తున్న టిప్పర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి సైకిల్ ని బలంగా ఢీకొట్టడంతో ఇందుమతి మీదుగా టిప్పర్ వెళ్ళింది. తలకు బలమైన గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు ఇందుమతి మృతదేహం వద్ద విలపించడంతో పలువురు కండతడి పెట్టారు. మృతురాలి తండ్రి జాటో సోమన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## మృగశిర పులకరింత

- జోరుగా చేపల విక్రయాలు



**మల్హర్, జూన్ 08(జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం మృగశిర కార్తె ప్రారంభం కావడంతో మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లోని జనం మృగశిర కార్తె సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్తె రోజున చాపలు తినడం అనవాతిగా వస్తుంది. దీంతో ఆదివారం మండల కేంద్రమైన తాడిచర్ల లో ముదిరాజ్, బెస్త కులస్తులు ఆయా చెరువులో పెద్ద ఎత్తున చేపలను పట్టి విక్రయాలు జరిపారు. చేపలు కొనేందుకు జనం ఉదయం నుండి క్యూ కట్టారు. మృగశిర కార్తె ముసలెద్దు సైతం రంకె వేస్తుందనే సామెత ఉంది. ముఖ్యంగా ఈ కార్తె నుండి తొలకరి జల్లులు సైతం కురిసే అవకాశం ఉంటుంది కాబట్టి రైతులు తమ వ్యవసాయ పనులను ప్రారంభించేందుకు సిద్ధం అవుతారు. మృగశిర కార్తె తో ముల్లోకాలు చల్లబడతాయనే విశ్వాసం ప్రజల్లో ఉండడంతో ఈ కార్తె రోజు నుండి వేసవి నుండి ఉపశమనం లభిస్తుందనే ప్రగాఢ విశ్వాసం తో రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఈ మృగశిర కార్తె సంబరాలు పండుగ వాతావరణంల ఘనంగా జరుపుకున్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

- తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్



**భీమదేవరపల్లి, జూన్ 8(జనం సాక్షి) :** ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ అన్నారు. భీమదేవరపల్లి మండలం ములకనూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు పోగుపడుతున్న ఈ వ్యర్థాల్లో ఐదో వంతు ఇండియా ఏటా ఒక్కో భారతీయుడు సగటున 11 కిలోల ప్లాస్టిక్ ను వినియోగిస్తున్నట్లు అంచన అలా దేశంలో సంవత్సర కాలంలో 93 లక్షల టన్నుల వ్యర్థాలు పోగుపడుతుంటే అందులో సుమారు 30 లక్షల టన్నులను పర్యావరణంలోకి వదిలేస్తున్నారు.ప్లాస్టిక్ సంచులు, స్ట్రాలు, ప్యాకేజింగ్ సామాగ్రి, జెండాలు, ఇయర్ బర్డ్స్ వంటి వస్తువుల వాడటం తగ్గించాలని అన్నారు.లేకపోతే మనుషులు ప్లాస్టిక్ వాడకం వలన క్యాన్సర్,సంతాన అభివృద్ధి కలగడం లేదని సంస్థలు చెపుతున్న తరుణంలో ఈ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఇప్పటికే ప్రమాదకర ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నేలతో పాటు జల ,వాయు కాలుష్యం మితిరిపోయింది.ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రభుత్వాలు మాత్రమే అరికట్టలేవు ఇది అందరి బాధ్యతగా భావించాలని కోరారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ,వ్యాపారులు ప్రజలు కలిసికట్టుగా కృషిచేసినప్పుడే ఇది సాధ్యమవుతుంది . ప్లాస్టిక్ కు బదులుగా వస్త్ర సంచులు, జనపనార వినియోగం పెరిగిన చోటల్లా ప్లాస్టిక్ వినియోగం గణనీయంగా తగ్గడం జరుగుతుంది కావున ఈ స్ఫూర్తిని అంతట కనబరిచవలసిన అవసరం ఉందని అన్నారు.


## హిందీ భవన్ కోసం భవనాన్ని కేటాయించండి

- ఎంపీకి హిందీ భాష సేవా సమితి సభ్యుల వినతి



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలోని హిందీ సాహితివేత్తలు, భాషా పండితులు, హిందీ ప్రేమికుల కోసం హిందీ లైబ్రరీ స్థాపన, హిందీ సాహితీ కార్యక్రమాల కోసం ప్రభుత్వ భవనాన్ని కేటాయించాలని కోరుతూ ఆదివారం హిందీ భాషా సేవా సమితి సభ్యులు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడామ్ నగేష్ ని కలిసి హిందీ భాష సేవా సమితి కోసం భవనాన్ని కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హిందీ భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ జిల్లాలో 50 శాతం పైబడి జనాలు హిందీ మాట్లాడతారని రాష్ట్ర భాష హిందీ యొక్క ప్రచార ప్రసారాల కోసం హిందీ భాష సేవా సమితి ఒక ప్రత్యేక లైబ్రరీని స్థాపించాలని సంకల్పించిందని అలాగే జాతీయ హిందీ దినోత్సవం, అంతర్జాతీయ హిందీ దినోత్సవం మరియు కవి సమ్మేళనాలు వివిధ సందర్భంగా హిందీ భాష కార్యక్రమాలు జరుపుకోవడానికి మరియు వివిధ పోటీ పరీక్షలకు సన్నిద్ధమయ్యే వారి కోసం కోచింగ్ సెంటర్ కోసం ఒక భవనాన్ని కేటాయిస్తే హిందీ భాష ప్రచార ప్రసారాల్లో హిందీ భాష సేవా సమితి మరింత చురుగ్గా పాల్గొని రాజభాష మరియు రాష్ట్ర భాషకు సేవ చేసే సౌభాగ్యం లభిస్తుందని అన్నారు. ఎంపీ ని కలిసిన వారిలో హిందీ భాష సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ ద్రోణాలే కార్యవర్గ సభ్యులు పొన్నారి మహేష్, రాగి సాంబన్న, చంద్రశేఖర్ అంబేకర్ కురుసంగె ఉద్ధవ్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి గడ్డం వివేక్‌కు శుభాకాంక్షల వెల్లువ



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** కాంగ్రెస్ అధిష్టానం నూతనంగా చేపట్టిన మంత్రి వర్గ విస్తరణలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి చెన్నూర్ శాసన సభ్యులు గడ్డం వివేక్ కు చోటు కల్పించడంతో సంతోషం వ్యక్తం చేస్తూ ఆదివారం జిల్లా మాల సంక్షేమ సంఘం ఆద్వర్యంలో సభ్యులు గడ్డం వివేక్ వెంకట స్వామిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీ కొప్పుల రమేష్ అసోసియేట్ అధ్యక్షులు పాశం రాఘవేందర్. జిల్లా సహాయ కార్యదర్శి ముల్కల రాజేశ్వర్, అక్క పెల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
09 జూన్ 2025

# సర్పంచ్ నుంచి మంత్రి దాకా వాకిటి శ్రీహరి..

- మొదటిసారే ఎమ్మెల్యేగా, మంత్రిగా..

**మక్తల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ వాకిటి శ్రీహరి మొదటిసారి అసెంబ్లీలో అడుగు పెట్టిన ఏడాదిన్నరకే రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామపంచాయతీ నుండి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి అసెంబ్లీ వరకు చేరుకుని మంత్రి అయ్యారు.ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని కుటుంబం నుండి వచ్చిన ఆయన అన్నీ తొలి ప్రయత్నంలోనే విజయాలను అందుకున్నారు. 2023 డిసెంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి తొలి ప్రయత్నం లోనే విజయం సాధించిన వాకిటి శ్రీహరి ఏడాదిన్నర వ్యవదిలో రాష్ట్ర మంత్రి గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి రాజకీయ ప్రస్థానంపై ప్రత్యేక కథనం..**

**మక్తల్, జూన్ 8 (జనంసాక్షి)**

నియోజకవర్గ కేంద్రం మక్తల్ పట్టణంలోని నేతాజీ నగర్ కు చెందిన వాకిటి శ్రీహరి ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని కుటుంబం నుండి ఎమ్మెల్యే మంత్రి స్థాయికి ఎదగడం విశేషం. సామాన్య మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన ఆయన రాజకీయాల్లోకి అడుగుపెట్టి ప్రతిసారి విజయాన్ని సొంతం చేసుకుంటూ ప్రజల మన్ననలు పొందుతూ వచ్చారు. అదే ప్రయత్నంలో తొలిసారే ఎమ్మెల్యేగా గెలుపొంది రికార్డు సృష్టించారు. తల్లి రాములమ్మ స్టాఫ్ నర్స్ గా పనిచేసి స్థానికంగా వేలాదిమంది నిరుపేద మహిళలకు కాన్పులు చేసి రాములమ్మ సిస్టర్ గా ఎంతో ప్రఖ్యాతిగాంచారు .ఏ మారుమూలనైనా మహిళ పురటి నొప్పులతో బాధపడిందంటే అక్కడ రాములమ్మ సిస్టర్ ఉండాల్సిందే అంతటి స్థాయిలో తన సేవలను అందించారు. తండ్రి వాకిటి నరసింహులు (పహిల్వాన్) వ్యవసాయం చేస్తూ చన్నపాటి గుత్తేదార్. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు కలిగిన వాకిటి శ్రీహరి డిగ్రీ దాకా తన విద్యభ్యాసం కొనసాగించారు. అనంతరం 1996 లో రాజకీయ ప్రవేశం చేసి



1996 నుండి 2001 వరకు మక్తల్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2001లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొదటిసారి మక్తల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా పోటీ చేసి పాలమూరు ఉమ్మడి జిల్లాలోని అత్యధిక భారీ మెజారిటీతో గెలుపొంది రికార్డు సృష్టించారు. అదే సమయంలో ఆయన డిసిసి ఉపాధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. 2006- 2011 ప్రాంతంలో ఆయన సతీమణి వాకిటి లలితా శ్రీహరి మండల పరిధిలోని దాసరి దొడ్డి నుండి ఎంపిటిసి సభ్యురాలుగా ఎంపికయ్యారు. అదే సమయంలో 2006 నుండి 2012 వరకు ఆయన సోదరుడు వాకిటి శేషగిరి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడుగా ఎన్నికై ఉపసర్పంచిగా ఎంపికయ్యారు. యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పని చేశారు. 2014 లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మక్తల్ నుండి జడ్పిటిసిగా పోటీ చేసి తెలంగాణ రాష్ట్రంలోనే రెండవ భారీ మెజారిటీ సాధించి రికార్డు సృష్టించారు. 2014 నుండి 18 వరకు ఉమ్మడి పాలమూరు జిల్లా జడ్పీ ఫ్లోర్ లీడర్ గా పనిచేశారు. అదే సమయంలో డిసిసి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. అదేవిధంగా కృష్ణాజిల్లాల పరిరక్షణ సమితి సభ్యుడిగా మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి, అప్పటి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తో కలిసి పని చేశారు. 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించారు. అయితే కాంగ్రెస్ తెదేపా పొత్తులో భాగంగా మక్తల్ స్థానాన్ని తెదేపాకు కేటాయించడంతో పోటీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నారు. అయినా పార్టీని నమ్ముకుని గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పని చేస్తూ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్న ఆయనకు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం మక్తల్ అభ్యర్థిగా టికెట్ ఖరారు చేసింది. ఎమ్మెల్యే టికెట్ కోసం వాకిటి శ్రీహరితో పాటు పోటీపడిన మరో ఏడుగురు సైతం వాకిటి శ్రీహరి గెలుపు కోసం పనిచేశారు. అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం కలిగిన వాకిటి శ్రీహరి ఈ ఎన్నికల్లో ప్రజల మద్దతు చూరగొని రెండుసార్లు వరుసగా మొత్తం మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది మధ్యలో ఒకసారి ఓటమి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్ రెడ్డి పై 17 525 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. సామాన్య మధ్యతరగతి రైతు కుటుంబానికి చెందిన వాకిటి శ్రీహరి నియోజకవర్గంలో సమస్యల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండడం మంత్రి గా బాధ్యతలు చేపట్టడంతో రాబోయే రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధికి కలిసి వచ్చే అవకాశంగా చెప్పవచ్చు. గత పదేళ్లుగా నియోజకవర్గ అభివృద్ధికి నోచుకోకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం లో మంత్రి కావడంతో పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసే అవకాశం ఉందని నియోజకవర్గ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### వాకిటి శ్రీహరి కుటుంబ నేపథ్యం..

మక్తల్ ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి కుటుంబం సామాన్య మధ్యతరగతి వ్యవసాయ కుటుంబం. తండ్రి వాకిటి నరసింహులు (పహిల్వాన్) వ్యవసాయంతో పాటు చిన్నపాటి గుత్తేదారుగా పనిచేశారు. తల్లి వాకిటి రాములమ్మ స్టాఫ్ నర్స్ గా పనిచేసి ఈ ప్రాంతంలో నిరుపేద మహిళల కాన్పులు చేసి ప్రజల మన్ననలు పొందారు. పదవి విరమణ పొంది 20 ఏళ్లు దాటినప్పటికీ ఆమె ఇప్పటికీ ప్రజల నోట్లో నానుతున్నారంటే అతిశయోక్తి కాదు. వాకిటి శ్రీహరితో పాటు తమ్ముడు వాకిటి శేషగిరి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. మక్తల్ మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గా పని చేశారు. శేషగిరి సతీమణి వాకిటి రాధిక శేషగిరి మక్తల్ మున్సిపల్ కౌన్సిలర్ గా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా పనిచేశారు. నలుగురు సోదరీమణులు ఉన్నారు. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి ఇద్దరు కుమారులు పెద్దబాబు అచ్యుత్ రామ్ రాజు జాతీయ స్థాయి క్రికెటర్, రెండో బాబు అమిత్ సాయిరాజ్. మంత్రి వాకిటి శ్రీహరి కూడా మంచి క్రికెటర్. బ్యాటింగ్, బౌలింగ్లో ఆయనది అందె వేసిన చేయిగా స్థానికంగా మంచి గుర్తింపు ఉంది.

## వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ పోలెమోని కృష్ణ



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూన్ 8 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో మక్తల్ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి ని ముదిరాజ్ సామాజిక వర్గం నుండి ఈ సారి అవకాశం దక్కినందుకు నారాయణపేట జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ పోలెమోని కృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా మునుముందు రాజకీయంగా బలంగా ఎదగాలని వెనుక బడిన బి.సి. కులాలకు రాష్ట్ర మంత్రిగా నారాయణపేట జిల్లా కు ప్రత్యేక నిధులు సమకూర్చి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి స్థానిక ఎన్నికల్లో తమ బలాన్ని ఉపయోగించి అధిష్టానం తన పై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టు కోనెందుకు కృష్ణ చేయాలని పత్రికా ప్రకకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



**నిజాంపేట్, జూన్ 8 (జనం సాక్షి) :** చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన రాంరెడ్డిపేట లో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని రాంరెడ్డిపేట గ్రామ శివారులోని నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ లో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు పోతుగంటి గంగారాం (48) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. నిజాంపేట మండల పరిధిలోని రాంరెడ్డిపేట గ్రామానికి చెందిన గంగారాం రోజు వారీ మాదిరిగానే చేపల వేటకు కోసం ఆదివారం తెల్లవారు జామున నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిలోకి వెళ్లాడు. వల వేసి చేపలు పట్టే క్రమంలో బలమైన ఈదురు గాలులు వీచడంతో థర్మాకోల్తో తయారు చేసిన తెప్ప తలకిందులైనట్లు స్థానికులు తెలిపారు. తెప్పపై నుంచి నీటిలో పడిన గంగారాం చేపల వేట కోసం నీటిలో వేసిన వలలో చిక్కుకుని మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడు గంగారాంకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య దసవ్వ పిర్యాదు మేరకు కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అల్ఫోర్స్ హైస్కూల్లో కృత్రిమ మేధస్సుపై అవగాహన




**కరీంనగర్ బ్యూరో, జూన్ 8 (జనంసాక్షి) :** నేటి విద్యా విధానంలో కృత్రిమ మేధస్సుకు ప్రత్యేకమైన స్థానం ఉన్నదని ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృత్రిమ మేధస్సు పట్ల విస్తృతమైన అవగాహన కలిగి ఉండాలని విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి, సీబీఎస్ఇ నిపుణులైన బి.రవి కిరణ్ , చారు దింగ్ర లతో కలిసి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన తరగతి గదిలో కృత్రిమ మేధస్సు వాడకంపై అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని వేడుకగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృత్రిమ మేధస్సు పట్ల విస్తృతమైన అవగాహన కలిగి ఉండాలని వాటిలోని విషయాలను సమగ్రంగా విశ్లేషించినట్లయితే నేటి పోటీ ప్రపంచంలో అత్యుత్తమ స్థానంలో ఉండడమే కాకుండా పై చేయి సాధించిన వారవుతారని అభిప్రాయపడ్డారు. నేడు అగ్ర దేశాలైన స్వీడన్, స్విజర్లాండ్, అమెరికా, బ్రిటన్ లో కృతిమ మేధస్సు పట్ల విశ్లేషణ జరుగుతున్నదని దానిని వాడడం జరుగుతుందని చెప్పారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో కృతిమ మేధస్సు అమలుపరచడం పట్ల ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని సమాజంలో వెలువడుతున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యతమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. అవగాహన సదస్సులో భాగంగా ఉపాధ్యాయులు ప్రదర్శించినటువంటి పలు చిత్రమాలికలు ఆకర్షణీయంగా నిలిచాయని, పలువురు ఉపాధ్యాయులు మరి ఆలోచనల ద్వారా సభికులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గుడిసెలున్న పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వరా..?

- రాజకీయ పలుకుబడి ఉన్న వాళ్లకు మాత్రమే ఇండ్ల పట్టాలా...?
- ఆర్థికంగా, ఓటు బ్యాంకు పరంగా ఉన్నవారికి మాత్రమే ఇండ్లు
- ఎమ్మెల్యే పై దుమ్మెత్తి పోస్తున్న ఇండ్లు రాని నిరుపేదలు..
- కాంగ్రెస్‌పై స్థానిక ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపనున్న ఇందిరమ్మ ఇండ్ల పంచాయతీ..

**గుడిసెలలో బతుకుతున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి నీకు చేతులు రావడం లేదా ఎమ్మెల్యే గారు... వీరిని ఓటు బ్యాంకు మాత్రమే చూస్తారా... పేదలంటే అంత చిన్న చూపా మీకు, ఇందిరమ్మ రాజ్యములో ఇబ్బందులు ఉండవమ్మా ఈ పాట పూర్తిగా అవాస్తమేనా? ప్రజా ప్రభుత్వం అంటే పేద ప్రజలకు కాదా! బందిపోట్లకు అవకాశవాదులకు మాత్రమే నా! మర్రిగూడ మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో గుడిసెలు, బోకులు, కిరాయి ఇండ్లలో, కూలిపోయే మిద్దలున్న నిరుపేద ప్రజలు, ఇందిరమ్మ ఇండ్లు ఎందుకు రాలేదని కడుపు మండి నిరుపేదలు ప్రశ్నిస్తున్న ప్రశ్నలు ఇవి...**

**మర్రిగూడ, జూన్ 8 (జనం సాక్షి)**

మర్రిగూడ మండలంలో ఎంతోమంది ఇల్లు లేని నిరుపేదలు ప్రజా ప్రభుత్వంలో తమకు కచ్చితంగా ఇల్లు వస్తుంది తమ సొంతింటి కల సహకారం అవుతుందని వస్తుందని ఆశతో



ఎంతోమంది నిరుపేదలు గుడిసెలలో కాలం వెలదీస్తున్నారు, వానాకాలం వస్తే వారి అవస్థలు అంతా ఇంతా కావు, ఎప్పుడు కూలిపోతుందో అని భయం భయంగా బ్రతుకుతున్న ప్రాణాలవి, పెద్దగా ఆశ లేకున్నా తమకు ఒక పక్కా ఇల్లు ఉండాలని ఆశపడే పేద బ్రతుకులవి సొంతింటి కల సహకారం అవుతుందని ఆశగా ఎదురు చూశారు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమకు తప్పకుండా న్యాయం చేస్తాడని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కచ్చితంగా నిలబెట్టుకొని పేద ప్రజలకు ఇల్లు కేటాయిస్తాడని ఆ నిరుపేదలు ఎంతో ధీమాగా ఉన్నారు.
తమకు కచ్చితంగా ఇల్లు వస్తుందని ఆశతో ఎదురుచూసిన పేద ప్రజలకు నిరాశే మిగిలింది... కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్థికంగా ఓటు బ్యాంకు కలిగిన వారికి మాత్రమే ఇల్లు కేటాయించి గుడిసెలలో కాలం వెళ్లదీస్తున్న పేద ప్రజల నోరు కొట్టారు, నిరుపేదల గోడు వినేది ఎవరు? అరణ్య రోదనగా మారిన నిజమైన ఇందిరమ్మ ఇండ్ల అర్హులు, ఇండ్లు ఉన్నవారికి మాత్రమే మళ్లీ ఇల్లు కేటాయించడంపై పేద ప్రజలు రగిలిపోతున్నారు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పై దుమ్మెత్తి పోస్తున్నారు, పేద ప్రజల ఉసురు తప్పకుండా తలుగుతుందని ప్రజలు ఎమ్మెల్యే పై శాపనార్థాలు పెడుతున్నారు, ప్రజా ప్రభుత్వం అంటే ప్రజల కోసం పనిచేయాలి కానీ ఇలా బందిపోట్లకు అవకాశవాదులకు మాత్రమే ప్రభుత్వం పని చేస్తుందని మర్రిగూడ మండల ప్రజలు ఆరోపిస్తున్నారు,ఏ గ్రామంలో చూసిన ఇదే చర్చ... ఇల్లు ఉన్న వాళ్లకు మాత్రమే మళ్ళీ ఇల్లు ఇవ్వడం.. గుడిసెలలో బతుకుతున్న పేదవాళ్లకు ఎందుకు ఇండ్లు కేటాయించలేదని ప్రశ్న ఉత్పన్నమవుతుంది, పేదవాడు బతకడానికి అవకాశం లేదా స్వార్థపూరిత రాజకీయ నాయకులకు ఈ పేదవారిని చూస్తే మనసు కరగదా... రాజకీయ లబ్ధి కోసమే పని చేస్తారా మీరు, పేద ప్రజలు ఆక్రోషం వెళ్లగక్కుతున్నారు, దీన్ని బట్టి చూస్తే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరఫున నిలబడే అభ్యర్థులపై తీవ్ర ప్రభావం చూపనుంది.

# నిజాలను నిర్భయంగా రాయడమే నిజమైన జర్నలిజం

- ప్రతి జర్నలిస్టుకు బీమా చేయిస్తా..
- జర్నలిస్టులందరూ నాకు ఆత్మీయులే..
- వాస్తవాలను తెలుసుకొని నిర్భయంగా రాస్తేనే సమాజానికి మేలు..
- గ్రామస్థాయి నుంచి వచ్చిన నాకు జర్నలిస్టుల సమస్యలు తెలుసు..
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు ఇందిరమ్మ ఇండ్లు వర్తింప చేస్తాం
- త్వరలోనే జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవనానికి స్థలం నిధులు మంజూరుపై హామీ
- జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం లో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, జూన్ 8 (జనంసాక్షి) :** నిజాలను నిర్భయంగా రాయడమే నిజమైన జర్నలిజం వృత్తి అని,వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రతి జర్నలిస్టుకు తానే స్వయంగా బీమా చేయిస్తానని అందుకు సంబంధించిన చర్యలు చేపట్టాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో నిర్వహించిన వనపర్తి నియోజకవర్గం స్థాయి జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు,
ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని ఒక సామాన్య వ్యక్తి గా ప్రజలతో మమేకమై నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.నియంత్రుత్వ పోకడాతో కాకుండా





స్నేహపూర్వకంగా ఎవరి ఆత్మగౌరవం దెబ్బతీయకుండా స్వేచ్ఛ వాతావరణం లోపరిపాలననందిస్తానన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులగా ఉన్న జర్నలిస్టుల నిజాలను, సమస్యలను నిర్భయంగా వ్రాయాలని సూచించారు.
గత ప్రభుత్వ హయాంలో సామాన్యప్రజలకునిత్యావసరాలను సమాకుర్చడం, రైతులకు, వ్యాపారస్తులకు మౌలిక వసతులు,సాగు నీరు,విధ్యుత్ సౌకర్యలు కల్పించడం విఫలమైదన్నారు.
నిర్లక్ష్యానికి,నిస్పృహకు లోనైనా ప్రతి రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధికి తార్కణం నిలిచేలా చేసి చూపిస్తానన్నారు. చాలా ఏండ్లుగా, అసంపూర్తిగా మిగిలిపోయినావనపర్తి జిల్లా,మండలాల ప్రెస్ క్లబ్ స్థలం,భవన నిర్మాణం,అర్హులైన ప్రతి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు రాజీవ్ యువశక్తి పథకం వర్తింపు ప్రక్రియ పూర్తి చేసేందుకు తాను బాధ్యత తీసుకుంటాని జర్నలిస్టులకు భరోసా కల్పించారు.జర్నలిస్టుల కుటుంబాలకు విద్యా, వైద్యం రంగాలలో రాయితీలను కల్పించేలా, నియోజకవర్గం లోని ప్రతి జర్నలిస్టుకు భీమా సౌకర్యం తాను చేయిస్తానన్నారు.జర్నలిస్టులకు భవిష్యత్తు లో ప్రభుత్వం తరఫున ఎటువంటి సహాయం చేసేందుకు ఏళ్ల వేళల అందుబాటులో ఉంటానని భరోసా కల్పించారు. జర్నలిస్టులు ఎమ్మెల్యే దృష్టి కి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు.వనపర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు డి. మాధవరావు, బోలమోని రమేష్,ఎన్.రవీందర్ రెడ్డి,కొండన్న, బి.రాజు, బి. లక్ష్మణ్ బి. విజయ్, నాకొండా, ఎం.భాస్కర్, జీ. దినేష్, శ్రీనాథ్, కుమార్, కమల్, ఖాళీల్, తరుణ్, విజయ్,వెంకటేష్ గౌడ్ శేఖర్,ఎమ్మెల్యే పీఆర్ ఓ గోపాల్,సూరపల్లి గోపాల్,విజయ్ తదితరులు హాజరయ్యారు.


## చేపల మార్కెట్‌లో మృగశిర కార్తె సందడి

**రాజోలి, జూన్ 8 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని చేపల మార్కెట్లో ఆదివారం మృగశిర కార్తె సందడి నెలకొంది. మృగశిర కార్తె ప్రారంభమవ్వగానే చేపలు తినడం తెలుగు ప్రజల ఆనావాయితీ. ప్రస్తుతం మృగశిర కార్తె ప్రవేశించడంతో రెండు, మూడు రోజులు చేపలకు డిమాండ్ ఏర్పడనుంది. మృగం, మిరుగు, మిర్గ, మృగశిర కార్తె వంటి పేర్లతో ఈ పండుగను జరుపుకుంటారు. రోహిణి కార్తె ముగిసి మృగశిర కార్తె ప్రారంభమవ్వడంతో ఎండకాలం ఎండలు తగ్గి వాతావరణం చల్లబడుతుంది. ఒక్కసారిగా వాతవరణంలో మార్పులతో శరీర ఉష్ణోగ్రతలో మార్పులు జరిగి పలు వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని, అందుకోసం వర్షాకాలంలో సోకే వ్యాధులను అడ్డుకునేందుకు మృగశిర కార్తె ప్రారంభంలో చేపలు తినడం మంచిదని పెద్దలు చెప్తుంటారు. మృగశిర కార్తె రోజు చేపల కూర తింటే శ్వాస సంబంధితమైన వ్యాధులు నియంత్రించడంతో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని నమ్మకం. ఉబ్బసం, ఆయాసం ఉన్నవారికి ఇవాళ చేపలు తినడం ఎంతో మంచిదని అంటారు. దీంతో చేపల మార్కెట్‌లో రద్దీ పెరిగింది. చేపలు కిలో రూ.200 నుంచి 300 వరకు పలికింది. కార్తె ప్రారంభంతోపాటు ఆదివారం కావడంతో చేపల ధరలతో పాటు చికెన్ ధరలకు కూడా రెక్కలొచ్చాయి. కిలో చికెన్ రూ.280 కాగా, మటన్ కిలో రూ.800 వరకు పలికింది.






## అమెరికా స్టాక్‌మార్కెట్‌లో ఇండియన్ కంపెనీ




**జనంసాక్షి:**దేశీ మెడికల్ టెక్నాలజీ కంపెనీ ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంట ర్నేషనల్ తాజాగా అమెరికాలోని నాస్డాక్ ఎక్స్ఛేంజీలో లిస్టయ్యింది. ఈ సందర్భంగా ఓపెనింగ్ బెల్ మోగించే కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు స్యుధీర్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు. కంపెనీ రూపొందించిన ఎస్ఎస్ఐ మంత్ర సర్జికల్ రోబోటిక్ సిస్టం ప్రస్తుతం దేశీయంగా 75 ప్రాంతాల్లోని 80 ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంది. వీటితో 100 పైగా సర్జికల్ ప్రొసీజర్లకు సంబంధించి 4,000 పైగా రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించినట్లు సంస్థ తెలిపింది. అటు అంతర్జాతీయంగా నేపాల్, కొలంబియా, ఉక్రెయిన్, ఈక్వెడర్ తదితర దేశాల్లోనూ కంపెనీ కార్యకలాపాలు విస్తరించింది. 2024 డిసెంబర్‌తో ముగిసిన సంవత్సరంలో కంపెనీ ఆదాయం 3.5 రెట్లు వృద్ధి చెంది 5.9 మిలియన్ డాలర్ల నుంచి 20.6 మిలియన్ డాలర్లకు పెరిగింది. స్థూల మార్జిన్లు 12.3 శాతం నుంచి 40.9 శాతానికి ఎగిశాయి.

# రుణంతోనే సొంతిల్లు..

## ఈ విధానానికే ఎక్కువ డిమాండ్

**జనంసాక్షి:**గృహాలకు డిమాండ్ పెరుగుతుండటంతో గృహ రుణ మార్కెట్ కూడా బలపడుతోంది. అర్బన్ మనీ గణాంకాల ప్రకారం.. దేశంలోని ప్రధాన నగరాలలో 2025 ఆర్థిక సంవత్సరంలో గృహ రుణాల పంపిణీ పరిమాణం 10 శాతం, విలువలు 15 శాతం మేర పెరిగాయి. ముఖ్యంగా రూ.కోటి కంటే ఎక్కువ టికెట్ సైజు ఉన్న రుణాలు ఏడాది కాలంలో గృహ రుణ పంపిణీలో 21 శాతం మేర వృద్ధి చెందాయి. తుది గృహ కొనుగోలుదారుల డిమాండ్, పట్టణీకరణ, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలతో గృహ రుణాలు సులభతరంగా పంపిణీ అవుతున్నాయి. గృహ రుణ పరిమాణం, విలువలు రెండు అంకెల వృద్ధిని నమోదు స్తోందని అర్బన్ మనీ రీసెర్చ్ వెల్లడించింది. దేశంలోని ప్రధాన నగరాలలో మహిళా గృహ రుణ గ్రహీతలు పెరుగుతున్నారు. ప్రతి ఐదు గృహ రుణాలలో ఒక మహిళా రుణ గ్రహీత ఉంది. గృహరుణ పంపిణీలో పురుషుల వాటా 10 శాతం కాగా.. మహిళ రుణ గ్రహీతల వాటా 9 శాతంగా ఉంది. అదే లోన్ అమౌంట్‌లో చూస్తే మ




గవారి వాటా 14 శాతంగా ఉండగా.. మహిళల వాటా 23 శాతంగా ఉంది. అర్బన్ మనీ నివేదిక ప్రకారం ప్రధాన నగరాలలో సగటు రుణం రూ.74 లక్షలుగా ఉంది. ఇది ఏటేటా 5 శాతం వృద్ధిని నమోదు చేస్తోంది. సగటున పురుషులు రూ.76 లక్షల రుణం తీసుకుంటుంటే.. మహిళా రుణ గ్రహీతలు రూ.70 లక్షల రుణం తీసుకుంటున్నారు. పురుషులు తీసుకునే లోన్ అమౌంట్ ఏటా 3 శాతం వృద్ధి చెందుతుండగా.. మహిళల రుణం ఏకంగా 13 శాతం పెరుగుతోంది. లోన్ అమౌంట్ వారీగా చూస్తే.. రూ.కోటి కంటే ఎక్కువ రుణం వాటా 21 శాతం కాగా.. రూ.45 లక్షల నుంచి రూ.కోటి మధ్య లోన్ వాటా 32 శాతం, రూ.45 లక్షల కంటే తక్కువ లోన్ వాటా 47 శాతంగా ఉంది.

## జెన్‌ఏఐలో పోటీలు..

### రూ. 10 లక్షలు బహుమతి

**జనంసాక్షి:**నెక్ట్స్‌వేవ్, ఓపెన్‌ఏఐ అకాడమీ కలిసి దేశీయంగా అతి పెద్ద జెన్‌ఏఐ ఇన్నోవేషన్ బిల్డ్‌థాన్‌కి శ్రీకారం చుట్టాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర మొత్తం 7 రాష్ట్రాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించాయి. 500 క్యాంపస్‌ల నుంచి 25 వేల మందికి పైగా విద్యార్థులు జెన్ ఏఐ టెక్నాలజీలో నైపుణ్యాలను పెంచుకునేందుకు ఇదొక అవకాశం కాగలదని పేర్కొన్నాయి. మూడు రౌండ్లలో జరిగే ఈ పోటీల్లో విజేతలకు మొత్తం రూ. 10 లక్షల బహుమతితో పాటు ఓపెన్‌ఏఐ వ్యవస్థలో కెరియర్‌ను తీర్చిదిద్దుకునే అవకాశాలు లభిస్తాయి. పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైన టీమ్స్.. రియల్ టైమ్ శిక్షణ, మెంటార్ సపోర్ట్, సర్టిఫికెట్లు మొదలైనవి పొందవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా 2,000కు పైగా ఏఐ ప్రాజెక్టులకు రూపకల్పన జరగవచ్చని నెక్ట్స్‌వేవ్ అంచనా వేస్తోంది.




## టాటా కారు ఓనర్లకు గుడ్‌న్యూస్..

**జనంసాక్షి:**ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ తమ కస్టమర్ల కోసం దేశవ్యాప్తంగా మాన్సూన్ చెకప్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. జూన్ 6న ప్రారంభమైన ఈ క్యాంపులు 20వ తారీఖు వరకు కొనసాగుతాయని వివరించింది. 500 నగరాల్లో 1,090 ఆథరైజ్డ్ వర్క్‌షాప్‌లలో ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని కంపెనీ పేర్కొంది. ఈ క్యాంపులో భాగంగా వాహనంలోని ముప్పై కీలక పాయింట్లను పరీక్షించే సమగ్ర హెల్త్ చెకప్ సేవలు పొందవచ్చని వివరించింది. కార్ టాప్ వాష్, ఒరిజినల్ స్పేర్ పార్టులు, ఇంజిన్ ఆయిల్, యాక్సెసరీలు, లేబర్ చార్జీలపై ప్రత్యేక డిస్కౌంట్లు పొందవచ్చని టాటా మోటార్స్ తెలిపింది.


# జాబ్ కొట్టాలంటే.. క్రెడిట్ స్కోరు ఉండాల్సిందే..

- కంపెనీల్లో కొత్త ధోరణి..

**జనంసాక్షి:**సాంకేతిక పురోగతి, మారుతున్న సంస్థల అవసరాలతో ఉద్యోగ అన్వేషణ తీరులో వేగంగా మార్పులు జరిగిపోతున్నాయి. ఉద్యోగార్థుల అర్హతలను నిర్ణయించడానికి కంపెనీలు రెజ్యూమెలు, ఇంటర్వ్యూలను దాటి వెతుకుతున్నాయి. చాలా సంస్థలు ఇప్పుడు అభ్యర్థుల ఆర్థిక నేపథ్యాన్ని అంచనా వేయడానికి వారి క్రెడిట్ స్కోర్‌ను కూడా తనిఖీ చేస్తున్నాయి. ఇది నేరుగా ఉద్యోగ పనితీరుతో సంబంధం లేనప్పటికీ, అభ్యర్థి ఆర్థిక క్రమశిక్షణ, విశ్వసనీయతకు సూచికగా క్రెడిట్ స్కోర్‌ను యాజమాన్యాలు పరిగణిస్తున్నాయి. అయితే ప్రతి కంపెనీ ఉద్యోగార్థుల క్రెడిట్ హిస్టరీని తనిఖీ చేయదు కానీ, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, కొన్ని ప్రభుత్వ సంస్థలు మాత్రం ఈ వైఖరిని అనుసరిస్తున్నాయి. ముఖ్యంగా మీరు ఫైనాన్స్, బ్యాంకింగ్, అకౌంటింగ్ లేదా సెక్యూరిటీ క్లియరెన్స్ అవసరమయ్యే ఉద్యోగాలకు దరఖాస్తు చేస్తుంటే నియామక ప్రక్రియలో భాగంగా మీ క్రెడిట్ స్కోర్‌ను పరిగణనలోకి తీసకునే అవకాశం ఉంది. ఈ రోజుల్లో చాలా కంపెనీలు అభ్యర్థుల నేపథ్యాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాయి. ఈ కసరత్తును నిర్వహించడానికి థర్డ్ పార్టీ ఏజెన్సీలను సైతం నియమించుకుంటున్నాయి. క్రెడిట్ స్కోర్ అనేది మూడు అంకెల సంఖ్య, దీనిని ఆర్థిక సంస్థలు రుణాలు ఇవ్వడానికి తరచుగా




ఉపయోగిస్తాయి. ఇది 300 నుండి 900 మధ్య ఉంటుంది. క్రెడిట్ స్కోర్ ఎంత ఎక్కువగా ఉంటే, అనుకూలమైన వడ్డీ రేటుతో రుణాలు త్వరగా ఆమోదం పొందే అవకాశాలు అంత మెరుగ్గా ఉంటాయి. ఇది మీ రుణ అర్హత గురించి రుణదాతకు హామీ ఇస్తుంది. మీరు తీసుకున్న మొత్తాన్ని ఎటువంటి డిఫాల్ట్ లేకుండా సకాలంలో తిరిగి చెల్లించగలరు అనే నమ్మకాన్ని కలిగిస్తుంది. మీకు తక్కువ క్రెడిట్ స్కోర్ ఉంటే, మీరు రుణం లేదా క్రెడిట్ కార్డు చెల్లింపులను మిస్ అయ్యారని, అవసరానికి మించి అప్పు తీసుకున్నారని లేదా రుణాలను డిఫాల్ట్ చేశారని చూపిస్తుంది. దీని వల్ల డబ్బు దొంగిలించడం, డేటా లీక్ చేయడం లేదా మోసానికి పాల్పడటం వంటి విషయాలకు మీరు ఎక్కువగా గురవుతారని కంపెనీ యజమాన్యం అనుకోవచ్చు. ఒక కంపెనీ మీ క్రెడిట్ హిస్టరీని చెక్ చేసిందంటే.. మీరు రుణాలు, క్రెడిట్ కార్డులు, బిల్లు చెల్లింపులను ఎంత బాగా నిర్వహించారు వంటి మీ గత ఆర్థిక ప్రవర్తనను చూస్తోందని అర్థం. మీరు అప్పుల్లో ఉంటే, మీరు మీ ఆర్థిక వ్యవహారాలను సరిగ్గా నిర్వహించడం లేదని ఇది సూచిస్తుంది. తక్కువ క్రెడిట్ స్కోర్ మీరు పనిలో చాలా పరధ్యానంలో ఉన్నారనే అభిప్రాయాన్ని కలిగిస్తుంది. ఇది తప్పులు చేయడానికి, గడువులను కోల్పోవటానికి దారితీస్తుంది. ఆర్థిక విషయాలను నిర్వహించే పాత్రలకు, మీరు సరైన వ్యక్తి కాదని కంపెనీలు భావించవచ్చు. క్రెడిట్ స్కోరు మీ ఉద్యోగ దరఖాస్తును నేరుగా ప్రభావితం చేయదు కానీ, కొన్నిసార్లు ఇది కొన్ని రంగాలలో నియామక నిర్ణయాన్ని ప్రభావితం చేస్తుంది. ఫైనాన్షియల్ సెక్టార్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సున్నితమైన ఆర్థిక విషయాలను బాధ్యతాయుతంగా నిర్వహించగలరని భరోసా ఇవ్వడానికి తమ క్రెడిట్ స్కోర్‌ను షేర్ చేయాలని కంపెనీలు అడగవచ్చు.




## థాయ్‌లాండ్ బందీ మృతదేహం లభ్యం

### ఇజ్రాయెల్ దాడుల్లో మరో 95 మంది మృతి

టెల్ అవీవ్: గాజాలో థాయ్‌లాండ్ బందీ నాతాపొంగ్ పింటా మృతదేహాన్ని ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం శనివారం ప్రకటించింది. 2023 అక్టోబర్ 7న హమాస్ మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై హఠాత్తుగా దాడికి దిగి 1,200 మందిని హత్య చేయడంతోపాటు 251 మందిని బందీలుగా గాజాకు తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. బందీల్లో ఇజ్రాయెల్ పౌరులతోపాటు విదేశీయులు కూడా ఉన్నారు. థాయ్‌లాండ్ పౌరుడు నాతాపొంగ్ పింటా కూడా అప్పట్లో హమాస్ చెరలో చిక్కుకున్నాడు. అతడిని విడిపించేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. కాల్పుల విరమణ ఒప్పందంతో కొందరు బందీలు విడుదలైనప్పటికీ పింటాకు విముక్తి లభించలేదు. తాజాగా అతడి మృతదేహం లభించడం విషాదాన్ని నింపింది.

## డెమోక్రాట్లకు నిధులిస్తే బాగోదు'

### మస్క్‌కు ట్రంప్ వార్నింగ్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్ మధ్య అంతకంతకూ వైరం తీవ్రస్థాయికి చేరుతోంది. అగ్రరాజ్యం అమెరికాలో వివాదాస్పద బడ్జెట్ బిల్లుకు ఓటు వేసే రిపబ్లికన్లపై చర్యలు తీసుకోవాలని టెక్ బిలియనీర్ ప్రయత్నిస్తే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మాజీ సలహాదారు ఎలాన్ మస్క్‌ను హెచ్చరించారు. వ్యయ బిల్లుపై మస్క్ విమర్శల అనంతరం అధ్యక్షుడు ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్య స్నేహం చెడింది. ఈ నేపథ్యంలో ఈ బిల్లుకు అండగా నిలుస్తున్న రిపబ్లికన్లను మస్క్ టార్గెట్ చేస్తున్నారనే వార్తలు ట్రంప్‌ను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దీంతో ట్రంప్ బహిరంగంగా మస్క్‌కు హెచ్చరించారు. ట్రంప్ తీసుకువస్తున్న బడ్జెట్ బిల్లును వ్యతిరేకిస్తున్న కొంతమంది డెమోక్రాట్ ఎంపీలు తమకు



భారీగా నిధులు సమకూర్చాలని ఎలాన్ మస్క్‌ను కోరారు. దీనికి మస్క్ సమ్మతించారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డెమోక్రాట్లకు నిధులు ఇస్తే తీవ్ర పరిణామాలు తప్పవని ఎలాన్ మస్క్‌ను ట్రంప్ హెచ్చరించారు.

## ఆరు వేలు దాటిన కోవిడ్ కేసులు

అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డేటాబోర్డులో వెల్లడించిన సమాచారం ప్రకారం.. కేరళలో అత్యధికంగా 1950 కేసులు నమోదయ్యాయి. గుజరాత్ 822, పశ్చిమబెంగాల్ 693, దిల్లీ 686, మహారాష్ట్ర 595, కర్ణాటక 366, ఉత్తరప్రదేశ్ 219, తమిళనాడు 194, రాజస్థాన్ 132, హరియాణా 102, ఆంధ్రప్రదేశ్ 86, బిహార్ 49, ఛత్తీస్‌గఢ్ 41, మధ్యప్రదేశ్ 39, పంజాబ్ 35, ఒడిశా 33, సిక్కిం 23, పుదుచ్చేరి 15, తెలంగాణ 10, జమ్మూ కశ్మీర్, గోవా, ఉత్తరాఖండ్‌లలో ఒక్కో రాష్ట్రంలో 9 చొప్పున కేసులు, అస్సాం 6, ఝూరండ్ 4, హిమాచల్ ప్రదేశ్ 3, చండీగఢ్ 2, త్రిపురలో ఒకరు వైరస్ బారినపడినట్లు తెలుస్తోంది. అరుణాచల్ ప్రదేశ్, మిజోరాంలలో ఎటువంటి కేసులు నమోదు కాలేదు.

## గౌతమ్ అదానీ జీతం పెరిగింది




**జనంసాక్షి:**అదానీ గ్రూప్ చైర్మన్, దేశంలోనే రెండో అత్యంత ధనవంతుడైన గౌతమ్ అదానీ 2025 ఆర్థిక సంవత్సరంలో రూ .10.41 కోట్ల వేతనం అందుకున్నారు. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 12 శాతం పెరిగింది. అదానీ గ్రూప్‌లోని తొమ్మిది లిస్టెడ్ కంపెనీల్లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (రూ.2.54 కోట్లు), అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ (రూ.7.87 కోట్లు) నుంచి ఆయనకీ ఆదాయం వచ్చింది. గతంతో పోలిస్తే ఈసారి వేతనం పెరిగినప్పటికీ, అదానీ పారితోషికం దేశంలోని చాలా మంది అగ్రశ్రేణి పారిశ్రామిక అధినేతల కంటే చాలా తక్కువ కావడం గమనార్హం. తోటి వ్యాపారాధినేతలైన సునీల్ భారతి మిట్టల్ (2024 ఆర్థిక సంవత్సరంలో రూ.32.27 కోట్లు), రాజీవ్ బజాజ్ (2024 ఆర్థిక సంవత్సరంలో రూ.53.75 కోట్లు), పవన్ ముంజాల్ (2024 ఆర్థిక సంవత్సరంలో రూ.109 కోట్లు), ఎల్ అండ్ టీ చైర్మన్ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ (2025 ఆర్థిక సంవత్సరంలో రూ.76.25 కోట్లు), ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ ఎస్ పరేఖ్ (2025 ఆర్థిక సంవత్సరంలో రూ.80.62 కోట్లు) వంటి వారు అదానీ కంటే ఎక్కువ వేతనం అందుకున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తన గ్రూప్‌లో పనిచేసే ఎగ్జిక్యూటివ్‌లలో కొంతమంది అదానీ కంటే ఎక్కువ పారితోషిక ప్యాకేజీలను అందుకున్నారు. ఏఈఎల్ సీఈవో వినయ్ ప్రకాశ్ రూ.69.34 కోట్లు, అదానీ గ్రీన్ ఎనర్జీ ఎండీ వినీత్ ఎస్ జైన్ రూ.11.23 కోట్లు ఆర్జించారు. ఇది భారతదేశ కార్పొరేట్ నాయకత్వంలోని విభిన్న వేతన నిర్మాణాలను హైలైట్ చేస్తుంది. ఇక్కడ కొంతమంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు వేతన ఆధారిత సంపాదనలో కంపెనీ వ్యవస్థాపకులనే అధిగమిస్తుండటం గమనించవచ్చు.

## ఆస్పత్రి కింద హమాస్ రహస్య సొరంగం

గుర్తించిన ఇజ్రాయెల్ దళాలు

ఆస్పత్రులను తమ రక్షణకవచాలుగా వాడుకుంటున్న హమాస్

జెరూసలేం: ఇజ్రాయెల్ దళాలు హమాస్ రహస్య స్థావరాన్ని గుర్తించాయి. గాజా ఆస్పత్రి కింద హమాస్ టన్నెల్ నెట్‌వర్క్‌ను కొను గొన్నట్లు పేర్కొన్నాయి. ఇజ్రాయెల్ దళాలకు వ్యతిరేకంగా సాగించే హమాస్ కార్యకలాపాలకు ఈ సొరంగం కమాండ్ సెంటర్‌గా ఉపయోగి స్తుంటారని ఇజ్రాయెట్ తెలిపింది. అలాగే ఆయుధాలు, నిఘా సామగ్రితో కూడిన భూగర్భ మౌలిక సదుపాయాలు కలిగివున్న సొరంగపు ఫుటేజీని విడుదల చేసింది. గాజాలోని ఖాన్ యూనిస్‌లోని ఒక కీలక ఆస్పత్రి కింద ఈ సొరంగం ఉందని ,ఇజ్రాయెల్ సైన్యం తెలిపిన వివరాల ప్రకారం యూరోపియన్ హాస్పిటల్ కాంపౌండ్ కింద ఉన్న ఈ సొరంగం సీనియర్ హమాస్ నేతల కమాండ్ అండ్ కంట్రోల్‌కు కేంద్రంగా ఉంటూ, ఇజ్రాయెల్ దళాలపై దాడులను సమన్వయం చేయడానికి ఉపయోగపడింది.



# చైనాలో 'మ్యాన్ మమ్స్' ట్రెండ్


- అబ్బాయిలకు ఫుల్ డిమాండ్..

బీజింగ్: మారుతున్న జీవనశైలి కారణంగా ఉరుకులు పరుగుల జీవితం నడుస్తోంది. ప్రేమ, ఆప్యాయతలకు, కుటుంబాలకు కొందరు దూరం అవుతున్నారు. డబ్బు సంపాదించే క్రమంలో ఒత్తిడికి గురవుతున్నారు. ఈ క్రమంలో ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఇందులో భాగంగానే చైనాలో ఓ కొత్త ట్రెండ్ హాట్ టాపిక్‌గా మారింది. ఒత్తిడికి గురవుతున్న యువతులు.. అబ్బాయిలను హగ్ చేసుకుంటున్నారు. ఈ హగ్ ఊరికే కాదు.. ఒక్కసారి హగ్ చేసుకుంటే సదరు యువతి.. 50 యువాన్లు (భారత కరెన్సీలో దాదాపు 600 రూపాయలు) చెల్లించి ఉంటుంది. దీంతో, చైనా అబ్బాయిలకు ఫుల్ గిరాకీ నడుస్తోంది. సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనం ప్రకారం.. ఒత్తిడి అధిగమించేందుకు చైనాలోని యువతులు ఓ వినూత్న పద్ధతిని అనుసరిస్తున్నారు. మానసిక సాంత్వన కోసం డబ్బులు చెల్లించి 'మ్యాన్ మమ్స్' అని పిలవబడే వ్యక్తుల నుంచి కొద్దిసేపు హగ్ పొందుతున్నారు. గతంలో 'మ్యాన్ మమ్స్' అనే పదాన్ని కండలు తిరిగిన శరీరంతో జిమ్‌లో కసరత్తులు చేసే పురుషులను ఉద్దేశించి వాడేవారు. అయితే, ఇప్పుడు ఈ పదం అర్థం మారింది. శారీరకంగా ధృడంగా ఉంటూనే, సున్నితత్వం, ఓర్పు, ఆప్యాయత వంటి లక్షణాలున్న పురుషులను 'మ్యాన్ మమ్స్'గా పరిగణిస్తున్నారు. వీరు అందించే కౌగిలింతలు ఒత్తిడిని తగ్గించి, ఓదార్పునిస్తాయని యువతులు భావిస్తున్నారు. చైనా ప్రస్తుతం మ్యాన్ మమ్స్ ట్రెండ్‌లోకి వచ్చింది. ఇక, ఈ ట్రెండ్ ప్రకారం.. అమ్మాయికి ఎవరైనా అబ్బాయి ఐదు నిమిషాల పాటు హగ్ ఇస్తే రూ. 600 చెల్లిస్తారు అమ్మాయిలు. ఎవరైనా అబ్బాయిలు.. ఐదు నిమిషాల పాటు హగ్ ఇస్తే రూ. 200 నుంచి రూ. 600 వరకు పే చేస్తున్నారు. ఆన్ లైన్‌లో ముందుగానే ఈ హగ్స్ కోసం అమ్మాయిలు.. నచ్చిన కుర్రాడిని బుక్ చేసుకుంటారు. ఆ తర్వాత మాల్స్, పార్కులు, అండర్ గ్రౌండ్ రోడ్లు.. ఇలా పబ్లిక్ ప్లేసుల్లో ఇలా చేస్తున్నారు. ఇలా నచ్చినవారిని హగ్ చేసుకోవడం వల్ల తమ ఒత్తిడి తగ్గిపోతుందని అమ్మాయిలు భావిస్తున్నారు. ఈ సందర్భంగా ఒక యువతి మాట్లాడుతూ.. మూడు గంటల పాటు ఓవర్‌టైమ్ పని చేసిన తర్వాత, ఒక 'మ్యాన్ మమ్'ను కలుసుకున్నాను. అతను మూడు నిమిషాల పాటు నన్ను కౌగిలించుకున్నాడు. ఈ సందర్భంగా ఒక యువతి మాట్లాడుతూ.. మూడు గంటల పాటు ఓవర్‌టైమ్ పని చేసిన తర్వాత, ఒక 'మ్యాన్ మమ్'ను కలుసుకున్నాను. అతను మూడు నిమిషాల పాటు నన్ను కౌగిలించుకున్నాడుఉద్యోగం, ఆఫీసు ఒత్తిడికి సంబంధించి ఆవేదన వ్యక్తం చేస్తుండగా అతడు నెమ్మదిగా నా భుజం తట్టాడు. దీంతో, ఒత్తిడి దూరమే ప్రశాంతంగా అనిపించింది' అని చెప్పుకొచ్చింది. అంతకుముందు.. ఒక విద్యార్థిని, తనకు ఓదార్పునిచ్చేందుకు దయగల, ఫిట్‌గా ఉండే 'మ్యాన్ మమ్' నుంచి కౌగిలింత కావాలని, అందుకు డబ్బులు చెల్లిస్తానని ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసింది. 'నాకు సెకండరీ స్కూల్‌లో ఉన్నప్పుడు ఒకసారి ఇలాగే కౌగిలించుకుంటే చాలా సురక్షితంగా అనిపించింది. మనం ఒక అండర్‌గ్రౌండ్ స్టేషన్‌లో ఐదు నిమిషాలు కౌగిలించుకుంటే చాలు' అని ఆమె రాసుకొచ్చింది. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్ అయింది, లక్షకు పైగా కామెంట్లు వచ్చాయి.

# వానరాకను చెప్పే గొడుగు..

- వర్షంలో క్లిక్‌మనిపించే కెమెరా..

**జనంసాక్షి:**వానొచ్చిందంటే ఎన్నో సరదాలను తెస్తుంది. వాటితో పాటు ఎన్నో సమస్యలను కూడా! అయితే, వాన తెచ్చే తిప్పల్లో అన్నీ కాకపోయినా కొన్నింటికి చెక్ పెట్టే స్మార్ట్ సొల్యూషన్సే ఈ గాడ్జెట్స్! వాన పడుతుంటే చాలా మంది చాయ్‌లో బిస్కట్ ముంచేస్తారు. కాని, అంతకంటే ఎక్కువ మంది వానలో మంచి మ్యూజిక్‌తో మూడ్‌ని మిక్స్ చేసి ఎంజాయ్ చేస్తుంటారు. అలాగని, వర్షంలో స్పీకర్ పెడితే అప్పుడు అది సింకింగ్ షిప్ అయిపోతుంది. ఇందుకోసమే ఓ అద్భుతమైన ఆవిష్కరణ వచ్చేసింది. వాటర్‌ప్రూఫ్ బ్లూటూత్ స్పీకర్. దీనిని బయటపెట్టి మ్యూజిక్ ప్లే చేస్తే రెయిన్ డాన్స్ పార్టీని క్రియేట్ చేయొచ్చు. ధర వివిధ బ్రాండ్స్, డిజైన్స్ బట్టి ఉంటుంది. ఆన్‌లైన్‌లో లభ్యం. వర్షం వచ్చిన వెంటనే కాఫీ చేతిలో పట్టుకొని, ఓపెన్ టెర్రస్ మీద సరదాగా ఓ సెల్ఫీ తీసుకోవాలనిపించిందా? కాని, ఫోన్ జారిపోతుందేమోననే భయంతో, కేవలం కాఫీనే ఎంజాయ్ చేస్తున్నారా? ఇప్పుడు అవన్నీ పాత కథలు! ఎందుకంటే ఇప్పుడు మీ చేతిలోకి వచ్చింది 'ఇస్టా 360'. ఈ చిన్న గాడ్జెట్ తీసే ఫొటోలు, వీడియోలు హాలీవుడ్ లెవెల్‌లో ఉంటాయి. అన్ని యాంగిల్స్‌లోనూ అద్భుతంగా తీయగల ఈ చిన్న కెమెరా ఉంటే ఇక పెద్ద పెద్ద కెమెరాలతో పని ఉండదు. పైగా ఇది వర్షం చూసి పారిపోయే కెమెరా కాదు. ఇది తానే నీళ్లలోకి దూకేస్తుంది. అంటే పది మీటర్ల లోతు వరకు వాటర్ ప్రూఫ్ అన్నమాట. చక్కగా షర్ట్‌కి అంటించి పెట్టుకొని వాడుకోవచ్చు. పైగా కెమెరాను ఎక్కడైనా మర్చిపోతే, మీ ఫోన్ మాత్రం 'ఏయ్, ఇక్కడ ఉంది కెమెరా' అని ఇందులోని అలర్ట్ సిస్టమ్ చెప్తుంది. ధర. 599 డాలర్లు (రూ. 51,003). 'వాన వస్తుందా




లేదా? గొడుగు తీసుకెళ్దామా? వద్దా?' అని ఇలా మీలో మీరు ప్రశ్నలు వేసుకునే ముందు ఒక్కసారి ఈ 'డ్యావెక్ అలర్ట్ గొడుగు'ను అడిగి చూడండి. వాతావరణం ఎలా ఉండబోతుందో ఈ గొడుగే చెప్తుంది. పైగా దీనిని ఫోన్‌కు కనెక్ట్ చేసుకొని కూడా వాడుకోవచ్చు. ఇందులోని అలెర్ట్ సిస్టమ్ ఎప్పుడైనా గొడుగును తీసుకెళ్లడం మర్చిపోయారో, వెంటనే, టింగ్ అని ఫోన్‌కి మెసేజ్ వస్తుంది 'నన్ను మర్చిపోయావ్ బాస్' అని గొడుగు మీకు గుర్తుచేస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే ఇది గొడుగు కాదు. బ్రహ్మానందం లెవల్ కామెడీ ప్లస్ స్మార్ట్‌నెస్‌ను కలిపిన వస్తువు. పైగా ఇది సాధారణ గొడుగులా కాకుండా చాలా బలంగా ఉంటుంది. ఈదురు గాలులకు కూడా కదలదు. ఇక దీని స్టయిల్‌లో చూసుకుంటే, పెద్ద పెద్ద డిజైనర్ గొడుగులు కూడా దీనితో పోటీ పడలేవు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
9 జూన్ 2025

# ఇందూర్ జిల్లాకు చుక్కెదురు




## షబ్బీర్ అలీ, సుదర్శన్ రెడ్డిలకు మొండిచెయ్యి

### మదన్మోహన్‌రావు, తోట లక్ష్మికాంతారావు ఆశలపై నీళ్లు

**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 08 (జనం సాక్షి) :** నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు రెండో విడత మంత్రి వర్గ విసరణలో కూడా చుక్కెదురైంది. ఆదివారం జరిగిన మంత్రి వర్గంలో ఆశావహులకు ఉమ్మడి ఇందుర్ జిల్లా నుంచి ఎవరి పేరు లేకపోవడం గమనార్హం. మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి చెన్నూరు ఎమ్మెల్యే డా. గడ్డం వివేక్ వెంకటస్వామి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ధర్మపురి శాసన సభ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిలకు మంత్రి వర్గంలో చోటు దక్కింది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మంత్రిగా పని చేసినప్పటికీ అయనకు మంత్రి పదవి ఎలాగైనా వస్తుందన్న నమ్మకం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులలో ఉన్న ఆశ నీరుగారిపోయింది. రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో ఇది వరకే రెడ్డి సామజిక వర్గానికి చెందిన మంత్రులు అధికంగా ఉండడంతోనే అయనకు మంత్రి పదవి రాలేదనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా వెలమ సామజిక వర్గానికి చెందిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మైనారిటీ వర్గానికి చెందిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీలు ఆశపడిన భంగపడ్డారనే చెప్పాలి. అంతేకాకుండా ఇప్పటి వరకు మంత్రి పదవికి నోచుకోని జుక్కల్ నియోజకవర్గం నుండి కూడా మంత్రి పదవి కోసం ప్రజలు ఎదురు చూశారంటే నమ్మాల్సిందే.

దళిత సామజిక వర్గానికి చెందిన, అందులో మాదిగ సామజిక వర్గానికి చెందిన తోట లక్ష్మి కాంతారావు కూడా మంత్రి పదవి కోసం శాయశక్తులా ప్రయత్నం చేశారు. జుక్కల్ నియోజకవర్గం ఏర్పాటు అయిన నాటి నుండి ఇప్పటి వరకు మంత్రి పదవి తమ నియోజకవర్గానికి మంత్రి పదవి రాకపోవడం, ఇదివరకు మూడు పర్యాయాలు గెలుపొందిన సౌదాగార్ గంగారాం మంత్రి పదవి కోసం ప్రయత్నం చేసి, చివరికి లిడ్ క్యాప్ చైర్మన్ పదవితో సరిపెట్టుకోక తప్పలేదు. అదేవిధంగా మూడుసార్లు గెలుపొందిన హన్మంత్ షిండేకు సైతం మంత్రి పదవి వరించలేదు. మధ్యకాలంలో జుక్కల్ ఎమ్మెల్యేగా ఉండి, ఆ ప్రాంత అభివృద్ధికి ఆజ్యం పోసిన విద్యావంతురాలు కుమారి అరుణ తారకు సైతం మంత్రి పదవి ఎస్సీ మహిళా కోటాలో వస్తుందని ప్రచారం జరిగినప్పటికీ అది నిజం కాలేదు. ఉమ్మడి జిల్లాకు చెందిన కీలక నేతలు మొదటి విడత మంత్రివర్గ విస్తరణ నుంచి మంత్రి పదవి వస్తుందని ఆశపడినప్పటికీ నిరాశ మాత్రం తప్ప లేదు. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కోసం అధిష్టానం వద్ద ఒత్తిడి తెచ్చినప్పటికీ సామాజిక సమీకరణాల నేపథ్యంలో ఆయనకు రెండోసారి కూడా నిరాశ తప్పలేదని తెలిసింది. ఉమ్మడి జిల్లాలో సీనియర్ నాయకుడిగా మాజీ మంత్రిగా పనిచేసిన అనుభవంతో సీఎం రేవంత్ రెడ్డితో ఉన్న బంధుత్వం నేపథ్యంలో సుదర్శన్ రెడ్డికి రెండో విడతలో మంత్రి పదవి ఖాయం అనుకున్న ఆయన అనుచరులకు కూడా నిరాశ తప్పలేదు. సుదర్శన్ రెడ్డి శనివారం ఢిల్లీకి ప్రయాణం కావడంతో ఆయన పేరు క్యాబినెట్ విస్తరణలో ఉంటుందని అనుకున్నప్పటికీ జాబితాలో పేరు లేకపోవడం విచారకరం. ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్మోహన్ ఈ సారి ఖచ్చితంగా మంత్రివర్గ విస్తరణలో తనకు అవకాశం ఉంటుందని వెలమ సామాజిక వర్గానికి కచ్చితంగా అవకాశం ఉంటుందని ఆశపడ్డారు. మాజీ మంత్రి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తనకు మైనార్టీ కోటాలో మంత్రి పదవి వస్తుందని గత రెండు పర్యాయాలుగా ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యేగా ఓటమి చెందడంతో ఆయనకు ప్రభుత్వ సలహాదారు పదవి ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం ఆ విషయంలో ఇతరుల వైపు ఆసక్తిగా ఉందని ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి జిల్లా మంత్రివర్గ విస్తరణలో అవకాశం లేకపోవడంతో ఇంచార్జి మంత్రి పాలన మరికొన్ని రోజులు తప్పదని చెప్పాలి.

రెండో విడత మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి దక్కకపోవడానికి రెడ్డిలలో, వెలమ సామాజిక వర్గంలో ఆశవాహుల మధ్య గట్టి పోటీ ఉండటం కారణమని చెబుతున్నారు. మొదటి విడత మంత్రివర్గంలో పనిచేస్తున్న ఇద్దరిని తొలగిస్తారని వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఉంటుందని ప్రచారం జరిగిన దానిని ఏఐసీసీ వర్గాలు కొట్టి పారేశాయి. ప్రస్తుత మంత్రివర్గంలో అసంతృప్తి లేదని అందరూ ఐక్యంగా ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్లో కలిసి పని చేస్తున్నారని రాష్ట్ర ఇంచార్జ్ నివేదిక ఇచ్చినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో 18 నెలల తర్వాత రెండో విడత మంత్రివర్గ విస్తరణ జరిగినప్పటికీ మరో మూడు పదవులను భర్తీ చేయాల్సి ఉండడంతో ఉమ్మడి జిల్లాలో ఎవరికో ఒకరికి ఆలస్యమైన మంత్రి పదవి వస్తుందని ఇంకా ఆశతో ఉన్నారు.

### సుదర్శన్ రెడ్డి రాజీనామా చేస్తారా?

రాష్ట్ర క్యాబినెట్‌లో మంత్రి పదవి దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రాజీనామా చేస్తారనే పుకార్లు షికార్లు కొడుతున్నాయి. అయన అసంతృప్తితో ఉన్నందున బుజ్జగించేందుకు సుదర్శన్ రెడ్డి ఇంటికి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ లు వెళ్లినట్లు తెలిసింది. రెండో విడత మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కకపోవడంతో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. రెండో విడత మంత్రివర్గం విస్తరణలో సామాజిక కూర్పు నేపథ్యంలో ముగ్గురికి మాత్రమే అవకాశం ఇవ్వగా అందులో తన పేరు లేకపోవడంతో ఆయన కినుకు వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి గత 18 నెలలుగా మంత్రి పదవిపై సుదర్శన్ రెడ్డి ఆశ పెట్టుకున్నారు. కాగా, రెడ్డి సామాజిక వర్గానికి ఇదివరకే నలుగురికి మంత్రి పదవులు ఉండడంతో సామాజిక సమీకరణాల కారణంగా ఇతర నేతలు ఒత్తిడితో మంత్రి పదవి మిస్ అవుతోంది. రెండో విడత మంత్రివర్గ జాబితాలో తన పేరు లేకపోవడంతో ఆయన తీవ్ర అసంతృప్తి తో తనకు మంత్రి పదవి రాకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అనుచరులతో అన్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధినాయకత్వం సుదర్శన్ రెడ్డితో మాట్లాడేందుకు ప్రయత్నించారు. కానీ ఆయన అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తో పాటు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లి బుజ్జగించేందుకు ప్రయత్నిస్తున్నారు. సామాజిక వర్గాల సమీకరణలు తర్వాత మూడో విడతలో అవకాశం ఇస్తారని హామీ ఇచ్చినట్టు సమాచారం.

### ఈ ప్రభుత్వం చరిత్రను తిరగరాసింది :

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో ఏ పార్టీకి చెందిన ప్రభుత్వం కొలువు దీరినా ఉమ్మడి ఇందూరు జిల్లాకు రెం డు మంత్రి పదవులు ఖరాఖండిగా వచ్చేవి. కానీ ఈ ప్రభుత్వం కొలువు దీరిన తరువాత ఒక్క మంత్రి పదవి కూడా రాకపోవడం ఉమ్మడి జిల్లా ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ జిల్లా నుండి మంత్రి పదవులను పొందిన మహానుభావులు ఎందరో ఉన్నారనేది చరిత్ర చెబుతోంది. ఉమ్మడి జిల్లా నుండి మంత్రి పదవులు పొందిన వారిలో అర్గుల్ రాజారాం, ఏలేటి మహిపాల్ రెడ్డి, ఈశ్వరీబాయి, సంతోష్ రెడ్డి, డి. శ్రీనివాస్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కే. ఆర్. సురేష్ రెడ్డి, మండవ వెంకటేశ్వర్ రావు, సుదర్శన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, షబ్బీర్ అలీ ఉండగా కే. ఆర్. సురేష్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ రాష్ట్రాలకు శాసన సభాపతులుగా వ్యవహరించారు.

## పాలిటెక్నిక్ విద్యార్థి ఆత్మహత్య



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 08 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా నరసాపురం గ్రామానికి చెందిన సిందే శివకుమార్ (17) నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. కాగా సెకండ్ సెమిస్టర్ లో రెండు సబ్జెక్టులు, థర్డ్ సెమిస్టర్‌లో రెండు సబ్జెక్టులు, ఫోర్త్ సెమిస్టర్ లో రెండు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. ఈ విషయంపై మంచిగా చదువుకోమని తండ్రి మందలించారు. వారం క్రితం సప్లమెంటరీ పరీక్షలు రాయడానికి నిజామాబాద్ వచ్చాడు. అయితే ఈ నెల 6 మధ్యాహ్నం తాను ఉంటున్న హాస్టల్ నుంచి దాస్ నగర్ గ్రామ శివారు కు వచ్చి గడ్డి మందు తాగి తిరిగి హాస్టల్ కు వెళ్లగా అక్కడ వాంతి చేసుకొన్నాడు. అతని స్నేహితులు గమనించి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్టు మాక్లూరు ఎస్సై తెలిపారు.

## రామోజీరావు మాకు స్ఫూర్తిదాయకం

### కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

రామోజీకి ఘన నివాళి అర్పింస్తున్న దృశ్యం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 8 (జనంసాక్షి) :** ఈనాడు గ్రూపు సంస్థల అధినేత,పద్మవిభూషణ్ రామోజీరావులోని క్రమశిక్షణ, పట్టుదల,నిజాయితీ ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.ఆదివారం రామోజీరావు వర్ధంతి సందర్భంగా బండి సంజయ్ కుమార్ సిరిసిల్లలో రామోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారితో గడిపిన క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేనివన్నారు.ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు.ఈనాడు గ్రూపు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీరావుతో ఉన్న అనుబంధాన్ని మరువలేం. చంద్రయాన్ ను విజయవంతంగా ప్రయోగించిన రోజు రామోజీ ఫిల్మ్ సిటీలోని రామోజీరావును దాదాపు 3 గంటలపాటు గడిపిన క్షణాలు ఇంకా నా కళ్ల ముందే మెదులుతున్నాయి. ఆయనను కలిసిన ప్రతిసారి జరిగే చర్చలు ఎంతగా ఆసక్తి కారంగా ఉండేవన్నారు. ఆయనలోని నిజాయితీ, క్రమశిక్షణ,దూరదృష్టి, అనుకున్నది సాధించే వరకు మొండి పట్టుదలతో వ్యవహరించే తీరు నాకెప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. రామోజీరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళి అర్పిస్తున్నా. రామోజీ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన ఆశయాల సాధనలో ఈనాడు గ్రూపు సంస్థల మరింత ముందుండాలన్నారు.రామోజీ మన మధ్య లేకపోయినా ఆయన స్మృతులు, ఆశయాలు సజీవంగా ఉన్నాయన్నారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు గోపి రాష్ట్ర నాయకులు ప్రతాప రామకృష్ణ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. సిట్ కార్యాలయం మారింది

**జూబ్లీహిల్స్ :** ఫోన్ టాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకున్నది. ఈ కేసులో ఏ1 అయిన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకరరావు హైదరాబాద్ చేరుకున్నారు. సోమవారం ఆయన విచారణకు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో మాసబ్ ట్యాంక్ నుంచి మళ్లీ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కి సిట్ ఆఫీస్‌ను మార్చారు. రెండునెలల పాటు వెస్ట్ జోన్ డీసీపీ కార్యాలయం నుంచి పని చేసిన సిట్.. ఇకపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ నుంచి పని చేయనున్నది. ప్రభాకర్ రావు విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో సిట్ కార్యాలయాన్ని మార్చడం ఉత్కంఠ నెలకొంది.ఫోన్ ట్యాపింగ్‌పై పంజాగుట్ట పీఎస్‌లో గతేడాది కేసు నమోదైన విషయం తెలిసిందే

## సాన్వి విద్యాసంస్థల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలు





◆ గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన సాన్వి విద్యాసంస్థల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్

**కరీంనగర్ బ్యూరో, జూన్ 08 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో రేకుర్తి లోని సాన్వి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి సాన్వి బ్యాట్మెంటన్ టోర్నమెంట్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం రోజు జరిగిందని సాన్వి విద్యాసంస్థల చైర్మన్ ఎర్రంశెట్టి మునిందర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ టోర్నమెంట్లో రెండు విభాగాలుగా ఆటలు జరిగాయని మొదటి విభాగం 35 ప్లస్ విభాగంలో 100 మంది, అలాగే అండర్ 18 విభాగంలో 140 మంది బ్యాడ్మింటన్ క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. 35 ప్లస్ విభాగంలో 100 మందిలో ఛాలెంజ్ గా జరిగిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో ఫైనల్ గా విజేతలుగా నిలిచిన వారు శరత్ కుమార్ హుజురాబాద్, శ్రీకాంత్ హుజురాబాద్ విజేతలుగా నిలిచారు. అలాగే 35 ప్లస్ విభాగంలో రన్నర్ గా కరీంనగర్ కు చెందిన చారి, కరీంనగర్ కు చెందిన రాజు రన్నర్ గా నిలిచారు. అలాగే అండర్ 18 విభాగంలో 140 మంది బ్యాడ్మింటన్ క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారు. రెండవ విభాగం అండర్ 18 విభాగంలో బాలికలకు, బాలురకు వేరువేరుగా నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీలలో అండర్ 18 బాలుర విభాగంలో విన్నర్ గా సంజయ్, హర్షవర్ధన్ విజేతలుగా గెలిచారు. అలాగే రన్నర్ గా శ్రీజ్ఞాన్, క్షితిజ్ నిలిచారు. అలాగే బాలికల విభాగంలో విన్నర్ మేఘన, సంజన విజేతలుగా నిలిచారు. అలాగే రన్నర్ గా వైశాలి, హర్షిత రన్నర్ నిలిచారు. గెలుపొందిన విజేతలకు సాన్వి విద్యాసంస్థల అధినేత మునిందర్ విజేతలకు రూ.3000 నగతి బహుమతితో పాటు మెమోటో బహుకరించారు. అలాగే రన్నర్ గా నిలిచిన వారికి రూ.2000 నగదు బహుమతితో పాటు మెమెంటో అందజేశారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులను ఉద్దేశించి సాన్వి విద్యా సంస్థల చైర్మన్ మాట్లాడుతూ... సాన్వి విద్యాసంస్థలు క్రీడాకారులకు ఎప్పుడు అండగా ఉంటాయని, సాన్వి విద్యాసంస్థల ద్వారా నేవీ, ఆర్మీ , డిఫెన్స్ ఉద్యోగాలలో సాన్వీలో శిక్షణ పొందిన 300 మంది విద్యార్థులకు సాన్వి డిఫెన్స్ అకాడమీ ద్వారా ఉద్యోగాలు పొందారని వారికి సాన్వి ద్వారా చదువుతోపాటు క్రీడలు శిక్షణ ఇచ్చి దేశానికి సేవ చేసే పౌరులుగా తీర్చిదిద్దామని అన్నారు. అలాగే బ్యాట్మెంటన్ రంగంలో ఉత్సాహం ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సాన్వి విద్యాసంస్థలు ఎప్పుడు ముందుంటుందని, అంతే కాకుండా సాన్వి విద్యాసంస్థల్లో క్రీడా పోటీలు నిత్యం నిర్వహిస్తామని, రాబోయే రోజులలో బ్యాడ్మింటన్ క్రీడను మరింత అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తానని సాన్వి విద్యాసంస్థలు అధినేత ఎర్రంశెట్టి మునీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ కోచులు గా మధుకర్, గంగరాజు, రవి, లక్ష్మణరావు, న్యాయ నిర్ణయితలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రెటరీ గుంటపల్లి స్వామి, మాస్టర్స్ బ్యాట్మెంటన్ అకాడమీ సెక్రటరీ బాబు, కరీంనగర్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు నామ రమేష్ , కందుకూరి శంకర్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

## మహిళా సంఘాల ద్వారా రికార్డు స్థాయిలో వరి ధాన్యం కొనుగోలు





◆ కొనుగోలు కేంద్రాల ద్వారా మహిళా సంఘాలకు ఆరు కోట్ల కమిషన్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 8 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మహిళా సంఘాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు రికార్డు స్థాయిలో నిలిచింది.కొనుగోలు కేంద్రాల ద్వారా మహిళా సంఘాలకు రూ ఆరు కోట్ల కమిషన్ రానుంది. ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మహిళా సంఘాలకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఐకెపి కింద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధిక శాతం మంజూరు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు కోసం 190 కేంద్రాలను ఎక్కువ మొత్తంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మహిళ సంఘాలకు కేటాయించారు. అకాల వర్షాలు,వాతావరణ కారణాలతో రైతుల ధాన్యం ఉత్పత్తులు పాడవకూడదని ఉద్దేశంతో ఏప్రిల్ మొదటి వారంలో 242 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంబించి 42,119 రైతుల నుండి రూ 625 కోట్ల విలువైన 2.7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంను రికార్డు స్థాయిలో కొనుగోలు చేశారు.

**మహిళా సంఘాల ద్వారా 470 కోట్ల విలువైన ధాన్యం సేకరణ..**

జిల్లాలో 190 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా రూ 470 కోట్ల విలువైన 2.2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 32,556 రైతుల నుంచి కొనుగోలు చేశారు.వీటిలో మొత్తం 190 కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. వీటిలో 32,087 మంది రైతుల వివరాలు ఆన్లైన్ లో నమోదు చేయగా, రూ 415 కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయి. మిగతా రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు త్వరలో జమ కానున్నాయి.

**మహిళా సంఘాలకు రూ 6 కోట్ల కమిషన్.**

ఇందిరా మహిళా శక్తిలో భాగంగా దాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లాలో భారీ సంఖ్యలో కేటాయించగా, కొనుగోలు సజావుగా పూర్తి చేశారు. ధాన్యం సేకరణ తుది దశకు చేరుకుంది. ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు సేకరించిన ధాన్యం ఒక క్వింటాలుకు రూ 32 కమిషన్‌గా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన జిల్లాలోని మహిళా సంఘాలకు దాదాపు 6 కోట్ల రూపాయల కమిషన్ కింద రానున్నాయి.ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నేడు జిల్లాలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల మహిళా సంఘాల సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు కృతజ్ఞతలు తెలుపుటకు సభను నిర్వహించనున్నారు.

## ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లతో భరోసా : షబ్బీర్ అలీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 8 (జనం సాక్షి) :** కామారెడ్డి నియోజకవర్గం దోమకొండ మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ ఇంటిని పరిశీలించి అనంతరం హరిజన వాడలోని ఇల్లు లేని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం జరిగింది ఆదివారం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఇంద్రమ్మ ఇల్లు పనులను ముగ్గువేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల్లో ఉన్న ఇల్లు లేని నిరుపేదలకు ఇచ్చిన మాట ప్రకారం ఇల్లు కట్టించి హామీలను అమలు చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ దళితుల ఇంటి పార్టీ కాంగ్రెస్ హామీ ఇస్తే తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను,మంజూరు చేసాం ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున మంజూరయ్యాయని, కామారెడ్డి నియోజకవర్గానికి 3028 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని, త్వరలో 472 లబ్ధిదారులను ఎంపిక చేస్తారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను అమలు చేస్తూ ఎన్నికల్లో హామీ ఇవ్వని పథకాలు కూడా అమలు చేస్తున్నామని,500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 2 లక్షల రుణమాఫీ రైతు భరోస అందజేస్తున్నామని,200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందిస్తున్నాం కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ఆరోగ్యశ్రీ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సకాలంలో అందజేస్తున్నా మని, పేద ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామన్నారు.

## కోడెల మరణానికి కారణం మంత్రి కొండ సురేఖనే..



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి)** వేములవాడ రాజన్న గోశాలలో కోడేలు మృత్యువాత పడుతున్న క్రమంలో ఆదివారం బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరిశీ లించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజన్న ఆలయ గోశాలలో కోడెల మరణానికి ప్రధాన కారణం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖనే అన్నారు. మేము అధికారంలో ఉన్నప్పుడు గోశాలను ఎన్నడూ రాజకీయం చేయలేదనీ,చేసే తప్పంతా చేసి ఎదుటి వారిపై బురద జల్లేలా మంత్రి పరిస్థితి ఉందన్నారు.కలెక్టర్ కన్వీనర్ గా ఉండి ఒక్కో రైతుకు రెండు కోడెలు ఇవ్వాల్సిన నిబంధనలను తుంగలో తొక్కింది మంత్రి సురేఖ కాదా అని ప్రశ్నించారు. ఆమె సిఫారసు లెటర్ మీద గీసుకొండ రాంబాబుకు 60 కోడెలను ఇచ్చింది నిజం కాదా అన్నారు.60 కోడెల్లోని 49 కోడెలు మాయమైంది నిజం కాదా, అన్నాడు అన్ని పత్రికల్లో,చానెళ్లలో వచ్చిన వార్త లు నిజం కాదా.. దీనికంతటికి మంత్రి సురేఖనే కారణమన్నారు. మంత్రి చేసిన నిర్వాకం వల్ల డిసెంబర్ 1 నుండి కోడెల పంపిణీ ఆగిపోయింద న్నారు. 500 కోడేలు గోశాలలో ఉండాల్సిన స్థానంలో 1300కు చేరిన మాట వాస్తవం కదా అన్నారు.ఇక్కడ అసలైన రాజకీయం ఎవరు చేస్తున్నారో ఆలోచన చేయలన్నారు.స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అవగాహన లేకుండా కోడేలకు లంపి స్కిన్ వ్యాధులు వచ్చి చనిపోతున్నాయని అంటున్నారు. వెటర్నరీ డాక్టర్లు మాత్రం సరైన పోషక ఆహారం అందక చనిపోతున్నాయ న్నారు. ఇలా సరైన పోషణ లేక కోడెలు చనిపోవడం చాలా బాధాకరమన్నారు. రోజుకు 10 టన్నుల పశుగ్రాసం వస్తుందని అంటున్నారు కానీ రెండు టన్నులు కూడా గోశాలకు రావడం లేదన్నారు.మరి మిగిలిన గడ్డి ఎవరు మేస్తున్నారు, నెలకు రూ 5 లక్షలు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయన్నారు.బీహార్ లో గడ్డి స్కాంలో మంత్రి ఇరుక్కునట్లే ఇక్కడ కూడా ఎవరో ఒకరు ఇరుక్కుంటారన్నారు. కోడె మొక్కులతో రాజన్న ఆలయానికి ఏటా రూ 22కోట్లు వస్తు న్న అందులో కేవలం రూ 18 లక్షలు ఖర్చు పెడితే కోడెలు బాగుంటాయ న్నారు. ఇలాంటి పరిస్థితులు మళ్ళీ రావద్దనీ,వీరి చేతగాని తనం, అసమర్థ పాలన వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు.ఇప్పటికైన రాజన్న కోడెల సంరక్షణ సరిగా చేపట్టాలనీ రద్దీకి తగినట్లు సౌకర్యాలు కల్పించలన్నారు.తక్షణమే సంబంధిత వారిపై చర్యలు తీసుకొని గడ్డి స్కామ్ పై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, రామతీర్థపు రాజు, రాఘవరెడ్డి, పొలస నరేందర్, మ్యాకల రవి, మాజీ కౌన్సిలర్లు నిమ్మిశెట్టి విజయ్,నరాల శేఖర్,జోగిని శంకర్ నాయకులు నరాల దేవేందర్ వెంగళ శ్రీకాంత్ గౌడ్, చేపూరి రవీందర్ తో పలువురు పాల్గొన్నారు.



ఈ విజయం భారత జట్టుకు యూరప్ పర్యటనలో బలమైన పునాదిని వేసింది. బెల్జియం వంటి బలమైన జట్టుపై గెలిచిన ఈ ఫలితం, వరల్డ్ కప్ సన్నాహాల్లో జట్టు ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. నిధి నేతృత్వంలోని ఈ యువ జట్టు, గీతా యాదవ్, సోనమ్, లథన్ట్లుంగి వంటి ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనతో రాణిస్తోంది. జూన్ 10న జరిగే రెండో మ్యాచ్‌లో కూడా ఇదే జోరును కొనసాగించాలని జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.

# అదిరిన బోణీ..!

## యూరప్ పర్యటనలో బెల్జియంపై థ్రిల్లింగ్ విక్టరీ..

ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ సన్నద్ధతలో ఉన్న భారత మహిళల జూనియర్ హాకీ జట్టు యూరప్ పర్యటనను విజయంతో ఆరంభించింది. ఆదివారం జరిగిన పోరులో బలమైన బెల్జియం ను చిత్తుగా ఓడించింది. తద్వారా ఈ లీగ్‌లో గోల్ కీపర్ నిధి నేతృత్వంలోని టీమిండియా అదిరే బోణీ కొట్టింది. ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై దాడి చేసిన భారత అమ్మాయిలు జట్టుకు 3-2తో విక్టరీని అందించారు. జూన్ 10న మళ్లీ బెల్జియంతోనే భారత్ తలపడనుంది. ఈమధ్యే నాలుగు దేశాల టోర్నీలో అద్భుతంగా రాణించిన భారత జట్టు తొలి మ్యాచ్‌లోనే అదరగొట్టింది. పటిష్టమైన బెల్జియం డిఫెండర్ల కళ్లు గప్పుతూ.. తొలి అర్థ భాగంలోనే ఫార్వర్డ్ ప్లేయర్ గీతా యాదవ్ గోల్ చేసింది. 11 వ నిమిషంలో ఆమె చేసిన గోల్‌తో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే.. 25వ నిమిషంలో ప్రత్యర్థి క్రీడాకారిణి మరీ గోయెన్స్ స్కోర్ సమం చేసింది. కాసేపటికే లూయిస్ వాన్ హెకే గోల్‌తో బెల్జియం జట్టు స్కోర్ 2-1కు చేరింది. అయినా సరే భారత క్రీడాకారిణులు ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు.
సోనమ్ 40వ నిమిషంలో మెరుపు గోల్‌తో పోటీలోకి వచ్చిన టీమిండియా ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వలేదు. 45వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్ పోస్ట్‌లోకి పంపిన డిఫెండర్ లథన్ట్లుంగి భారత్‌కు స్పష్టమైన ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత బెల్జియం అమ్మాయిలు గోల్ కోసం చేసిన ప్రయత్నాలను మన ఢిఫెండర్లు తిప్పికొట్టారు. దాంతో, భారత్ తొలి పోరులోనే భారీ విజయంతో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకుంది.




# పతకాల వర్షం

- తైవాన్ ఓపెన్‌లో భారత అథ్లెట్ల జైత్రయాత్ర
- నాలుగు స్వర్ణాలు, ఒక రజతం

తైవాన్ ఓపెన్ అథ్లెటిక్స్‌లో భారత అథ్లెట్లు అద్భుత ప్రదర్శనతో పతకాల వర్షం కురిపించారు. శనివారం జ్యోతి ఎర్రాజీ, అబ్దుల్లా, పూజలు స్వర్ణ పతకాలతో సత్తా చాటగా, ఆదివారం చివరి రోజున మరో నాలుగు బంగారు పతకాలు సాధించారు. మూడుసార్లు జాతీయ ఛాంపియన్ విథ్యా రామరాజ్, రోహిత్ యాదవ్, పూజా, కృష్ణ కుమార్ తమ విభాగాల్లో అద్వితీయ ప్రదర్శనతో స్వర్ణాలు గెలుచుకున్నారు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్‌లో యశాస్ పలాక్ష రజత పతకంతో మెరిశాడు.
ఆదివారం జరిగిన మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో విథ్యా రామరాజ్ అసాధారణ ప్రతిభతో 56.53 సెకన్లలో గమ్యాన్ని చేరి స్వర్ణం సాధించింది. ఈ విజయంతో రాబోయే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో ఆమె ర్యాంకింగ్స్ మెరుగవనున్నాయి. జావెలిన్ త్రోలో రోహిత్ యాదవ్ 74.42 మీటర్ల దూరం ఈటె విసిరి, అత్యుత్తమంగా నిలవకపోయినా స్వర్ణం సొంతం చేసుకున్నాడు. భారత అథ్లెట్లు తైవాన్ ఓపెన్‌లో చివరి రోజున స్వర్ణ విజయాలతో దేశ గౌరవాన్ని ఉన్నతంగా నిలిపారు.



# హెన్రిచ్ క్లాసెన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు

దక్షిణాఫ్రికా విధ్వంసక బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ ఊహించని విధంగా అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించి అభిమానులను ఆశ్చర్యంలో ముంచెత్తాడు. ఐపీఎల్ 18వ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున మెరుపు సెంచరీ సాధించిన ఈ వికెట్ కీపర్-బ్యాటర్, 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలనే ఆకాంక్షతో ఉన్నప్పటికీ, ఊహించని నిర్ణయంతో అందరినీ నివ్వెరపరిచాడు. తన రిటైర్మెంట్ నిర్ణయం వెనుక రెండు ప్రధాన కారణాలను క్లాసెన్ స్పష్టం చేశాడు: దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు సెలెక్టర్ల తీరు మరియు హెడ్ కోచ్ రాబ్ వాల్టర్ వైదొలగడం.
రిటైర్మెంట్ నిర్ణయం వెనుక కారణాలు
క్లాసెన్ తన నిర్ణయంపై మాట్లాడుతూ, "2027 వరల్డ్ కప్‌లో ఆడాలనే కల నాకు ఉండేది. కానీ, దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు వైఖరితో విసిగిపోయాను. హెడ్ కోచ్ రాబ్ వాల్టర్ పదవీ విరమణ, సెంట్రల్ కాంట్రాక్ట్‌లో నా పేరు లేకపోవడం నన్ను తీవ్రంగా బాధించాయి. గత కొన్ని రోజులుగా నా ప్రదర్శన, జట్టు గెలుపోటముల గురించి నేను పెద్దగా పట్టించుకోలేదు," అని వెల్లడించాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ముందు రాబ్ వాల్టర్‌తో సుదీర్ఘంగా చర్చించినట్లు క్లాసెన్ తెలిపాడు. "దక్షిణాఫ్రికా క్రికెట్‌లో జరుగుతున్న పరిణామాలు నన్ను అసంతృప్తికి గురిచేశాయి. గతంలా దేశం కోసం ఆడడాన్ని నేను ఆస్వాదించలేకపోతున్నాను. రాబ్ పదవీకాలం ముగియడం, బోర్డు నా విషయంలో శ్రద్ధ చూపకపోవడం నా నిర్ణయాన్ని సులభతరం చేశాయి," అని ఆయన పేర్కొన్నాడు.
రిటైర్మెంట్ తర్వాత తన ప్రణాళికల గురించి క్లాసెన్ మాట్లాడుతూ, "గత నాలుగేళ్లుగా విరామం లేకుండా క్రికెట్ ఆడాను. ఇప్పుడు నేను రిలాక్స్ కావాలనుకుంటున్నాను. ఏడాదిలో ఆరు నుంచి ఏడు నెలలు కుటుంబంతో సమయం గడపడానికి అవకాశం ఉంటుంది," అని చెప్పాడు. ఈ నిర్ణయం తన వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇవ్వడానికి సహాయపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశాడు.
ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున కీలక ఆటగాడిగా ఎదిగిన క్లాసెన్, 17వ సీజన్‌లో తన విధ్వంసక బ్యాటింగ్‌తో అభిమానులను అలరించాడు. ఫ్రాంచైజీ అతడిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, 18వ సీజన్‌లో 12 మ్యాచ్‌లలో 487 రన్స్‌తో సెంచరీ సాధించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.23 కోట్లకు ఈ సఫారీ ఆటగాడిని రిటైన్ చేసుకుంది, ఇది అతడి విలువను తెలియజేస్తుంది. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ, క్లాసెన్ ఐపీఎల్ వంటి ఫ్రాంచైజీ లీగ్‌లలో కొనసాగే అవకాశం ఉంది. అతడి విధ్వంసక బ్యాటింగ్, వికెట్ కీపింగ్ నైపుణ్యాలు అభిమానులను ఇప్పటికీ ఆకర్షిస్తాయి. దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేసిన క్లాసెన్, తన కెరీర్‌లో కొత్త అధ్యాయం ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నాడు.

18వ సీజన్‌లో..
12 మ్యాచ్‌లలో...
487 రన్స్

# నిప్పులు చెరిగిన ఖలీల్..



ఐపీఎల్‌లో అదరగొట్టిన ఖలీల్ అహ్మద్(4-55) ఇంగ్లండ్ గడ్డపై కూడా నిప్పులు చెరుగుతున్నాడు. రెండో అనధికారిక టెస్టులో ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్ ఇంగ్లండ్ లయన్స్‌ను గట్టి దెబ్బ కొట్టాడు. నలుగురు మిడిల్ ఆర్డర్ బ్యాటర్లను పెవిలియన్ పంపి ఆ జట్టను ఆలౌట్ అంచున నిలిపాడు. దాంతో, ఆతిథ్య జట్టు లంచ్ సమయానికి 8 వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసింది.
మొదటి అనధికారిక టెస్టు మాదిరిగానే రెండో మ్యాచ్ కూడా డ్రా దిశగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్(116) విధ్వంసక సెంచరీతో 348 రన్స్ కొట్టిన భారత ఏ జట్టు.. అనంతరం ఇంగ్లండ్ లయన్స్‌ను కట్టడి చేయడంలో విఫలమైంది. బౌలర్ల వైఫల్యంతో ఇంగ్లండ్ కుర్రాళ్లు క్రీజులో పాతుకుపోయారు. అయితే.. రెండోరోజు తేలిపోయిన భారత బౌలర్లు మూడోరోజు మాత్రం విజృంభించారు. ఓవర్‌నైట్ స్కోర్ 192-3తో మూడో రోజు బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌ను ఖలీల్ అహ్మద్(4-55) కోలుకోలేని దెబ్బ కొట్టాడు.బంతిని స్వింగ్ చేసిన ఖలీల్ తొలి సెషన్‌లోనే వికెట్ల వేట కొనసాగించాడు. అతడి పేస్‌కు లయన్స్ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. జోర్డాన్ కాక్స్(45)ను ఔట్ చేసిన అతడు ఆతిథ్య జట్టును దెబ్బకొట్టాడు. మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పిన కాక్స్ వికెట్‌తో ఇంగ్లండ్ పతనం మొదలైంది. ఆ తర్వాత జేమ్స్ రెవ్(10), జార్జ్ హిల్(0), క్రిస్ వోక్స్(5)ను పెవిలియన్ పంపిన ఖలీల్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. దాంతో, ఇంగ్లడ్ లంచ్ టైమ్‌కు 8 వికెట్లు కోల్పోయి 266 రన్స్ చేసింది. ప్రస్తుతం ఫర్హాన్ అహ్మద్(19), జోష్ టంగ్ (14)లు క్రీజులో ఉన్నారు.

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు మరో మూడు రోజులే ఉంది. ఇప్పటికే లండన్ చేరుకున్న ఆస్ట్రేలియా ఆటగాళ్లు మ్యాచ్ కోసం సన్నద్ధమవుతున్నారు. రెండో ఫైనలిస్ట్ అయిన దక్షిణాఫ్రికా జట్టు సైతం శనివారం లండన్‌లో అడుగుపెట్టింది. ప్రతిష్టాత్మకమైన టెస్టు గద పోరుకోసం ప్రత్యేక బస్సులో లార్డ్స్ చేరుకున్నారు సఫారీ క్రికెటర్లు.



మంత్రివర్గ విస్తరణలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి చోటు దక్కకపోవడంతో బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారు. వివిధ పార్టీలో ఉండి కాంగ్రెస్ పార్టీని దుమ్మెత్తి పోసి ఇటీవల పార్టీలో చేరిన నాయకులకు కుల సమీకరణ పేరుతో మంత్రి పదవులు ఇవ్వడం ఇక్కడి కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. గత పది సంవత్సరాల నుండి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అధికారం లేకపోయినప్పటికీ అప్పటి అధికార పార్టీ నాయకుల ఒత్తిడిని తట్టుకోవడంతో పాటు పార్టీలో చేరాలని బలవంతం చేసినప్పటికీ ససేమిరా అన్న ఏకైక నాయకుడు సుదర్శన్ రెడ్డి అనే విషయం ప్రతీ ఒక్కరికి తెలిసిందే.



# మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్ రెడ్డికి దక్కని చోటు

## సమీకరణ పేరుతో కొత్తవారికి చోటు కల్పించడం సిగ్గుచేటు

### నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల రహస్య భేటీ

**బోధన్, జూన్ 8 ( జనంసాక్షి ) :**
అవినీతికి చోటు లేకుండా ప్రజల సంక్షేమమే తన ధ్యేయంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా రాముని పరిపాలన కొనసాగించిన మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డికి మంత్రివర్గ విస్తరణలో చోటు కల్పించకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీకే కోశాధికారి బాధ్యతలు నిర్వహించడంతో పాటు వైద్య విద్య, భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టి ఉమ్మడి రాష్ట్ర ప్రజల మన్ననలు పొందిన ఏకైక నాయకుడు సైతం సుదర్శన్ రెడ్డి అని చెప్పవచ్చు. అయితే అలాంటి మచ్చలేని నాయకుడికి అధిష్టానం ఆశాభంగంతో పాటు అవమానకర రీతిలో మంత్రి పదవి ఇవ్వకుండా తాత్సారం చేయడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. కుల సమీకరణల పేరుతో పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని పక్కన పెట్టినప్పటికీ ఇటీవల మంత్రివర్గంలో చోటు కల్పించిన మంత్రుల గత చరిత్ర తీసుకుంటే ఇతర పార్టీలోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ నాయకులను దుమ్మెత్తి పోయడంతో పాటు పలకలేని భాషలో దూర్భాషలాడిన సంఘటనలు ప్రతి ఒక్క నాయకులకు తెలిసిందే. అలాంటి వ్యక్తులకు మంత్రి పదవి కట్టబెట్టి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అబాసపాలు అయిందనే ఆరోపణలు సైతం లేకపోలేదు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేయడంతో పాటు ఇప్పటివరకు పార్టీ మారని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మంత్రి పదవికి ఏరకంగా అర్హుడు కాడో అధిష్టానం చెప్పాలని ఇక్కడి కాంగ్రెస్ నాయకులు పార్టీ అధిష్టానాన్ని ప్రశ్నిస్తున్నారు. సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి రాకపోవడంతో బోధన్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు రహస్య సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని భవిష్యత్తులో చేపట్టే కార్యక్రమాల గురించి చర్చించుకున్నట్లు సమాచారం. యూత్ కాంగ్రెస్ నాయకులైతే ఒక అడుగు ముందుకు వేసి తమ పార్టీ పదవులకు రాజీనామా చేయడంతో పాటు గాంధీ భవన్ ను ముట్టడించడమా లేక ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడమా అని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ అధిష్టానంకు పాతనీరు కంటే కొత్తనీరుపై అభిమానం పెరిగిపోవడం రానున్న కాలంలో పార్టీ మనుగడకే ప్రమాదం అని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా గుర్తింపు సాధించడంతోపాటు రెండుసార్లు మంత్రి పదవులను చేపట్టిన సుదర్శన్ రెడ్డికి మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కకపోవడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ నాయకులు అనుకుంటున్నారు. కుల సమీకరణలకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తలొగ్గి వారికి పదవులు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసం అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. బోధన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు మరి కొంతమంది నాయకులు కరుడుగట్టిన కాంగ్రెస్ నాయకులుగా పేరు సంపాదించారంటే ఏ మేరకు కాంగ్రెస్ పార్టీతో మమేకమయ్యారనే విషయం పార్టీ అధిష్టానం గుర్తిస్తే బాగుంటుందని కాంగ్రెస్ నాయకులు కోరుతున్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కంటే తమకు పార్టీ పదవులు అంత ముఖ్యమేమీ కాదని అవసరమైతే నియోజకవర్గంలోని చిన్నస్థాయి కార్యకర్త నుండి పెద్ద స్థాయిలో కొనసాగుతున్న నాయకుల వరకు మూకుమ్మడి రాజీనామా చేసేందుకు సైతం సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ నాయకులు పార్టీ అధిష్టానాన్ని హెచ్చరించారు. కుల సమీకరణ పేరుతో సీనియర్ కాంగ్రెస్ నాయకులకు అన్యాయం జరుగుతుందనే విషయాన్ని పార్టీ అధిష్టానం గుర్తించకపోవడం వారి విధేయతకే వదిలేస్తున్నామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. వివిధ సామాజిక నాయకులకు మంత్రి పదవులను అప్పచెబుతున్న పార్టీ అధిష్టానం మరి నిజామాబాద్ జిల్లాలో రానున్న సంస్థాగత ఎన్నికలలో అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఎవరు ముందుకు వస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. మొదటిసారి మంత్రివర్గ విస్తరణలోనే ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి చోటు కల్పించాల్సిన అధిష్టానం అసలు ఆయన ఊసే ఎత్తకపోవడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్ శ్రేణులు ప్రశ్నిస్తున్నారు. ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో నిజామాబాద్ జిల్లా పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్తులో జరిగే మంత్రివర్గ విస్తరణలో మాత్రం సుదర్శన్ రెడ్డి చోటు కల్పించకుంటే మాత్రం మూకుమ్మడి రాజీనామాల పర్వం కొనసాగుతుందని బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పార్టీ అధిష్టానాన్ని హెచ్చరించారు.

# తునికి ఆకు బోనస్ కోసం అడవి బిడ్డలకు అన్యాయం

## అక్రమాలకు పాల్పడితే టెండర్లు పూర్తిగా రద్దు చేస్తాం


### కొత్తగూడ ఫారెస్ట్ రేంజ్ అధికారి వజహత్





కొత్తగూడ అటవీ రేంజ్ అధికారి వజహత్ మాట్లాడుతూ కూలీలకు ఇచ్చినటువంటి ఖాతా బుక్కులో నమోదైన ప్రకారం ఆన్లైన్లో లేని పక్షంలో గుత్తేదారులను గుర్తించి వారికి టెండర్ క్యాన్సిల్ చేయడం జరుగుతుందని అన్నారు.కూలి డబ్బులు నేరుగా వారి బ్యాంక్ ఖాతా లో జమ చేస్తామని అన్నారు.ఆకు సేకరణ బుక్ లో నమోదైన వివరాలు బ్యాంకు ఖాతాలో జమ అయ్యో రూపాయలను చూసుకోవాలని అన్నారు.అంమౌంట్ తక్కువగా జమ చేసిన,నేరుగా డబ్బులు ఇచ్చిన మా దృష్టికి తీసుకొని రావాలని కోరారు.

**కొత్తగూడ జూన్ 8 జనంసాక్షి:**
అడవిలో ప్రకృతి సిద్ధంగా దొరికే వనరులను నమ్ముకొని వాటిని అమ్ముకునే అడవి ప్రాంత ప్రజలకు తునికి ఆకు జీవనాధారంగా మారింది. ఎండాకాలం వచ్చిందంటే ఏజెన్సీ ప్రాంతంలో దొరికే తునికి (బీడీ)ఆకు సేకరించి ప్రభుత్వం కేటాయించిన గుత్తేదార్ ఏర్పాటుచేసిన కళ్ళం లో కూలీలు సేకరించిన ఆకును ఆ కళ్ళం లో వేసి రోజు వారి కూలి ఖాతా బుక్కులో నమోదు చేసుకోవడం జరుగుతుంది.ఆలా కూలిల నుండి సేకరించిన తునికి ఆకును అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం కు విక్రయం చేస్తూ ఉంటారు.గుత్తేదార్ ఏజెన్సీ లో ఏజెంట్ లను నియమించుకుని ఇష్ట రాజ్యం గా అక్రమంగా సంపాదన ధేయంగా ప్రభుత్వాన్ని మోసం చేస్తున్న... చూస్తూ ఉన్న అధికారులు.అడవి ప్రాంతం ప్రజలు బుక్కెడు బుక్కెడు నీళ్లు తాగి సేకరించిన తునికి ఆకు అక్రమంగా అక్రమార్కులకు ఆస్తులు పెంచే అవకాశంగా మారింది. అడ్డంగా దోచుకొని అక్రమం గా సెకరించిన ఆకు ను గుతేదార్ తన సొత ఇంటి వారి పేర్లు నమోదు చేసి ప్రభుత్వ ఆదాయం కు గండి కొడుతున్నారు.కష్టం చేసిన వారికి కాకుండా రాసుకున్న వారికీ రాసుకున్నంత అనే రీతిలో ఉంది. నిజమైన లబ్ధి దారుల పేర్లు ఆన్ లైన్ లో నమోదు అయ్యాయా...!అనే అనుమానం వ్యక్తం చేస్తున్న ప్రజలు.గతం లో లబ్ధి దారులు బ్యాంక్ బుక్ జీరాక్స్ ఇచ్చిన వారి ఖాతా లో నగదు జామచేయకుండా నేరుగా నగదు ఇవ్వడం జరిగింది.నగదు ఇవ్వడం ఏంటని కూలి లు అడిగితే మి బ్యాంక్ లో అంమౌంట్ జమ కావడం లేదని అనడం తో చేసేదేం లేక కూలీలు ఆ నగదు తీసుకున్నారు.కూలి లకు బోనస్ రూపం లో



అన్యాయం జరిగింది.ఇలా కూలి లు సేకరించిన ఆకును వారి సొంత ఖాతాలో జమ చేసుకుని కూలి లకు అన్యాయం చేస్తున్నారు.మరి కొంత మంది కూలిల పేర్లు ఆన్ లైన్ లో నమోదు చేసిన...సేకరించిన తునికి ఆకు లో సగమే నమోదు చేసి మిగతా సాగం ఏజెంట్, ఇతర వ్యక్తుల ఖాతాలో నమోదు చేసుకొని అడ్డదారిలో బోనస్ సంపాదిస్తు న్నారు. ఇంతలా జరుగుతుంటే అధికారులు ఆకు సేకరణ చూస్తున్నా రు.కాని చెట్టు పుట్టల వెంట తిరిగిన కూలిల కష్టం గుర్తింపు లేదు.



వట్టం ఉపేందర్ తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ కూలి కి చెందిన రోజువారి తునికి ఆకు బుక్ లో నమోదు అయినా కట్టల ప్రకారం ఆన్ లైన్ లో నమోదు వివరాలు ఒక్కే విధంగా ఉండాలని అక్రమాలు చేసిన వారి టెండర్ లైసెన్స్ రద్దు చేయాలని అన్నారు.ఆదివాసీ లకు అన్యాయం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.



# బాల్య వివాహాలపై అవగాహన

**ఖానాపూర్ జూన్ 08 (జనం సాక్షి) :** మండలంలోని మేడం పల్లి గ్రామంలో ఆదివారం బాల్య వివాహం జరగనున్నట్లు 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించడంతో సంబంధిత శాఖలు అప్రమత్తమయ్యాయి. హుటాహుటిన శనివారం రాత్రి మేడంపల్లి గ్రామానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. మేడంపెల్లి గ్రామానికి చెందిన మైనర్ యువతి వివాహం అదే గ్రామానికి చెందిన యువకుడితో జరిపిస్తున్నట్లు తేలింది. దీంతో ఐసిపిఎస్, ఐసిడిఎస్, పోలీసు శాఖ అధికారులు బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని బాల్య వివాహాలు చేయవద్దని తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులకు అధికారులు అవగాహన కల్పించారు. దీంతో తల్లిదండ్రులు స్పందించి సంబంధిత ధ్రువపత్రాలను ఆధార్ కార్డు, బోనఫైడ్ లను అధికారులకు చూపి మైనర్ లు కాదని తేలడంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ఆదివారం యధావిధిగా వివాహం జరిగింది.

# ఆత్మీయ మిత్రుడిని కోల్పోయా..

## మాగంటి మృతిపై ఎమ్మెల్యే కాలేరు భావోద్వేగం

గోల్నాక, జూన్ 8: బీఆర్ఎస్ సీనియర్ నేత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపై అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తీవ్ర భావోద్వేగాని లోనయ్యారు. ఆదివారం ఉదయం మాదాపూర్‌లోని నివాసంలో మాగంటి గోపినాథ్ భౌతికకాయం వద్ద ఆయన నివాళులు అర్పించారు. మాగంటి మృతితో తాను మంచి ఆప్త మిత్రుడిని కోల్పోయానని అన్నారు. తన సహచరుడు ఇక లేరన్న విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నానని ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని చెప్పారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా ఆయన జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషి ఎప్పటికీ మరవలేమని అన్నారు. మాగంటి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు.

# మునీర్ మృతి రాష్ట్రానికి తీరని లోటు

- తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు అల్లం నారాయణ
- అక్షర సూర్యుడికి ఘన నివాళులు..





**నస్పూర్, జూన్ 8, (జనంసాక్షి):** మునీర్ మృతి రాష్ట్రానికి తీరని లోటని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు అల్లం నారాయణ అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సుచిత్ర ఫంక్షన్ హాల్ వేదికగా ఆదివారం మధ్యాహ్నం సీనియర్ పాత్రికేయులు,జేఏసీ అధ్యక్షుడు,తెలంగాణ ఉద్యమకారులు మునీర్ సంతాప సభను ఘనంగా నిర్వహించారు.తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ మంచిర్యాల జిల్లా కన్వీనర్ దాసరి ఉమేష్,కో కన్వీనర్లు రేణుకుంట్ల శ్రీనివాస్, చట్ల రమేష్,కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కన్వీనర్ రవి నాయక్ ల అధ్యక్షతన సభ నిర్వహించారు.ఈ సభలో జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు అల్లం నారాయణ,ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్,మునీర్ తనయుడు మయూర్,మునీర్ సోదరుడు సంధాని,మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు,టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి,ఇఫ్టు నాయకుడు శ్రీనివాస్,మాదాసి రాంమూర్తి ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొని మునీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఫ్యూడల్ వ్యవస్థలో కాళ్లకు చెప్పులు వేసుకున్న తల ఎత్తి నడిచిన కొరడా జులిపించి చిత్రహింసలకు గురి చేసిన కాలంలో ఫ్యూడల్ వ్యవస్థను మునీర్ కూకటివేళ్లతో తొలగించారని అన్నారు.మహిళలను అత్యాచారాలు చేసి హత్యలు చేయడం,అడ్డు చెప్పిన వారినీ హత్యలు చేసే ఘటనల పై తిరుగుబాటు చేసిన మునీర్ జైలు జీవితం గడిపారని అన్నారు.కనీస వసతులకు నోచుకొని ఆదివాసీల నుండి రాకాసి బొగ్గు గనుల్లో రక్తాన్ని చమటగా మార్చి దేశానికి వెలుగులు పంచె గని కార్మికులు,కండ్లన్ని పిండి చేసి శరీరంలో సత్తువ లేని శ్రామికులు,ప్రజల కోసం జీవితం మొత్తం త్యాగం చేసిన త్యాగశీలి మునీర్ అని అన్నారు. ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ మాట్లాడుతూ అక్షర సూర్యుడు మునీర్ మృతి జర్నలిస్ట్ లోకానికి అంధకారంల మారిందని అన్నారు.గ్రామీణ ప్రాంతాల సమస్యల నుండి రాష్ట్ర,దేశ ప్రజల సమస్యల పై తనదైన శైలిలో సామాజిక స్పృహతో స్పందించే కలం యోధుడు కన్నుమూయడం అక్షరాలకు తీరని దుఃఖం కడుపుకోతను మిగిల్చింది అని అన్నారు.జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు,మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ అంపశయ్య మీద ఉన్న తెలంగాణ ఉద్యమానికి ఊపిరినీ అందించిన ఘనత నల్ల నేలకు అంకితం అని అందుకోసం అహర్నిశలు శ్రమించిన మునీర్ కాంట్రిబ్యూషన్ మరువలేనిది అని అన్నారు. ఉద్యమ సమయంలో మునీర్ పిలుపు మేరకు కోల్ బెల్ట్ వ్యాప్తంగా ఎక్కడికక్కడ రోడ్ల మీదకు వచ్చిన వేలాది మంది కార్మికులను చూస్తే తెలంగాణ రావడం ఖాయం అని భావించాం అని అన్నారు.సింగరేణి బొగ్గు అగ్గి సెగ నల్ల నేల నుండి ఢిల్లీ నోయిడా వరకు అగ్గి రాజేసిందని ఆ అగ్గి పుట్టించింది మునీర్ అని అన్నారు.కోల్ బెల్ట్ జర్నలిస్టులు డిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన సభకు సైతం మునీర్ వెన్నుదన్నుగా నిలిచారని, మునీర్ తో తనకు ఎంతో అనుబంధం ఉందని త్వరలో కోలుకుంట కలుసుకుందాం నేస్తం అంటూ కన్నుమూశారనీ కంటతడి పట్టుకుంటూ మునీర్ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

**మునీర్ విగ్రహం ఏర్పాటు,మునీర్ పేరిట అవార్డులు అందజేయాలని వినతి..**

తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిస్ట్ మునీర్ ప్రేరణతో ప్రారంభించిన రివల్యూషన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అనిల్ భగత్,ఉపాధ్యక్షుడు అక్బర్ లు మునీర్ విగ్రహం ఏర్పాటు అలాగే జర్నలిస్టులకు కార్మికులకు అందించే అవార్డులును మునీర్ పేరిట అందించాలనీ అల్లం నారాయణకు వినతిపత్రం అందజేశారు.శ్రీ స్వేచ్ఛలో సింగరేణి స్వేచ్ఛలో మునీర్ ఉన్నారని అందుకోసం జర్నలిస్ట్ పెద్దలు, ప్రజాప్రతినిధులు,కార్మిక సంఘం నాయకులు,ప్రజా సంఘాలు ముందుకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి కోల్ బెల్ట్ ప్రజల విజ్ఞప్తిని తీసుకెళ్ళాలని కోరారు.

# ‘అడ్లూరి’ది అలుపెరుగని ప్రయత్నం

- ఎట్టకేలకు అమాత్యయోగం



**జగిత్యాల (జనంసాక్షి) :** వరుస పరాజయాలు ఎదురైనా లెక్క చేయకుండా దాదాపు రెండు దశాబ్దాల పాటు పోరు సాగించారు. ఆ పోరాట ఫలితంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మొదటి సారే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి వరించింది. కాంగ్రెస్ పార్టీ సైనికుడిగా విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ సహా జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా వివిధ పదవులు చేపట్టారు. సామాజిక సమీకరణాల కసరత్తులో భాగంగా అడ్లూరికి మంత్రి పదవికి దక్కడంతో అనుచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టిన పట్టు విడవకుండా అలుపెరుగని ప్రయత్నం చేస్తే విజయం దాసోహమవుతుంది అనేందుకు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిదర్శనంగా నిలిచారు. శాసనసభ ఎన్నికల్లో పరాజయాలు ఎదురైనా వెనుదిరగక, పోరాడి గెలిచిన మొదటిసారే అమాత్యయోగం వరించింది. అడ్లూరి 1968లో జన్మించారు. ఆ కాలంలోనే ఐటీఐతో పాటు ఇంటర్ పూర్తి చేశారు. విద్యాభ్యాసం నుంచే పాలిటిక్స్ మీద ఆసక్తి ఉన్న అడ్లూరి, ఎన్ఎస్‌యూఐతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1982 నుంచి 1985 వరకు గోదావరిఖని జూనియర్ కళాశాల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పని చేశారు. 1986 నుంచి 1994 వరకు కరీంనగర్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1996 నుంచి 2001 వరకు ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2004లో నందిమేడారం నియోజకవర్గం నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. 2006లో ధర్మారం ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి జెడ్పీటీసీగా పోటీ చేసి విజయం సాధించారు. 2009లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కొత్తగా ఏర్పడిన ధర్మపురి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసినా, విజయం వరించలేదు. అయితే 2010 నుంచి 2012 వరకు కరీంనగర్ జడ్పీ ఛైర్మన్‌గా పని చేశారు. 2010లో మరోసారి ధర్మపురి నియోజకవర్గానికి ఉప ఎన్నికలు రాగా, మళ్లీ అదృష్టాన్ని పరీక్షించుకున్నప్పటికీ నిరాశే ఎదురైంది. 2013 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పని చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014, 2018లో ధర్మపురి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. 2018 నుంచి జగిత్యాల జిల్లా పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీకి సేవలందిస్తున్నారు.

2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై 22 వేల ఓట్ల మెజారిటీతో గెలిచి, తొలిసారిగా అసెంబ్లీకి వచ్చారు. 2023 డిసెంబర్ 15న అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను రాష్ట్రప్రభుత్వం విప్‌గా నియమించింది. ప్రస్తుతం సామాజిక సమీకరణాల నేపథ్యంలో మాదిగ సామాజికవర్గ కోటాలో ఆయనకు కేబినెట్ బెర్త్ ఖరారయ్యింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మూడో మంత్రి పదవి రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# బలూచిస్థాన్‌లో పాక్ కొత్త చట్టం

- సైన్యానికి మరింత పవర్!




గతంలో రహస్యంగా జరిగిన చర్యలకు ఇప్పుడు చట్టబద్ధత కల్పించారని ఆరోపణ పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్‌లో వేర్పాటువాద ఉద్యమాన్ని నియంత్రించేందుకు అక్కడి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తరచూ వివాదాస్పదమవుతున్నాయి. తాజాగా, బలోచిస్థాన్ అసెంబ్లీ ఆమోదించిన ఉగ్రవాద వ్యతిరేక (సవరణ) చట్టం 2025, స్థానికంగా తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. పౌరులు, మానవ హక్కుల సంఘాలు ఈ చట్టంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. బలూచ్ పౌరులను లక్ష్యంగా చేసుకుని ఈ చట్టాన్ని రూపొందించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కొత్త నిబంధనల ప్రకారం, ఎటువంటి నేరారోపణలు లేదా కేసులు నమోదు కాకపోయినా, కేవలం అనుమానం ఆధారంగా వ్యక్తులను అదుపులోకి తీసుకునే అధికారం పాకిస్థాన్ సైన్యానికి, నిఘా సంస్థలకు దఖలుపడుతుంది. అరెస్టు చేసిన వారిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టకుండానే 90 రోజుల వరకు నిర్బంధంలో ఉంచవచ్చు. అంతేకాకుండా, కోర్టుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే సోదాలు నిర్వహించడానికి, వస్తువులు స్వాధీనం చేసుకోవడానికి, వ్యక్తులను నిర్బంధించడానికి అవసరమైన ఆదేశాలు జారీ చేసేందుకు పోలీసు, నిఘా సంస్థల అధికారులతో కూడిన సంయుక్త దర్యాప్తు బృందాలకు (జేఐటీ) ఈ చట్టం అధికారం కల్పిస్తోంది. కేవలం ‘అనుమానం’ ఆధారంగా అరెస్టులు చేసే వెసులుబాటు కల్పించడం పట్ల పౌర సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**మానవ హక్కుల సంఘాల వ్యతిరేకత**

ఈ చట్టం ద్వారా పౌరులకు రాజ్యాంగబద్ధంగా లభించే న్యాయపరమైన రక్షణ పూర్తిగా కరువవుతుందని న్యాయ నిపుణులు, మానవ హక్కుల కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. గతంలో ప్రభుత్వ బలగాలు నీడచాటున, అనధికారికంగా సాగించిన చర్యలనే ఇప్పుడు చట్టబద్ధం చేశారని వారు ఆరోపిస్తున్నారు. ఈ చర్యలు అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలను, పాకిస్థాన్ రాజ్యాంగం కల్పించిన పౌర రక్షణలను పూర్తిగా ఉల్లంఘించడమేనని స్థానిక మానవ హక్కుల కమిషన్ ఆఫ్ పాకిస్థాన్ (హెచ్ఆర్‌సీపీ)తో పాటు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, హ్యూమన్ రైట్స్ వాచ్, ఇంటర్నేషనల్ కన్వెన్షన్ ఆన్ సివిల్ అండ్ పొలిటికల్ రైట్స్ (ఐసీసీపీఆర్) వంటి అంతర్జాతీయ హక్కుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

**బలోచిస్థాన్‌లో నెలకొన్న భయానక వాతావరణం**

బలోచిస్థాన్‌లో బలవంతపు నిర్బంధాలు, వ్యక్తులు అదృశ్యమవడం వంటి ఘటనలు దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. తమ ఆప్తులు ఏమయ్యారో తెలియక అనేక కుటుంబాలు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాయి. ఈ అదృశ్యాల వెనుక ప్రభుత్వ హస్తం ఉందనేది బహిరంగ ఆరోపణ. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తీసుకురావడం బలూచ్ పౌరులలో మరింత భయాందోళనలను రేకెత్తిస్తోందని పరిశీలకులు అంటున్నారు. ఈ పరిణామాలపై మానవ హక్కుల సంస్థ బలోచ్ యక్జేతీ కమిటీ (బీవైసీ) తీవ్రంగా స్పందించింది. ఈ చట్టంలోని నిబంధనలు వ్యక్తిగత స్వేచ్ఛకు, ఏకపక్ష నిర్బంధాల నుంచి పౌరులకు లభించాల్సిన రక్షణ హక్కుకు పూర్తిగా విఘాతం కలిగిస్తున్నాయని ఆ సంస్థ తీవ్రంగా విమర్శించింది.

# ఎన్నికైన ఒక్కరోజుకే సునీల్ నారంగ్ రాజీనామా

- టీఎఫ్‌సీసీ అధ్యక్ష పదవికి సునీల్ నారంగ్ రాజీనామా
- కొందరు తనను సంప్రదించకుండా ప్రకటనలు ఇస్తున్నారని ఆరోపణ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి (తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ - టీఎఫ్‌సీసీ) అధ్యక్ష పదవికి ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ సునీల్ నారంగ్ అనూహ్యంగా రాజీనామా చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికై, బాధ్యతలు స్వీకరించిన 24 గంటలు కూడా గడవకముందే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం తెలుగు సినీ పరిశ్రమలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో టీఎఫ్‌సీసీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో సునీల్ నారంగ్ వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా శ్రీధర్‌తో పాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సునీల్ నారంగ్ మాట్లాడుతూ, థియేటర్ల విషయంలో తరచూ వినిపించే “ఆ నలుగురు” అనే ప్రస్తావనలో వాస్తవం లేదని, థియేటర్లు వాటి యజమానుల వద్దే ఉన్నాయని స్పష్టం చేశారు. అంతేకాకుండా, “హీరోలు దేవుళ్ళతో సమానం. వారికి వ్యతిరేకంగా మాట్లాడే సాహసం ఏ ఎగ్జిబిటర్, డిస్ట్రిబ్యూటర్, నిర్మాత చేయరు” అని వ్యాఖ్యానించారు. అగ్ర కథానాయకుడు పవన్ కల్యాణ్ గురించి మాట్లాడుతూ, “ఆయన ఒక తుపాను లాంటి వారు, ఆయన సినిమాను ఆపగలిగే శక్తి ఎవరికీ లేదు” అని అన్నారు. అయితే, ఇంతలోనే అనూహ్యంగా ఆదివారం ఉదయం సునీల్ నారంగ్ తన రాజీనామాను ప్రకటించారు. తనను సంప్రదించకుండానే కొందరు వ్యక్తులు ప్రకటనలు జారీ చేస్తున్నారని, తన ప్రమేయం లేకుండా వెలువడుతున్న అలాంటి ప్రకటనలకు తాను ఎలాంటి బాధ్యత వహించబోనని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాను అధ్యక్ష పదవిలో కొనసాగలేనని పేర్కొంటూ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. కేవలం ఒక్క రోజులోనే చోటుచేసుకున్న ఈ నాటకీయ పరిణామాలు టీఎఫ్‌సీసీ వర్గాల్లోనూ, మొత్తం తెలుగు చిత్ర పరిశ్రమలోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. రాజీనామా వెనుక ఉన్న అసలు కారణాలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# ఆరువేల మార్క్‌ను దాటిన కోవిడ్ కేసులు

**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా కొవిడ్ వేగంగా విజృంభిస్తోంది. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 6,000 మార్క్‌ను దాటినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం ప్రకటించింది. కొత్తగా 6,133 కేసులు నమోదు కాగా, గడిచిన 24 గంటల్లో ఆరు మరణాలు నమోదయ్యాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. 48గంటల్లో 769 కొత్త కేసులు నమోదవగా, కేరళ మొదటి స్థానంలో ఉందని తెలిపింది. గుజరాత్, పశ్చిమబెంగాల్, ఢిల్లీ తరువాతి స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది జనవరి నుండి దేశంలో 65 మరణాలు నమోదుకాగా, మే 22 నాటికి దేశంలో మొత్తం 257 యాక్టివ్ కేసులు ఉన్నాయి.పెరుగుతున్న కేసుల దృష్ట్యా కేంద్రం దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్‌ను నిర్వహిస్తోందని అధికారిక వర్గాలు తెలిపాయి. ఆక్సీజన్, ఐసోలేషన్ బెడ్‌లు, వెంటిలేటర్లు మరియు అవసరమైన మెడిసెన్స్‌ను అందుబాటులో ఉండేలా చూడాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి.

# కోనేరులో పడి.. ములుగు జిల్లా వాసి మృతి

**వేములవాడ (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో విషాదం చోటుచేసుకుంది. దైవదర్శనానికి వచ్చిన ములుగు జిల్లా మల్లంపల్లి మండలం భూపాల్ నగర్ (పందికుంట)కు చెందిన సాదం రాజు(32) మృతి చెందాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని కోనేరులో పడిన అతడు మరణించాడు. సాదం సమ్మయ్యకు ముగ్గురు కుమారులు కాగా రాజు(32) రెండో కుమారుడు కాకతీయ విశ్వవిద్యాలయంలో పీజీ, ఎంఈడి పూర్తి చేసి ప్రభుత్వ కొలువుల కోసం ప్రిపేర్ అవుతున్నాడు. తిరుపతి, వేములవాడ కోసం వెళ్లి వస్తానని గురువారం ఇంటి నుండి బయలుదేరాడు. ఆదివారం రాజు బంధువైన జక్కుల మహేందర్ వేములవాడ దైవదర్శనానికని వచ్చి రాజుకు కాల్ చేయగా అతడు లిఫ్ట్ చేయలేదు. తాను ఉదయం లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ కు వెళ్తానని తనతో చెప్పిన రాజు ఫోన్ ఎత్తకపోవడంతో ఇతర బంధువులు కూడా లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్ ఆవరణలో రాజు కోసం వెతికారు. అయితే.. పక్కనే ఉన్న కోనేరు దగ్గర రాజుకు సంబంధించిన బ్యాగు, చెప్పులు, పర్సు లభించాఇయి. కోనేరులో పడి ఉంటాడనే అనుమానంతో అందులో వెతకగా రాజు మృతదేహం లభించింది. వేములవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం కోసం బాడీని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. పంచనామా అనంతరం స్వగ్రామానికి రాజు మృతదేహాన్ని కుటుంబసభ్యులు తీసుకెళ్లనున్నారు.

# డబ్ల్యూపీసీ తెలంగాణ ఓపెన్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఉప్పల






**హైదరాబాద్ (జనంసాక్షి) :** నాగోల్ లోని ఆర్ఎస్ ఫిట్‌నెస్‌లో నిర్వాహకులు రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన డబ్ల్యూపీసీ తెలంగాణ ఓపెన్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్షిప్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ... నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు ఇలాంటి కార్యక్రమాలు మునుముందు కొనసాగించాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఇలాంటి చాంపియన్షిప్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించాలని ఆయన అన్నారు. మహిళలు పురుషులతో సమానంగా ముందుకు సాగాలని సూచించారు. మరెన్నో విజయాలు సాధించాలని ఆయన అన్నారు. 40 కిలోలు కల్గిన ఆమె 130 కిలోల వెయిట్ లిఫ్టింగ్ విజేతగా నిలిచిన తపస్య గారికి శుభాకాంక్షలు తెలిపారు. ఉప్పల ఫౌండేషన్ నుండి 5100 /- రూపాయల ఫ్రీజ్ నీ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రేఖ, ఐపీఎఫ్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్, కోచ్ చవాన్ ఖాన్ , తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ కృష్ణయ్య బీసీ వ్యతిరేక వైఖరిని ఖండిస్తున్నాం

- పెద్ద ధన్వాడ పరిసర గ్రామాల ప్రజల ఇథనాల్ వ్యతిరేక పోరాటాన్ని ఎత్తిపడుతున్నాం
- కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి(కేఏఎన్‌పీఎస్) అధ్యక్షులు బండారి లక్ష్మయ్య

**హైదరాబాద్ (జనంసాక్షి) :** పెద్ద ధన్వాడ ఇథనాల్ కంపెనీ రద్దు ఆందోళనలో అనేకమంది ప్రజలపై కంపెనీ యజమానులు ప్రైవేటు గుండాలచే దాడి చేయిస్తే ఆ దాడిలో గాయపడిన బాధితులవైపు నిలబడకుండా కంపెనీ యజమానులకు వత్తాసు పలకడంతో ఆర్ కృష్ణయ్య అసలు రంగు బయట పడిందని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి(కేఏఎన్‌పీఎస్) అధ్యక్షులు బండారి లక్ష్మయ్య తెలిపారు. దీనితో ఆయన ఇన్ని రోజులు వేసుకున్న బీసి ముసుగు ఆకాస్త కూడా తొలిగిపోయిందని, రేపు రేపు ఆ కంపెనీ వల్ల బాధితులుగా మారబోయేది పెద్ద ధన్వాడ గ్రామ మెజార్టీ బీసిలే,పేద బీసిలు ఏమైతే నాకెందుకు బలిసిన బీసి వైపు ఉంటే ఇంకాస్త లాభాలు దండుకోవచ్చనే దురుద్దేశమే లేకపోతే ఆర్.కృష్ణయ్య ఇలాంటి చౌకబారు ప్రకటన ఇవ్వరని, ఒక్క బలిసిన బీసీ వ్యాపారి కోసం మెజార్టీ బీసీల జీవితాలు నాశనం చేయాలనే వైఖరి తీసుకోవడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాటంలో బీసీ రైతులు, నాయకులపై దాడి చేసి జైల్లో నిర్బంధించి చిత్రహింసలపాలు చేసినప్పుడు ఆయనకు బీసీలు గుర్తుకు రాలేదా? లేదా ఒక బీసీ నాయకునిగా బడా రెడ్డి పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా బాధిత బీసీల తరపున కనీసం మాట్లాడాలనే ఆలోచన ఆయనకు లేకపోయిందా? లేదా బీసీ కార్డుతో ఏం మాట్లాడినా చెల్లుతుంది అనే ధీమాతో మాట్లాడుతున్నారా? అని ప్రశ్నించారు. ‘ఒట్టి మాటలు కట్టిపెట్టి గట్టిమేలు తలపెట్టవోయి’ అని గురజాడ అన్నట్లు పెద్ద ధన్వాడ పరిసర గ్రామాల ప్రజల మేలుకోసం పాటుపడమని కోరుతున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాలుష్యకారక ఇథనాల్ పరిశ్రమలకు వ్యతిరేకంగా మెజార్టీ బీసీ ప్రజలు పోరాడుతుంటే వారి పోరాటాలకు కనీస మద్దతు ఇవ్వని ఆయన ఇప్పుడు బీసీ నాయకుడిగా బయలుదేరడం సిగ్గుమాలిన చర్య అవుతుంది తప్ప వేరేకాదని, గతంలో చిత్తనూరు(నారాయణపేట జిల్లా), స్థంభంపల్లి (జగిత్యాల జిల్లా),దిలావర్ పూర్ (నిర్మల్ జిల్లా), గుగ్గిళ్ల(సిద్దిపేట జిల్లా), రావిపహడ్ (సూర్యాపేట జిల్లా) పరిసర గ్రామాల ప్రజల బాటలో నేడు పెద్ద ధన్వాడ(గద్వాల జిల్లా) పరిసర గ్రామాల ప్రజలు ఇథనాల్ కంపెనీలకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలు ఆయన కంటికి కనబడలేదా? లేక బిజెపి పార్టీ రాజ్యసభ ఎం.పిగా కేంద్ర ప్రభుత్వ ఇథనాల్ ఈ-20 పాలసీని సమర్తిస్తున్నారా,బీసీల పేరుతో ఈ దాగుడు మూతలు ఇప్పటికైనా కట్టిపెడితే బీసీలకు మేలు జరుగుతుంది. సమస్త సహజ వనరులన్నింటినీ కొల్లగొడుతూ మెజార్టీ ప్రజల జీవనోపాధి అయిన వ్యవసాయాన్ని దెబ్బదీసి విపరీతమైన కాలుష్యాన్ని వెదజల్లే ఇథనాల్ కంపనీలా! ప్రజల బతుకును మెరుగు పరిచేది? ఎంతమాత్రం కాదు.వేళ్ల మీద లెక్కబెట్టే పిడికెడు మంది పెట్టుబడిదారుల కోసం మొత్తం ప్రజల బ్రతుకులను బుగ్గి చేస్తామంటే బుద్దిజీవులు అనుకున్నవారెవరూ చూస్తూ ఊరుకోరని, ప్రజల తరపున ప్రజా పోరాటాల వైపు తప్పకుండా నిలబడుతారు.మీలాంటి ప్రజా వ్యతిరేకుల బండారం బయట పెడతారు. పెద్ద ధన్వాడ పరిసర గ్రామాల ప్రజల ఇథనాల్ వ్యతిరేక పోరాటానికి కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి నుండి మద్దతు, సంఘీభావం తెలుపుతున్నామన్నారు. బాధిత ప్రజలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నాం.బాధిత గ్రామాల ప్రజలపై విధించిన పోలీస్ నిర్భంధాన్ని నిలిపివేయాలని కోరారు.

# ఆదివాసీలను వెంటనే విడుదల చేయాలి

- తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కుత్రు , కచ్చురారం తో పాటు మరో రెండు గ్రామాల నుండి 60 మంది ప్రజలను కేంద్ర బలగాలు అదుపులోకి తీసుకున్న ఆదివాసీలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎం.నారాయణరావు డిమాండ్ చేశారు. చత్తీసుఘడ్ రాష్ట్ర బీజాపూర్ జిల్లా పరిధిలోని నేషనల్ పార్క్ లోని 4గ్రామాలు కుత్రు , కచ్చురారం తొ పాటు మరో రెండు గ్రామాల నుండి 60 మంది ఆదివాసీ ప్రజలను కేంద్ర బలగాలు 7/6/2025రోజున ఉదయం 11 గంటలకు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసిందని, ఇప్పటికే 2ఎన్కౌంటర్ల నుండి 7 గురు హత్య చేసిన సంఘటన జరిగి ఉన్నప్పటికీ 10మందిని అదుపులకు తీసుకొని 7హత్య గురిని ఎన్కౌంటర్ పేరా చేయడం మిగతా 3 గురి ఆచూకీ లభించకపోవడం ఇప్పుడు అదే ప్రదేశంలోని గ్రామాల నుండి ప్రజలను అదుపులోకి తీసుకోవడం ఆందోళనకు గురి చేస్తోందని తెలిపారు. కేంద్ర బలగాలు అదుపులో ఉన్న 60 తో పాటు 3 గురిని మొత్తం 63 మంది ప్రజలను ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370